PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 103 | విజయవాడ, శుక్రవారం 15 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 15 November 2024 | Rs



భారత్ హ్యాట్రిక్

- థాయ్‌లాండ్‌పై 13-0 గోల్స్‌తో భారీ విజయం
- ఆసియాకప్ మహిళల హాకీ

8

విజయనగరం ఎంఎల్‌సి ఉపఎన్నిక రద్దు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఉపఎన్నిక రద్దయింది. ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నుంచి ఈ మేరకు గురువారం ప్రకటన వెలువడింది. గత ప్రభుత్వంలో వైసిపి తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు ఎన్నికయ్యారు. కాలపరిమితి ప్రకారం ఆయన 2027 నవంబర్ 31 వరకు కొనసాగాల్సి ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ ఆయనపై అదే పార్టీకి చెందిన పాలవలస విక్రాంత్... శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో, శాసన మండలి చైర్మన్ ఈ ఏడాది జూన్ 2న అనర్హత వేసి రఘురాజును డిస్మిస్ చేశారు. దీనిపై ఆయన అప్పట్లోనే కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆరు వారాల పాటు స్టే విధించింది. ఈ నెల ఆరున తీర్పు రావాల్సి ఉన్నప్పటికీ 3వ తేదీనే ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో రఘురాజుకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో ఉపఎన్నిక రద్దయింది.

పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పెద్ద ఎత్తున పరిశ్రమలు
- 44శాతం వరకు రాయితీలు
- శాసనసభలో పారిశ్రామిక విధానంపై సిఎం
- కార్మికుల ఊసేలేని ప్రసంగం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి 35 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పెట్టుబడిదారులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. నూతన పారిశ్రామిక విధానంపై గురువారం సాయంత్రం శాసనసభలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రైవేటు రంగంలోనే పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయడం, వాటిని ప్రపంచ స్థాయికి అభివృద్ధి చేయడం, లావాదేవీలను ప్రపంచ స్థాయిలో నిర్వహించడం, పెట్టుబడిదారులకు భూములు, నీరు, కరెంటు వంటివి ప్రభుత్వమే సమకూర్చడం, ఉత్పత్తుల ఎగుమతులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం వంటి అంశాల గురించి ఆయన వివరించారు. తన సుదీర్ఘ ప్రసంగంలో పరిశ్రమలకు అత్యంత కీలకమైన కార్మికుల గురించి, కార్మిక చట్టాల అమలు గురించి. వారి సంక్షేమం గురించి మాట మాత్రంగా కూడా ప్రస్తావించలేదు. అదే సమయంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున చోటుచేసుకుంటున్న పారిశ్రామిక ప్రమాదాలు, వాటి నివారణ చర్యల గురించి కూడా సిఎం మాట్లాడలేదు. అదే విధంగా కాలుష్య నివారణకు నూతన విధానంలో ఎటువంటి చర్యలుంటాయన్న అంశాన్ని కూడా సిఎం ప్రస్తావించలేదు. ఇక నుంచి స్పీడ్ ఆఫ్



డూయింగ్ బిజినెస్ అనేదే ప్రభుత్వ విధానంగా ఉంటుందని తన ప్రసంగంలో చంద్రబాబు పునరుద్ఘాటించారు. రూ.35 లక్షల కోట్ల పెట్టుబడులు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, తద్వారా 20 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. బ్రాండ్ కంపెనీలతో పాటు నూతన బ్రాండ్లను ప్రోత్సహిస్తామని అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కువగా మిగతా 7లో

డిప్యూటీ స్పీకరుగా రఘురామ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకరుగా కనుమూరి రఘురామ కృష్ణరాజు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనుమూరి తరపున మూడు నామినేషన్లు దాఖలయ్యాయని, ఇతరులెవరూ నామినేషన్లు దాఖలు చేయనందున రఘురామ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. మధ్యాహ్నం 2:40కు ఆయన్ను సభా వేదికపైకి కూటమి పక్షం నాయకులు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా ఎంత సంచలనం సృష్టించిందో.. రాష్ట్ర రాజకీయాల్లో రఘురామ కూడా ఇదే రీతిలో సంచల నాలు సృష్టించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకరుగా ఎన్నికైన రఘురామను సభాపతి స్థానంలో కూర్చొబెట్టి అభినందించిన సిఎం ప్రసంగించారు. నాటు నాటు పాట ఎంత పాపులర్ అయిందో రఘురామ చేపట్టిన రచ్చబండ అంత ప్రజాదరణ పొందిం దన్నారు. గత ప్రభుత్వ హయాంలో రఘురామపై తీవ్ర కస్టోడియల్ టార్చర్ జరిగిందన్నారు. రఘు రామ ఎంపిగా పనిచేసిన ఐదేళ్లలో నరసాపురం నియోజకవర్గానికి రానివ్వకపోతే రచ్చబండ ద్వారా ప్రజలకు దగ్గరయ్యారని తెలిపారు.

నేరస్తులకు తావు లేదు : పవన్‌కల్యాణ్

రాజకీయాల్లో నేరస్తులకు తావు ఉండకూడదని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకరుగా రఘురామ ఎన్నిక సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ స్పీకరుగా అధ్యక్ష స్థానంలో ఉంటే మీ ముందుకొచ్చి మాట్లాడలేని స్థితిలో వారు ఉండిపోయారని పరోక్షంగా వైసిపి నేతలను విమర్శించారు. అంతకు ముందు రఘురామను స్పీకరు అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, బిజెపి ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యేలు అభినందించారు.

'ప్రజాపోరు'తో హోరెత్తిన రాష్ట్రం

- కలెక్టరేట్లు, ఆర్‌డిఒ, మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు
- ధరల అదుపు, విద్యుత్ భారాలపై అసెంబ్లీలో సిఎం ప్రకటన చేయాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రజాపోరుతో రాష్ట్రం హోరెత్తింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను, పెరిగిన ధరలు, భారాలను వ్యతిరేకిస్తూ, స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్లు, ఆర్‌డిఒ, మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద గురువారం నిర్వహించిన ధర్నాలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద ధర్నాలోనూ, ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రజాపోరు సభలోనూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలను నియంత్రిస్తామని, ట్రూ అప్ ఛార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తున్నామని టిడిపి కూటమి ప్రభుత్వం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే వామపక్షాల ఆధ్వర్యాన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం ట్రూ అప్ పేరుతో రూ.17 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం వేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలే ఇందుకు కారణమని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు తుంగలో తొక్కారన్నారు.



విజయవాడలో కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

వ్యవసాయ మోటార్లకు, ఇతర పరిశ్రమలు, ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ భారాలు ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ఎన్నికల ముందు టిడిపి నేతలు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఉచిత ఇసుక హామీ అమలు కావడంలేదని, ఇసుక మాఫియా ఇసుకను అమ్ముకుంటోందని తెలిపారు. ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని అడుగుతుంటే ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించామని చెబుతోందని ఎద్దేవా చేశారు. జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను హరించడానికి, సమైక్య స్ఫూర్తిని దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. మహిళలు, బాలికలపై నిత్యం ఏదో ఒకచోట దాడులు, అత్యాచారాలు, హత్యలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. మహిళలపై దాడి చేసిన వారిని యుపి సిఎం యోగి లాగా ఎన్‌కౌంటర్ చేయాలని ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ అంటున్నారని, ఎన్‌కౌంటర్ల ద్వారా అత్యాచారాలు ఆగవని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వాటినీ, 16 వేల మిగతా 7లో

రైతు ఆత్మహత్యలు పట్టవా?

- బడ్జెట్‌లో కానరాని ప్రస్తావన
- ఎక్స్‌గ్రేషియాకు 22 కోట్లే
- ఆందోళనకర స్థాయిలో బలవన్మరణాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాష్ట్రంలో ఆందోళనకరంగా పరిణమించిన రైతుల ఆత్మహత్యలను టిడిపి కూటమి ప్రభుత్వం తన తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌లో విస్మరించింది. వ్యవసాయం గిట్టుబాటు కాక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి సేద్యం సాగించలేక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతుండగా ఆ అంశం ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలోకాని, వ్యవసాయ మంత్రి బడ్జెట్‌లోకానీ ప్రస్తావనకు నోచుకోలేదు. రైతులను స్థితిమంతులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్న ప్రభుత్వం, రైతుల ఆత్మహత్యల విషాదాన్ని మాట మాటమాత్రమైనా తెలపకపోవడం రైతుల్లో, వ్యవసాయ నిపుణుల్లో చర్చనీయాంశమవుతోంది. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాపైనా సర్కారు మౌనమే వహించింది. కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో, సూపర్‌సిక్స్‌లో సైతం బలవన్మరణాల ఊసు లేదు. ఎక్స్‌గ్రేషియో



పెంపు ప్రతిపాదన లేదు. బడ్జెట్‌లో వ్యవసాయ శాఖ పద్దులో ఎక్కడో రైతులకు నష్టపరిహారం కింద రూ.22 కోట్లు చూపించింది. అంతేతప్ప ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చేపట్టబోయే నిర్దిష్ట చర్యలను ప్రకటించలేదు.

పరిహారం ఇలా...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1997 నుంచి రైతుల ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయి. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని రైతులు, రైతు సంఘాలు, వివిధ పార్టీలు ఆందోళనలు చేశాయి. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాకు ముందుకు రాలేదు. పైగా పరిహారం ఇస్తే ఆత్మహత్యలు పెరుగుతాయని వల్లించింది. 2004లో వైఎస్ సర్కారు రూ.లక్షన్నర ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు జూన్ 1న జిఒఎంఎస్ 421 జారీ చేసింది. కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వం అదనంగా రూ.50 వేల పరిహారం ప్రకటించింది. సహాయం రాష్ట్ర విభజన వరకు అమల్లో ఉంది. నవ్యాంధ్ర ఉనికిలోకొచ్చాక రైతుల, రైతు సంఘాల, ప్రతిపక్షాల డిమాండ్ ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షలకు టిడిపి ప్రభుత్వం పెంచింది. 2015 ఫిబ్రవరి 19న జిఒఎంఎస్ 62 విడుదల చేసింది. ఎక్స్‌గ్రేషియాను రూ.7 లక్షలకు పెంచుతూ వైసిపి ప్రభుత్వం 2019 అక్టోబర్ 14న జిఒఎంఎస్ 102 జారీ చేసింది.

అందరిదీ దాటవేత ధోరణే

వైఎస్ ప్రభుత్వం తొలి రోజుల్లో ఆత్మహత్యల నమోదుపై కొంత వరకు నిర్దిష్ట చర్యలు చేపట్టగా తర్వాత్తర్వాత పదేళ్లల్లో నిర్వీర్యమైంది. నవ్యాంధ్రలో టిడిపి హయాంలో రైతుల ఆత్మహత్యల గుర్తింపులో ఇంటెలిజెన్స్ నివేదికలు సైతం సేకరించారు. తమ జిఒ వచ్చిన దగ్గర నుంచి సంభవించిన ఆత్మహత్యలకే రూ.5 లక్షలని, అంతకుముందు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న కేసులకు రూ.లక్షన్నరేనంది. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల గుర్తింపునకు కొర్రీలు వేసింది. వైసిపి సర్కారు సైతం ఎక్స్‌గ్రేషియాకు కఠిన నిబంధనలు పెట్టింది. మండల స్థాయిలో మిగతా 7లో

ప్రధాని మోడీకి డొమినికా అత్యున్నత జాతీయ పురస్కారం



రోజెవు : తమ దేశ అత్యున్నత జాతీయ పురస్కారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీకి అందజేయనున్నట్లు కామన్వెల్త్ ఆఫ్ డొమినికా ప్రకటించింది. కోవిడ్ ప్రబలిన సమయంలో డొమినికాకు భారత్ అందించిన సాయానికి గుర్తుగా అలాగే రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు మోడీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ఇస్తున్నట్లు డొమినికా అవార్డ్ ఆఫ్ ఆనర్ తెలిపింది. ఫిబ్రవరిలో 70వేల డోసుల అస్ట్రాజెనికా వ్యాక్సిన్‌ను భారత్ అందచేసిందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ, విద్య, సమాచార సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లో డొమినికా రిపబ్లిక్‌కు భారత్ అందిస్తున్న తోడ్పాటును ప్రశంసించారు. భారత్, కారికామ్ సభ్య దేశాల మధ్య సహకారానికి గల కొత్త అవకాశాలను చర్చించేందుకు నవంబరులో జరిగే సదస్సులో డొమనికా అధ్యక్షుడు సిల్వనే బర్టన్, ప్రధాని రూజ్‌వెల్ట్ స్కిరిట్‌లు పాల్గొంటారు. కామన్వెల్త్ ఆఫ్ డొమినికా అభివృద్ధికి విశిష్ట సేవలందించిన వ్యక్తులకు సాధారణంగా ఈ అవార్డులు అందచేస్తుంటారు. గతంలో క్యూబా నేత ఫిడెల్ కాస్ట్రోకు కూడా ఈ పురస్కారాన్ని అందచేశారు.

డిఎస్‌సిపై చర్చకు నో

- పిడిఎఫ్ వాయిదా తీర్మానం తిరస్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎప్పటి నుండో ఎదురు చూస్తున్న డిఎస్‌సి నోటిపికేషన్ విడుదల చేయాలని, దానిపై చర్చించాలని కోరుతూ పిడిఎఫ్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ తిరస్కరించారు. గురువారం ఉదయం శాసనమండలి ప్రారంభం కాగానే లక్షల మంది నిరుద్యోగులకు సంబంధించిన అంశంపై చర్చించాలని కోరుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు వాయిదా తీర్మానం ఇచ్చారు. చర్చించాలని పట్టుబట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించినా విడుదల చేయలేదని పేర్కొన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం లక్షలాది మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని వివరించారు. శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో ఎస్‌జిటి పోస్టులు పెంచాలని కోరారు. వయోపరిమితి కూడా పెంచి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతో ఇంతో అవకాశం వస్తుందనుకున్న అభ్యర్థులకు వాయిదా నిర్ణయం తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా దీనిపై చర్చించి ప్రభుత్వపరంగా ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనికి మండలి ఛైర్మన్ తిరస్కరించారు.

అరెస్టులపై వైసిపి వాయిదా తీర్మానం తిరస్కరణ

సోషల్ మీడియాలో పోస్టుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం యువకులను అరెస్టు చేస్తోందని, ఈ అంశంపై చర్చించాలని వైసిపి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్ మోషేను రాజు తిరస్కరించారు. మరో విధానంలో చర్చకు రావాలని వైసిపి సభ్యులకు తెలిపారు. ఈ అంశంపై చర్చించాలని సభ్యులు వారి స్థానాల్లోనే ఉండి పట్టుబట్టారు. వాయిదా తీర్మానాన్ని తిరస్కరించామని, సభ్యులు వారి స్థానాల్లో కూర్చోవాలని ఛైర్మన్ సూచించారు. అయినా సభ్యులు ఈ అంశంపై చర్చ జరపాలని సభలో ఆందోళన నిర్వహించారు. తమ పదవులకు మూడు నెలల కింద రాజీనామా చేశామని, దీనికి ఆమోదం తెలపాలని వైసిపి సభ్యులు కె పద్మశ్రీ, పోతుల సునీత, బి కళ్యాణ్ చక్రవర్తి... ఛైర్మన్ పోడియం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. సభ్యుల ఆందోళన మధ్యనే ఛైర్మన్ ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. సభ్యుల ఆందోళన అదుపులోకి రాకపోవడంతో సభను వాయిదా వేశారు.

ఉద్ధవ్ ప్రభుత్వ కూల్చివేతలో అదానీ కీలకం!

- శరద్ పవార్‌ను ఇరకాటంలో పెట్టబోయి బిజెపిని ఆత్మరక్షణలో పడేసిన అజిత్‌పవార్
- మహారాష్ట్ర కమలదళంలో కలవరపాటు


ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు కేవలం ఒక వారం మాత్రమే సమయం ఉంది. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా గౌతమ్ అదానీ పేరే వినిపిస్తోంది. బిజెపిని ఇరకాటంలో పెట్టిన ఈ పరిణామానికి మూల కారకుడు అజిత్ పవార్. 'ది న్యూస్ మినిట్'కు ఇచ్చిన ఓ వీడియో ఇంటర్వ్యూలో అజిత్ పవార్ వివాదాస్పద పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ పేరును ప్రస్తావించారు. వాస్తవానికి ఆయన అనుకున్నది ఒకటైతే జరిగింది మరొకటి. శరద్ పవార్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు సంధించబోయి మిత్రపక్షమైన బిజెపిని ఆత్మరక్షణలో పడేశారు.

అజిత్ ఏం చెప్పారంటే...

ఇంతకీ అజిత్ పవార్ ఏం చెప్పారంటే...'ఆ సమావేశం ఎక్కడ జరిగిందో ప్రతి ఒక్కరికీ తెలుసు. అక్కడ వారందరూ ఉన్నారు. నేను మీకు మరోసారి చెబుతున్నాను. అక్కడ అమిత్ షా ఉన్నారు. గౌతమ్ అదానీ ఉన్నారు. ప్రఫుల్ పటేల్ ఉన్నారు. దేవేంద్ర ఫడ్నవీస్ ఉన్నారు. అజిత్ పవార్ ఉన్నారు. పవార్ సాహెబ్ (శరద్ పవార్) ఉన్నారు' అంటూ 2019లో జరిగిన ఓ ఘటన గురించి చెప్పుకొచ్చారు. అప్పుడు ఆయన బిజెపితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు.

బిజెపి అంగీకరిస్తోందా?

అజిత్ ప్రకటనలో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మరునాడు ఆయన నాలిక కరచుకొని వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా అది ఏ మాత్రం ఫలించలేదు. 2019లో బిజెపి, ఎన్‌సిపి మధ్య జరిగిన రాజకీయ చర్చలలో అదానీ కూడా ఉన్నారని తాను చేసిన ప్రకటనకు వక్రభాష్యం చెప్పారని అజిత్ సంజాయిషీ ఇచ్చుకున్నారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నట్లు కన్పిస్తోందని అన్నారు. అయితే అజిత్ ప్రకటనతో వివాదం చెలరేగినప్పటికీ బిజెపి మాత్రం ఎలాంటి వ్యాఖ్య చేయకుండా మౌనం వహించింది. మౌనం అర్ధాంగీకారం అంటారు కదా. అంటే ఆ సమావేశం జరిగిన విషయం, అందులో అదానీ మిగతా 7లో



6 పోలీస్‌స్టేషన్ల పరిధిలో భద్రతా దళాల ప్రత్యేక అధికారాల చట్టం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో భద్రతా దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఎఎఫ్ఎస్‌పిఎను) కేంద్రం ప్రయోగించింది. ఇటీవల హింసాకాండ చెలరేగిన జిరిబామ్ కూడా ఈ పోలీస్ స్టేషన్ల పరిధిలోనే ఉంది. హింసాకాండ కొనసాగుతూ ఉన్న కారణంగానే ఎఎఫ్‌సిపిఎ అమలు చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. జిరిబామ్ జిల్లాలోని జిరిబామ్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని సెక్మై, లంసంగ్, ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలోని లాంలై, కంగ్పోక్పి జిల్లాలోని లైమఖోంగ్, బిష్ణుపూర్ జిల్లాలోని మైరాంగ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎఎఫ్ఎస్‌పిఎను అమలు చేస్తున్నట్లు తెలిపింది. కాగా, అక్టోబర్ 1న 19 పోలీస్‌స్టేషన్లను మినహాయించి రాష్ట్రం మొత్తం ఎఎఫ్ఎస్‌పిఎను అమలు చేస్తున్నట్లు మణిపూర్ ప్రభుత్వం ప్రకటించిన తరువాత కేంద్రం తాజా నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్రం ప్రకటించిన ఆరు పోలీస్‌స్టేషన్లు రాష్ట్రం మినహాయించిన 19 పోలీస్‌స్టేషన్లలో ఉన్నాయి.

వైజాగ్ స్టీల్‌కు గనులివ్వరు... ఏర్పాటేకాని మిట్టల్‌కు హామీలా?

- రూ.1.40 లక్షల కోట్లతో అనకాపల్లిలో ప్రైవేటు స్టీల్‌కు సన్నాహాలు!

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కుపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని కూటమి పార్టీల నేతలు ఇంకా స్టీల్‌ప్లాంట్ పెట్టేలేదు... గనులు కేటాయిస్తామంటూ మిట్టల్‌కు హామీ ఇచ్చేశారు. మిట్టల్ ఆధ్వర్యాన ఫేజ్-1లో రూ.70 వేల కోట్లు, ఫేజ్ -2లో రూ.70 వేల కోట్లతో పెట్టుబడులు వస్తాయని, 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని ఊదరగొడుతున్నారు. మొత్తం రూ.1.40 లక్షల కోట్ల పెట్టుబడి అంటే కనీసం సాధ్యాసాధ్యాల (ఫీజిబిలిటీ) స్టడీ చేశారా? కనీసం మిట్టల్ కంపెనీ ప్రతినిధులు అనకాపల్లి వచ్చి పరిశీలించారా? అనేవి సమాధానం దొరకని ప్రశ్నలు. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్‌కు గనులు, భూ కేటాయింపులపై బిజెపి అనకాపల్లి ఎంపి సిఎం.రమేష్ చేసిన ప్రకటనతో విశాఖ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై కార్మికులు, ఉద్యోగులు, అధికారుల్లోనే కాదు ఉత్తరాంధ్ర ప్రజానీకంలోనూ ఆందోళన తీవ్రమైంది. 1982లోనే వైజాగ్ స్టీల్ ఏర్పడినప్పుడు బైలదిల్లాలో 4, 5 గనులు కేటాయిస్తామని పాలకులు హామీ ఇచ్చినా నిలుపుకోలేదు. ప్లాంట్ పెట్టని పోస్కోకు గనులు కేటాయించారు. బళ్లారిలో గాలి జనార్ధనరెడ్డికి కట్టబెట్టారు

హైకోర్టు చెప్పినా విశాఖ ఉక్కుకు కేటాయించని గనులు

ప్రభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని హైకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ యాక్ట్ 2013 ప్రకారం గనులు కేటాయించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని కోర్టు చెప్పింది. గతంలో ప్రతిపక్ష నేతగా, ప్రస్తుతం సిఎంగా ఉన్న చంద్రబాబునాయుడు విశాఖ స్టీల్‌కు గనులు కేటాయించకుండా ద్రోహం చేస్తోందంటూ రాజశేఖరరెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్టీల్ ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని, సొంత గనులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఈ ఊసే ఎత్తడం లేదు. విశాఖ ఉక్కును ఎండగట్టి దీనికి 40 కిలోమీటర్ల దూరంలోనే ప్రైవేట్ మిగతా 7లో

ప్రైవేట్ వారికి వేలాది ఎకరాలు ధారాదత్తం చేస్తారా?

ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్‌ను బలోపేతం చేసే బదులు ప్రైవేట్ వ్యక్తులకు భూములిచ్చి కొత్త స్టీల్‌ప్లాంట్ పెట్టిస్తామని ప్రభుత్వం పెద్దలు చెప్పడం అత్యంత బాధాకరం. గతంలో జగన్ ప్రభుత్వం కడపలో ప్రైవేట్ కంపెనీకి వేలాది ఎకరాలు ఇచ్చింది. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ ఉక్కుకు ఇనుప గనులను కేంద్రంతో ఒప్పించి ఇప్పించకుండా అనకాపల్లి జిల్లాలో ప్రైవేట్ వారికి (మిట్టల్‌కి) స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వేల ఎకరాలు ఇస్తామని ప్రకటించడం సరికాదు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఉద్యోగాలు కల్పించింది. మిట్టల్ కంపెనీ వస్తే ఈ సామాజిక తరగతులకు స్థానం ఎక్కడ ఉంటుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై గత పాలకులకూ, నేటి టిడిపి కూటమి నేతలకూ ఆసక్తి లేదు.

- ఇఎఎస్ శర్మ, మాజీ ఐఎఎస్ అధికారి

డిగ్రీ విద్యార్థిని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మరణించిన సంఘటన తిరుపతి జిల్లా పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు చెందిన అనీత (19) పద్మావతి డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి బయోకెమిస్ట్రీ రెండవ సంవత్సరం చదువుతున్నారు. గురువారం ఉదయం తోటి విద్యార్థులు హాస్టల్ నుంచి తరగతి గదులకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కళాశాల విజిలెన్స్ సిబ్బంది యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. కళాశాలలో విద్యార్థినులకు భద్రత కరువైందని తెలిపారు. టిటిడి అధికారులు చొరవ చూపి విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలను గుర్తించి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వర్రా, భార్గవ్, అర్జున్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

- నందలూరు పిఎస్‌లో నమోదు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలైన వర్రా రవీందర్‌రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి, సిరిగిరెడ్డి అర్జున్‌రెడ్డిపై కేసుల పరంపర కొనసాగుతోంది. అన్నమయ్య జిల్లా సిద్ధవటం మండలానికి చెందిన దళితుడు వాకమల్ల వెంకటాద్రి అన్నమయ్య జిల్లా నందలూరు పోలీస్ స్టేషన్‌లో ఈ నెల ఎనిమిదిన చేసిన ఫిర్యాదు గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిసిన వివరాల ప్రకారం.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్రా రవీందర్‌రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి, సిరిగిరెడ్డి అర్జున్‌రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును జీరో ఎఫ్‌ఐఆర్ కింద నమోదు చేసి పులివెందుల పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశామన్నారు.

రాయలసీమలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. శుక్రవారం రాయలసీమతో పాటు ఉభయగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, శని, ఆదివారం రాయలసీమతో పాటు కృష్ణా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే విధంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. సోమవారం వాతావరణం పొడిగా ఉంటుందని పేర్కొంది.

అనంతపురంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. లోతట్టు రహదారులు జలమయమయ్యాయి. వరద నీటితో మురుగు కాలువలో పొంగిపొర్లాయి. వైఎస్‌ఆర్ జిల్లాలోని కడప, చెన్నూరు, సి.కె.దిన్నె, వల్లూరు, మైదుకూరు, చెన్నూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో చెదురుముదురుగా వర్షం పడింది. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు ప్రాంతాల్లో మోస్తారు వాన కురిసింది. నెల్లూరు జిల్లాలో ఓ మోస్తరు వర్షం పడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గుడ్లూరు మండలంలో ఎలికేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో మోస్తరు వాన పడింది. రహదారిపై చెట్టు విరిగి పడడంతో దాదాపు రెండు గంటల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

వారిని అరెస్టు చేస్తే తప్పేంటి?

- అనుచిత పోస్టులపై హైకోర్టు వ్యాఖ్య

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియాలో వేరేవాళ్ల మనసుల్ని గాయపరిచేలా పోస్టింగ్స్ పెట్టేవాళ్లపై కేసులు పెట్టి అరెస్టు చేస్తే తప్పెలా అవుతుందని హైకోర్టు ప్రశ్నించింది. పోలీసులు అరెస్టు చేయకుండా ఉంటారా? అని వ్యాఖ్యానించింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై విశాఖపట్నం, మర్రిపాలేనికి చెందిన సత్య నీరజ్ కుమార్ నాయుడు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ తిరుపతి పట్టణ జనసేన అధ్యక్షులు జగదీష్ రాజారెడ్డి గత నెల 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీరజ్ కుమార్‌పై తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారని, తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా విచారణ జరపాలన్న పిటిషనర్ వినతిని హైకోర్టు తిరస్కరించింది. తర్వాత విచారణ జరుపుతామని జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం తెలిపారు.

రాష్ట్రంలో భారీ భూ కుంభకోణం

- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపండి
- శాసనసభలో టిడిపి సభ్యుల డిమాండ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో భారీ భూ కుంభకోణం చోటు చేసుకుందని, దానిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టిడిపి సభ్యులు డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో గురువారం ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. టిడిపి సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, కోండ్రు మురళి, శ్రీరాం రాజగోపాల్, బత్తుల శివరామకష్ణ, పుట్టా సుధాకర్ యాదవ్‌లు ఈ విషయాన్ని ప్రస్తావించారు. 22(ఎ) జాబితాలో ఉన్న భూములు, ఫ్రీ హెూల్డ్ పట్టాలు, జగనన్న కాలనీల కోసం సేకరించిన భూములలో భారీగా అవతవకలు జరిగాయని, వాటి విలువ సుమారు రూ.2 లక్షల కోట్ల వరకు ఉంటుందని, ఇది బోఫోర్స్ కుంభకోణం కంటే పెద్దదని చెప్పారు.

ఒక్క విశాఖలోనే రూ. 3 వేల కోట్ల భూముల రిజిస్ట్రేషన్

22(ఎ) జాబితా నుండి భూములు మినహాయింపులు పొందడానికి వైసిపి నేతలు, మండల తహసీల్దార్లు, మండల స్థాయి నాయకులు కలిసి వ్యవహరించారని ఆరోపించారు. ఒక్క విశాఖపట్నంలో రూ.3 వేల కోట్ల విలువ ఉన్న 300 ఎకరాల స్థలం రిజిస్ట్రేషన్ అయినట్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిగితే, ఆధారాలు సమర్పించి సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. విశాఖపట్నంలో వైసిపి నేతలు విజయసాయిరెడ్డి , వైవి సుబ్బారెడ్డి కన్నుసన్నల్లోనే ఈ భూముల రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. విశాఖతోపాటు రాజానగరం నియోజకవర్గంలో కూడా ఇనాం భూములపై నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి వైసిపి నాయకులు భూ ఆక్రమణలు చేశారని తెలిపారు.

ఈ దశలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జోక్యం చేసుకుంటూ హౌస్ కమిటీ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ప్రభుత్వానికి సూచించారు.

హౌస్ కమిటీ వేసే ఆలోచన : రెవెన్యూశాఖ మంత్రి

అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వ హయాంలో 22(ఎ) జాబితా చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకొని భూదోపిడీ చేసినట్లు ఆరోపించారు. భూ కుంభకోణంపై ముఖ్యమంత్రితో చర్చించి, హౌస్ కమిటీ వేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. ప్రైమరీ వెరిఫికేషన్ ప్రక్రియలో మొత్తం 25,275 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని, అందులో 7,837 ఎకరాలలో అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు మంత్రి తెలిపారు.

శ్రీకాకుళం జిల్లాలో జీడి మామిడి బోర్డు ఏర్పాటుకు కృషి

- ఎంఎస్‌పి కోసం కేంద్రానికి లేఖ
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



శ్రీకాకుళం జిల్లాలో జీడి మామిడి బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇదే విషయంపై ప్రధాని నరేంద్ర మోడీతో సిఎం చంద్రబాబు కూడా ఇటీవల చర్చించారని తెలిపారు. శాసనసభలో జీడి మామిడి, కొబ్బరి రైతులకు కనీస మద్దతు ధర అంశంపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్ మాట్లాడారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో జీడి మామిడి, కొబ్బరి రైతులకు కనీస మద్దతు ధర లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఎస్‌పి శాశ్వతంగా ఒకే ధర లేదని, రోజుకో ధర ఉంటుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయంపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. జీడి మామిడి పంట కోసం ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) నిర్ణయించలేదన్నారు. శాశ్వత ఎంఎస్‌పి కోసం ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశామని సభ దృష్టికి తీసుకొచ్చారు. కొబ్బరి రైతులను ఇబ్బందుల నుంచి రక్షించడానికి మిల్లింగ్ కోప్రా, బాల్ కోప్రా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని ప్రభుత్వం వార్షికంగా ఏర్పాటు చేసిందన్నారు. 2024లో బాల్ కోప్రా క్వింటాల్ ఒక్కింటికీ రూ.12 వేలు, మల్లింగ్ కోప్రా క్వింటాలుకు రూ.11,160 కనీస మద్దతు ధర అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు సరసమైన ధరలను నిర్ధారించడానికి జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఎన్ఎఎఫ్ఇడి), ఎపి సహకార నూనె గింజల పెంపకందార్ల ఫెడరేషన్ లిమిటెడ్ (ఎపిఒఐఎల్ఎఫ్ఇడి) మిల్లింగ్ కోప్రా, బాల్ కోప్రా కోసం కనీస మద్దతు ధరను అమలు చేసిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో మద్యం షాపు తరలించాలని నిరసన తెలుపుతున్న స్థానికులు

మద్యం షాపులు తరలించాలంటూ నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇళ్ల మధ్య మద్యం షాపులు ఏర్పాటు చేయొద్దంటూ పశ్చిమగోదావరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో స్థానిక ప్రజలు గురువారం మద్యం షాపుల వద్ద నిరసన తెలిపారు. జనావాసాల మధ్య మద్యం షాపులు పెట్టడంతో మందుబాబులు గొడవలు సృష్టిస్తున్నారని, మహిళలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మద్యం షాపులను జనాలకు దూరంగా తరలించి రక్షణ కల్పించాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండల కేంద్రంలో ఆలయాలకు దగ్గరగా ఉన్న మద్యం షాపును తరలించాలని స్థానిక ప్రజలు నిరసన తెలిపారు. ఆలయాలకు 220 మీటర్ల దూరంలోపు మద్యం షాపులు ఏర్పాటు చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మద్యం షాపు ఉందని తెలిపారు. ఈ ప్రాంతం ప్రజలతో రద్దీగా ఉంటుందని, ఇదే మార్గం గుండా విద్యార్థులు పాఠశాలలకు వెళ్తారన్నారు. అధికారులు స్పందించి మద్యం షాపు తరలించాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా గొల్లలకోడేరు హరిజనపేటవాసులు నిరసన తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును మరోచోటకు తరలించాలని డిమాండ్ చేశారు.



విద్యారంగ సమస్యలపై 18న మహాధర్నా

- ఎస్ఎఫ్ఐ పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగ సమస్యలకు పరిష్కారం కోరుతూ ఈ నెల 18న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. దీనికి సంబంధించిన పోస్టరును ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ అశోక్, కె ప్రసన్నకుమార్ విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు రూ.3,480 కోట్లను విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వానికి తాము పలుమార్లు విన్నవించినా జాప్యం చేస్తూ కల్లబొల్లి మాటలు చెప్తోందని వాపోయారు. అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ కేటాయింపుల్లో పెండింగ్ బకాయిల గురించి మాట్లాడకపోవడం హేయమైన చర్య అని తెలిపారు.

ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతులు ఇస్తామని యాజమాన్యాలు ఒత్తిడి తేవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, తల్లికి వందనం పథకానికి రూ.12,600 కోట్లు కావాలని తెలిపారు. కానీ బడ్జెట్‌లో రూ.5,387 కోట్లు మాత్రమే కేటాయించడంతో ఈ పథకం అమలుపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజులలో జిఓ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదన్నారు. డిగ్రీ హానర్స్ విధానం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, విద్యార్థికి కోర్సు ఎంపిక చేసే హక్కును కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రద్దు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల మధ్యాహ్న భోజన పథకాన్ని పున:ప్రారంభించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టళ్లలో మెస్ ఛార్జీలు నెలకు రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా యూనివర్సిటీల్లో పెండింగ్‌లో ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మండల, జిల్లా కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను కలుపుకుని ఈ నెల 18న విజయవాడలోని ధర్నా చౌక్‌లో మహాధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. పోస్టరు ఆవిష్కరణలో ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు ప్రణిత, షణ్ముక్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల సరఫరాపై దర్యాప్తు

- మండలిలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



గత ప్రభుత్వ పాలనలో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ యూనివర్సిటీ (ఆర్‌జియుకెటి)లో చదువుతున్న ట్రిపుల్ ఐటి విద్యార్థులకు నాసిరకం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారని, దీనిపై 90 రోజుల్లో దర్యాప్తు పూర్తిచేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యా, ఐటిశాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. ట్రిపుల్ ఐటి విద్యార్థులకు 2023లో నాసిరకం ల్యాప్‌టాప్‌లు సరఫరా చేసినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిన విషయంపై టిడిపి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, కంచర్ల శ్రీకాంత్ శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో అడిగారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఒక్కొక్క ల్యాప్‌టాప్‌ను రూ.27 వేలు చెల్లించి 6,500 కొనుగోలు చేశారని తెలిపారు. 1520 ల్యాప్‌టాప్‌లలో సమస్యలున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై 90 రోజుల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహించి అసెంబ్లీలో పెడతామని చెప్పారు. 2024 జూన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.34,567.61 కోట్లు పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ ద్వారా రుణాలు తీసుకుందని వైసిపి సభ్యులు మాధవరావు, రమేష్ యాదవ్, కెఆర్‌జి భరత్ అడిగిన ప్రశ్నకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. విద్యుత్ టారిఫ్‌ను పెంచే ఆలోచన ప్రభుత్వం వద్ద లేదని వైసిపి సభ్యులు తోట త్రిమూర్తులు, మర్రి రాజశేఖర్, శివరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. 2019-24 కాలంలో మాదకద్రవ్యాల వ్యసనం కింద 7,635 కేసులు నమోదయ్యాయని టిడిపి సభ్యులు దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్ బాబు, పంచుమర్తి అనూరాధ అడిగిన ప్రశ్నకు హోంమంత్రి వంగలపూడి అనిత సమాధానం చెప్పారు.

మండలిలో గొంతు నొక్కే ప్రయత్నం

- వైసిపి ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా ముందుకు తీసుకెళ్తారో బడ్జెట్‌లో స్పష్టత లేదని, దీన్ని ఎత్తిచూపుతుంటే వాస్తవాలను అధికార పార్టీ మంత్రులు భరించలేకపోతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. శాసనమండలిలో జరిగే చర్చకు అడ్డుతగిలి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని ఇచ్చిన హామీని కూటమి నేతలు విస్మరించారని ఒక్కో యూనిట్‌కు రూ.1.55 ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.6 వేల కోట్లకుపైగా భారం మోపడానికి ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ దీపం-2 పథకం రాష్ట్రంలో ఎందరికి అందిందో తెలియజేయాలని మండలిలో ప్రశ్నించినా ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పేర్కొన్నారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని ఎమ్మెల్సీ బొమ్మి ఇస్రాయేల్ ఆరోపించారు. దీనిపై మండలిలో వాయిదా తీర్మానం ఇచ్చినా చర్చకు అవకాశం ఇవ్వలేదన్నారు. వైసిపి హయాంలో ప్రారంభించిన మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపేసిందని ఎమ్మెల్సీ సి సుబ్రహ్మణ్యం తెలిపారు. పులివెందులలో మెడికల్ కాలేజీ నిర్మాణం అవసరం లేదని దారుణమన్నారు. విజయనగరం జిల్లాలో అతిసార మృతుల గురించి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధితశాఖ మంత్రి తలో లెక్క చెబుతున్నారని ఎమ్మెల్సీ పివివి సూర్యనారాయణరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అతిసార మృతుల గురించి ప్రభుత్వం వద్ద సరైన వివరాలు లేకపోవడం శోచనీయమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు.

శాసనసభలో పలు బిల్లులు ప్రతిపాదన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో పలు బిల్లులను మంత్రులు బుధవారం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులను సభలో చర్చకు అనుమతిస్తున్నట్టు స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఎపి విద్యుత్ సుంకం చట్టం 1939ను సవరించేందుకు రూపొందించిన బిల్లును ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రవేశపెట్టారు. డాక్టర్ ఎన్‌ఆర్‌ఆర్ ఆరోగ్య విజ్ఞాన శాస్త్రముల విశ్వవిద్యాలయ చట్టం 1986ను సవరించుటకు రూపొందించిన బిల్లును వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రవేశపెట్టారు. ఎపి వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ చట్టం 1968ను సవరించేందుకు రూపొందించిన బిల్లును, ఎపి ఆయుర్వేద, హోమియో వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లును కూడా మంత్రి సత్యకుమార్ సభ ముందుంచారు. అలాగే భూ దురాక్రమణ కార్యకలాపాలను నిషేధించేందుకు రూపొందించిన బిల్లును సభలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లులను ప్రవేశపెట్టేందుకు అత్యధిక మంది సభ్యులు అంగీకరించినందుకు వీటిని అనుమతిస్తున్నట్టు స్పీకరు ప్రకటించారు.

26న మహాధర్నా

- ఎస్‌కెఎం రాష్ట్ర అధ్యక్షులు వడ్డే శోభనాద్రీశ్వరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా 500 జిల్లాలలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పట్టణ పేదలు, కార్మికులు, మహిళలు, ప్రజా సంఘాలు సమీకృతమై కలెక్టర్ కార్యాలయాల వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసు, మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో అన్నదాతలు పండిస్తున్న పంటలకు స్వామినాథన్ సిఫార్సుల మేరకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధ ఎంఎస్‌పి ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దాదాపు సంవత్సరం 14 రోజులపాటు ఢిల్లీ నగరంలో లక్షలాది మంది రైతులు మహా పోరాటాన్ని నిర్వహించారని గుర్తు చేశారు.

ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను బేషరతుగా వెనక్కి తీసుకోవడమే కాకుండా, దేశ రైతులకు ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పారన్నారు. రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను ఎన్నికల అనంతరం గాలికి వదిలేశారని తెలిపారు. కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు.

కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి. శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నల్లమడ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజామోహన్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి పాల్గొన్నారు.


వైసిపి పాలనలో రాష్ట్రం తిరోగమనం

- బడ్జెట్‌పై చర్చలో చీఫ్ విప్ జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందని అసెంబ్లీ చీఫ్ విప్ జివి ఆంజనేయులు విమర్శించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో గురువారం ఆయన పాల్గొన్నారు.

పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పారిపోయేలా చేయడం, ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను వంచించడం, గుంతల రోడ్లు, దోపిడీ, హత్యా రాజకీయాలు మినహా రాష్ట్రానికి వైసిపి చేసిందేంటని ఆయన ప్రశ్నించారు. ఆర్థిక నేరస్తులు, హంతకులు, దోపిడీదారులకు, దాడులు చేసిన వారికే పదవులు, ప్రమోషన్లు, మంత్రి హోదాలు కల్పించారని దుయ్యబట్టారు. కొవ్వూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. సంపద సృష్టించడానికి గ్రీన్ ఎనర్జీ టూరిజం, ఐటి రంగాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కొవ్వూరు సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజనేయులు మాట్లాడుతూ.. బడ్జెట్‌పై వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు అమలుపై అధికారులపై ఆధారపడకుండా తరచూ సమీక్షలు చేయాలన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో విలీన గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణ, నల్లమడ డ్రెయిన్ మరమ్మతులు చేయాలన్నారు.



స్మార్ట్ మీటర్ల బిగించేందుకు వచ్చిన వారిని నిలదీస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు అడ్డగింత

ప్రజాశక్తి-నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న ఇన్‌స్టాలర్ (మీటర్లు బిగించేవారు)ను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. వినియోగదారులకు తెలియజేయకుండా ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగుస్తున్న విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, శాఖా కార్యదర్శి ఎం.మహేష్‌బాబు మీటర్లు బిగించే వారిని నిలదీశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లకు వినియోగదారులు రూ.30 వేలు చెల్లించాలని, విద్యుత్ వాడకానికి ముందుగా రీఛార్జ్ చేయించుకోవాలని, రీఛార్జ్ గడువు పూర్తయిన వెంటనే విద్యుత్ ఆగిపోతుందని తెలిపారు. అర్ధరాత్రి విద్యుత్ ఆగిపోతే వినియోగదారులు ఇబ్బందులు పడతారన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు కలిగించే స్మార్ట్ మీటర్ల బిగింపును విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాన్, అప్పలరాజు, అంజి, తాతీలు, బయ్యన్న, బాపూజీ పాల్గొన్నారు.

మీరంటే మీరే..

- మండలిలో అధికార, ప్రతిపక్షాల విమర్శలు
- వైసిపి సభ్యుల ప్రసంగానికి మంత్రుల ఆటంకం
- పక్కదారి పట్టిన బడ్జెట్‌పై చర్చ
- పలుమార్లు సభ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలిలో బడ్జెట్‌పై జరగాల్సిన చర్చ పక్కదారి పట్టింది. వైసిపి సభ్యులు ప్రసంగిస్తున్న సమయంలో మంత్రులు పలుమార్లు జోక్యం చేసుకోవడం, అధికార టిడిపి సభ్యులు రన్నింగ్ కామెంట్రీ చేయడంతో ఛైర్మన్ కె మోషేను రాజు పలుమార్లు సభను వాయిదా వేశారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై ఛైర్మన్ గురువారం చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి సభ్యులు కుంభ రవిబాబు, వరుదు కళ్యాణి ప్రసంగిస్తున్న సమయంలో మంత్రులు పలుమార్లు జోక్యం చేసుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలోనే టిడిపి సభ్యులు పంచుమర్తి అనురాధ, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి వారి ప్రసంగానికి పలుమార్లు ఆటంకం కలిగించారు. ఈ సందర్భంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం నెలకొంది. ఈ సందర్భంగా సభ పక్కదారి పడుతుందని ఛైర్మన్ సూచించినా ఇదే పరిస్థితి కొనసాగడంతో రెండు సార్లు వాయిదా వేశారు. రవిబాబు మాట్లాడుతూ.. తల్లికి వందనం, మహిళలకు ఆర్థికసాయం పథకాలకు కేటాయింపులు నామమాత్రం అని చెప్పారు. నిరుద్యోగ భృతికి నిధులు కేటాయింపులు లేవన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఉద్యోగం రాకపోతే భృతి కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. సభ్యులు మాట్లాడే సమయంలో మంత్రులు మధ్యలో జోక్యం చేసుకోవడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యంతరాలుంటే సభ్యులు మాట్లాడిన అనంతరం సమాధానం చెప్పాలని సూచించారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. సభ లైవ్ నడుస్తుందని, ఈ సమయంలో ప్రజలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ప్రజలకు తప్పుడు సందేశం అందేలా సభ్యులు మాట్లాడొద్దని, అలాంటి సందర్భంలో తాము మధ్యలో కలుగజేసుకుంటామని తెలిపారు. మండలి ఛైర్మన్ కె మోషేను రాజు జోక్యం చేసుకుని సభ్యులు మాట్లాడిన అనంతరం సమాధానం చెప్పాలని కేశవ్‌కు సూచించారు. అయినా కళ్యాణి మాట్లాడుతున్న సమయంలో పంచుమర్తి అనురాధ, రాంభూపాల్ రెడ్డి రన్నింగ్ కామెంట్రీ చేస్తుండటంతో సభను ఛైర్మన్ వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైన తరువాత కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ఈ సమయంలో బొత్స మాట్లాడుతూ... తాము ఏం మాట్లాడాలో రాసిస్తే అదే చదువుతామని అసహనం వ్యక్తం చేశారు. మాజీ సిఎం జగన్‌పై అధికార పక్షం చేసిన ఆరోపణలపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత హయాంలో చంద్రబాబు నాయుడు ఏం చేశారని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇరుపక్షాల సభ్యులు తమ స్థానాల్లోంచి లేచి ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగారు. సభ అదుపులోకి రాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేశారు.

నా తల్లిని అవమానించారు : మంత్రి లోకేష్

గత శాసనసభలో తన తల్లిని అవమానించారని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా పలుమార్లు అధికార, విపక్ష సభ్యులు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతూ.. శాసనసభలో తన తల్లిని అవమానిస్తే సభలో కూర్చోవాలా అంటూ ప్రశ్నించారు. జగన్ కుటుంబ సభ్యుల గురించి తాము ఏనాడూ మాట్లాడలేదన్నారు. వైసిపి పాలనలో బాబు రెండున్నరేళ్ల సభకు హాజరయ్యారని తెలిపారు. బాబు సభకు రాకపోయినా మిగిలిన టిడిపి ఎమ్మెల్యేలు సభకు హాజరై సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారని చెప్పారు. ఇప్పుడు జగన్ రాకపోయినా మిగిలిన ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని లోకేష్ ప్రశ్నించారు. అంతకముందు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. జగన్ ఆర్థిక విధ్వంసానికి పాల్పడ్డారని విమర్శించారు. విపక్ష నాయకుడు సభకు రాకుండా పారిపోయారని ఆరోపించారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి గురువారం బహిరంగ లేఖ రాశారు. దళిత, గిరిజన సబ్‌ప్లాన్‌కు 25 శాతం నిధులు కేటాయించగా, దళితులకు 6.28 శాతం, గిరిజనులకు 2.56 శాతం చొప్పున 9 శాతం మాత్రమే బడ్జెట్‌లో నిధులు కేటాయించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 29 పథకాల పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని, భూమి కొనుగోలు పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని లేఖలో పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి, దీపం, అన్నదాత సుఖీభవ, యువగళం, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, 50 ఏళ్ల పైబడినవారికి నెలకు రూ.4 వేల పింఛను పథకాలను అమలు చేయాలన్నారు.

కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ప్రమాదంలో తల్లి కూతుళ్ల మృతి

ప్రజాశక్తి రామచంద్రాపురం (తిరుపతి రూరల్)

కారును బస్సు ఢీకొనడంతో తల్లి కూతురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిరుపతి రూరల్ మండలం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి వేదాంతపురం (అరిసి పురం జంక్షన్) వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎంఆర్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్న గోవింద తెలిపిన వివరాల మేరకు... పుల్లంపేట మండలం రంగంపల్లికి చెందిన సావిత్రి (80) వేదాంతపురంలోని ఆమె కుమారుడు రాజశేఖర్ రాజు ఇంటి గృహప్రవేశానికి తన కుమార్తెలు సంగీత (38) జ్యోతి, లక్ష్మి దేవిలతో కలిసి గురువారం తెల్లవారుజామున కారులో బయలుదేరారు. ఆరిసిపురం క్రాస్ వద్ద హైవేపై రోడ్డు దాటుతుండగా నల్లూరి వైపు నుండి బెంగళూరు వైపు వెళుతున్న ప్రయివేట్ బస్సు వేగంగా వచ్చి కారును ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో క్షతగాత్రులను ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సావిత్రి, సంగీత మృతి చెందారు. జ్యోతి, లక్ష్మి దేవిలకు చికిత్స పొందుతున్నారు. రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ ఎ సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఇంజక్షన్ వికటించి గిరిజన బాలింత మృతి

- హాస్పిటల్ వద్ద మృతదేహంతో కుటుంబ సభ్యుల నిరసన



ఇంజక్షన్ రియాక్షన్‌తో చనిపోయిన గిరిజన మహిళ జిల్లా ఈదమ్మ ((ఇన్‌సెట్‌లో) ఆవేదన వ్యక్తం చేస్తున్న ఈదమ్మ తల్లి లక్ష్మీ)

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)

ఇంజక్షన్ వికటించి గిరిజన బాలింత మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం జరిగింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే కాన్పు అయిన తరువాత మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వెల్దుర్తి మండలం వజ్రాలపాడు తండాకు చెందిన జె ఈదమ్మ (25) కాన్పు కోసం తెల్లవారుజామున మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రిలో ఈదమ్మ ఉదయం 7 గంటల సమయంలో సుఖప్రసవం జరిగి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈదమ్మకు ఇది నాలుగో కాన్పు. గతంలో ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. ప్రసవం అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బలహీనంగా ఉన్న ఈదమ్మకు ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ సెలైన్ ద్వారా అందించారు. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న ఈదమ్మ ఒక్కసారిగా ఇబ్బంది పడుతుండటంతో ఈదమ్మ తల్లి లక్ష్మి డ్యూటీ నర్సులకు తెలిపారు. అయితే, వారు వచ్చే సమయానికి పరిస్థితి విషమించి ఈదమ్మ మృతి చెందారు. వైద్యులు వచ్చి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈదమ్మ మృతదేహంతో గిరిజనులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈదమ్మ చనిపోయిందని వాపోయారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభానును బాధితులతో మాట్లాడారు. ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ రియాక్షన్ కావడం వల్ల ఈదమ్మ మృతి చెంది ఉంటుందని తెలిపారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పదేళ్లలో 1.81 లక్షల ఉద్యోగాలు

- వీటిల్లో సచివాలయాల ఉద్యోగులే 1.18 లక్షలు
- రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గత పది సంవత్సరాల కాలంలో 1,81,208 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభించినట్లు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తెలిపింది. ఈమేరకు వైసిపి సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, దాసరి సుధ, విశ్వేశ్వర రాజు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా సమాధానం ఇచ్చింది. వీటిలో 1,59,924 శాశ్వత ఉద్యోగాలు ఉన్నాయి. 2019-24 మధ్య కాలంలో 1,18,359 మంది గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత ఉద్యోగులుగా నియమితులయ్యారు. వీరుగాక, వీరు గాక గత పదేళ్ల కాలంలో 41,565 మందికి మాత్రమే శాశ్వత ఉద్యోగాలు దక్కాయి. శాశ్వత ఉద్యోగాలు కాకుండా గత పదేళ్ల కాలంలో 14,850 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన, మరో 6,434 మంది ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు పొందారు. అయితే వైద్య ఆరోగ్యశాఖలో 2019 నుంచి 2024 మధ్య కాలంలో దాదాపు 49 వేల మందిని నియమించగా వారిని ఏ కేటగిరిలోనూ చూపలేదు. మొత్తంగా వైద్య ఆరోగ్యశాఖలో గత పదేళ్లలో జరిగిన నియామకాలను ఈ జాబితాలో పొందుపర్చలేదు. అలాగే మునిసిపల్ కార్మికులు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా ఈ జాబితాలో చూపలేదు(గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలతో పాటు శాశ్వత ప్రాతిపదికన అత్యధికంగా పంచాయతీరాజ్ శాఖలో 10,453 మందిని నియమించారు.

పదేళ్లలో శాశ్వత ఉద్యోగాలు ఇలా..

ప్రభుత్వ శాఖ	ఉద్యోగాలు
సచివాలయాలు	1,18,359
పంచాయతీరాజ్	10,453
పోలీసు	8740
ఉద్యానవనం	6698
పట్టుపరిశ్రమ	2485
ఆర్అండ్‌బి	1763
ఉన్నత విద్య	1681
జైళ్లు	1503
పశు సంవర్ధక	1246
మత్స్య	904
రెవెన్యూ	831
గురుకులాలు	658
ఎస్‌డిఆర్ఎఫ్	559
పురపాలన	357
సహకార	233
గనులు	202



శ్రీవారి సేవలో అరవింద్ కేజ్రీవాల్

ప్రజాశక్తి -తిరుమల

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తిరుమల శ్రీవారిని సందర్శించారు. బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన గురువారం ఉదయం విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. చాలాకాలం తరువాత సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ, దేశ ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని దేవుని ప్రార్థించానన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారికి స్వర్ణ వైజయంతి మాలలు బహూకరణ

తిరుమల శ్రీవారికి స్వర్ణ వైజయంతి మాలలను టిటిడి మాజీ చైర్మన్ డికె ఆదికేశవులు మనవరావు తేజస్వి విరాళంగా అందజేశారు. సుమారు రూ. రెండుకోట్ల విలువైన ఈ మాలలను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరిలకు అందజేశారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారికి మరో వైజయంతి మాలను శుక్రవారం విరాళంగా ఇవ్వనున్నట్లు దాతలు చెప్పారు.



స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్ జంక్షన్ వద్ద పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టిన స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన పోరాటం మరింత ఉధృతం చేయడంలో భాగంగా ప్రధానమంత్రికి మరోమారు పోస్టుకార్డులు పంపిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్ జంక్షన్ వద్ద యూనియన్ ఆధ్వర్యాన గురువారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ... విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, సొంత గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ. పదివేల కోట్లు సహాయం చేస్తే ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపడంతో పాటు యువతకు, నిర్వాసితులకు కొత్త ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. ఏటా రూ.ఐదు వేల కోట్లు పన్నులు ప్రభుత్వానికి వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. సామాన్య ప్రజలకు మెడికల్ ఆక్సిజన్ అందుతుందని, రైతులకు పుష్కల బ్రాండ్ పేరుతో అమ్మోనియా లభిస్తుందని, ప్రజలకు చౌకగా స్టీల్ అందించే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ పోస్టుకార్డు ఉద్యమంలో యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.అప్పారావు, గంగాధర్, టివికె.రాజు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న అన్ని విభాగాల నుంచి పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

నలుగురికి ప్రాణం పోసిన యువకుడు

- బ్రెయిన్‌డెడ్‌తో అవయవ దానం
- గ్రీన్‌ఛానల్ ద్వారా విశాఖ నుంచి చెన్నై తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి




సాయికుమార్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌తో మరణించిన యువకుడు అవయవదానం ద్వారా నలుగురికి ప్రాణం పోశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయికుమార్ (21) ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయనగరంలోని తిరుమల-మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరింత విషమించడంతో గురువారం బ్రెయిన్‌డెడ్‌గా డాక్టర్లు నిర్ణయించారు. వైద్యుల సూచన మేరకు అవయవదానానికి కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో సాయికుమార్ గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను గ్రీన్ ఛానల్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి విమానంలో చెన్నై తరలించారు. యువకుడి మృతదేహం వద్ద వందలాది మంది విద్యార్థులు, కొత్తవలస గ్రామస్తులు నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులు లంకేన లక్ష్మణరావు, శ్రీదేవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు సాయికుమార్, కుమార్తె స్రవంతి ఉన్నారు.

ప్రేమను అంగీకరించలేదని యువతిపై దాడి

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)



నిందితుడు నీరజ్‌శర్మ

ప్రేమను అంగీకరించలేదని యువతిపై దాడి చేసిన సంఘటన విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బాల చెరువు గ్రామంలో నివాసముంటున్న యువతి (21) సైకాలజీ విభాగంలో బిఎస్‌సి పూర్తి చేశారు. ఎనిమిది నెలల క్రితం 'ఓం శాంతి' టూర్‌లో భాగంగా తల్లితో కలిసి జమ్మూ కశ్మీర్‌కు వెళ్లారు. అక్కడ ఓ భక్తురాలితో వీరికి పరిచయం ఏర్పడింది. ఆశ్రమంలో ఉండగా ఆ భక్తురాలి కుమారుడు నీరజ్‌శర్మ వీరికి పరిచయమయ్యారు. దీంతో ఫోన్ నెంబర్లు చెప్పుకున్నారు. టూర్ అయిపోయిన తర్వాత మేఘన, ఆమె తల్లి ఇంటికి వచ్చేశారు. పెదగంట్యాడ బిసి రోడ్డులోని ఓంశాంతి ఆశ్రమంలో జరిగిన ఓ కార్యక్రమానికి జమ్మూకశ్మీర్ నుంచి నీరజ్‌శర్మ, ఆమె తల్లి వచ్చారు. ఆ సమయంలో యువతి ఇంటికి వెళ్లారు. ఆరు నెలల క్రితం ఆ యువతికి నీరజ్ శర్మ ప్రేమ ప్రతిపాదన పెట్టడంతో ఆమె నిరాకరించారు. ప్రేమించకపోతే ఫోటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీనిపై మేఘన తండ్రి పాపారావు స్థానిక పోలీసులకు రెండుసార్లు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్‌లో కూడా ఫిర్యాదు చేశారు. గురువారంనాడు యువతి ఇంటికి నీరజ్‌శర్మ వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆమె తలపై రాడ్డుతో బలంగా కొట్టడంతో తీవ్ర గాయమైంది. అనంతరం నిందితుడు పరారయ్యాడు. స్థానికులు ఆమెను షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎసిపి కాళిదాసు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లకు, టోల్‌గేట్లకు నిందితుడి ఫొటో పంపించి అలెర్ట్ చేశారు.

సిఎఫ్ఎంఎస్‌పై కాగ్ దృష్టి


త్వరలోనే ప్రత్యేక నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో కీలక భూమి పోషించే సిఎఫ్ఎంఎస్‌పైన కాగ్ దృష్టి సారించినట్లు తెలిసింది. దీనిపై రూపొందించిన నివేదికను సాధ్యమైనంత త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి కాగ్ అందజేయనున్నట్లు తెలిసింది. ఈ నివేదికను శాసనసభ సమావేశాల్లో కూడా ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. సిఎఫ్ఎంఎస్‌పై కాగ్ నివేదికను రూపొందిస్తుండటం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా సిఎఫ్ఎంఎస్‌పై అనేక ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. బిల్లుల చెల్లింపులు, ఆర్థిక నిర్వహణపై ఈ ఆరోపణలు వెలుగుచూస్తున్నాయి. కాంట్రాక్టర్లకు, ఇతర సంస్థలు, వ్యక్తులకు చెల్లించాల్సిన బిల్లుల విధానం అసంబద్ధంగా ఉందని, నచ్చిన వారికి నచ్చినట్లుగా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని ఈ విమర్శల సారాంశం. దీనిపై నేరుగా ప్రభుత్వానికే ఫిర్యాదులు అందినప్పటికీ స్పందన కనిపించలేదు. ఈ నేపథ్యంలోనే కాగ్ దీనిపై దృష్టి సారించడం చర్చనీయాంశంగా మారింది. ఈ నివేదికలో ప్రధానంగా బిల్లుల చెల్లింపులో చోటుచేసుకుంటున్న విధానాన్ని కాగ్ ఎండగట్టే అవకాశాలున్నాయని తెలిసింది. ఆడిట్ కార్యాలయంలోని లెక్కలకు, సిఎఫ్ఎంఎస్ గణాంకాలకు మధ్య పొంతన కనిపించడం లేదన్న విమర్శలతో పాటు, ముందు సంవత్సర ఖాతాలను సక్రమంగా మూసివేయకపోవడం, లెడ్జర్‌లో తేడాలు తదితర అంశాలను కాగ్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల చివరి రోజున ఈ నివేదికను సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం.

టోకు ధరల దరువు

- నాలుగు నెలల గరిష్టానికి డబ్ల్యుపిఐ
- ఆలూ, ఉల్లి ఘాటు



న్యూఢిల్లీ : దేశంలో ధరల రాకాసి కోరలు చాస్తోంది. టోకు, రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ ఎగిసిపడుతోంది. హెచ్చు ధరలు ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. ఇందుకు నిదర్శనం టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) 4 నెలల గరిష్టానికి, రిటైల్ వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 14 మాసాల గరిష్టాలకు చేరడమే. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో టోకు ద్రవ్యోల్బణం సూచీ 2.36 శాతానికి పెరిగిందని గురువారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. అహారోత్పత్తులు, కూరగాయలు, అహార తయారీ, ఇతర రంగాల ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగాయి. 2024 సెప్టెంబర్‌లో డబ్ల్యుపిఐ 1.84 శాతంగా ఉండగా.. 2023 అక్టోబర్‌లో మైనస్ 0.26 శాతంగా నమోదయ్యింది.

మొత్తం డబ్ల్యుపిఐలో అహారోత్పత్తుల వాటా 24.38 శాతంగా ఉంది. గడిచిన అక్టోబర్‌లో వీటి ద్రవ్యోల్బణం 11.59 శాతం ఎగిసింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో 9.47 శాతం పెరిగింది. కాగా.. గతేడాది అక్టోబర్ 3.21 శాతంగా అహార ద్రవ్యోల్బణం నమోదయ్యింది. "ఈ ఏడాది అక్టోబర్‌లో అహారోత్పత్తులు, అహార తయారీ ఉత్పత్తులు, మెషనరీ, పరికరాలు, మోటార్ వాహనాలు తదితర ఇతర తయారీ రంగాల ఉత్పత్తుల ధరలు పెరిగాయి. " అని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గడిచిన నెలలో ముఖ్యంగా ఆలు, ఉల్లి ద్రవ్యోల్బణం సూచీ వరుసగా 78.73 శాతం, 39.25 శాతం చొప్పున ఎగిశాయి. తయారీ రంగ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 1.50 శాతం పెరిగింది. ఈ సూచీ ఇంతక్రితం నెలలో 1 శాతంగా ఉంది.

రిటైల్ వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ)కి అధిక అహారోత్పత్తుల ధరలు ఆజ్యం పోశాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో సిపిఐ 6.21 శాతానికి ఎగిసి.. 14 నెలల గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం సెప్టెంబర్ నెలలో 5.49 శాతంగా ఉండగా.. గతేడాది అక్టోబర్‌లో 4.87 శాతంగా నమోదయ్యింది. గడిచిన అక్టోబర్‌లో రిటైల్ ఆహార పదార్థాల ధరలు 10.87 శాతానికి ఎగిశాయి. గతేడాది ఇదే అక్టోబర్ నెలలో ఆహార పదార్థాల ధరల సూచీ 6.61 శాతంగా నమోదయ్యింది. హెచ్చు ద్రవ్యోల్బణం కీలక వడ్డీ రేట్ల తగ్గింపునకు ప్రధాన అడ్డంకింగ మారనుంది. తాజా ద్రవ్యోల్బణ గణంకాలతో సమీప భవిష్యత్తులో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించడం కష్టమే. దీంతో ఇప్పటికే అధిక వడ్డీ రేట్ల నుంచి ఉపశమనం కోరుకుంటున్న రుణగ్రహీతలకు నిరాశనే ఎదురుకానుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిఒ 3కు చట్టబద్ధత... ప్రత్యేక డిఎస్‌సి

- ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

గిరిజన ప్రత్యేక డిఎస్‌సిపై రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని, షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పించే జిఒ 3కి చట్టబద్ధత కల్పించి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో వంద శాతం రిజర్వేషన్లు కల్పించే జిఒ 3ని 2020లో సుప్రీంకోర్టు రద్దు చేస్తే గత ప్రభుత్వం పునరుద్ధరణ చేయకుండానే జనరల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసిందని, దీంతో ఆదివాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న 2131 ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. గిరిజన సంక్షేమ, ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి గిరిజనులకు ఉపాధ్యాయ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న 1626 పోస్టులకు గాను 271 పోస్టులు మాత్రమే దక్కే అవకాశం ఉందని, ఆదివాసులకు ప్రత్యేక రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించి ప్రత్యేక డిఎస్‌సి ద్వారా ఏజెన్సీలో టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులం (బైలా) నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జనరల్ డిఎస్‌సిలో గురుకులం పోస్టులను విలీనం చేయడం సరికాదని పేర్కొన్నారు. గిరిజన గురుకులానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని లెక్క చేయకుండా ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం 58 పిజిటి పోస్టులు, 446 టిజిటి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయడం అన్యాయమని వివరించారు. గిరిజన జోనల్ వ్యవస్థ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు జిల్లా యూనిట్‌గా పరిగణించే జనరల్ డిఎస్‌సిలో నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. గత ఇరవై ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న టీచర్లను రెగ్యులర్ చేయకుండా జనరల్ డిఎస్‌సిలో పోస్టులను కలపడం తగదని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఆదివాసి ఉపాధ్యాయులను తొలగించవద్దని కోరారు. గిరిజన భాషరాని ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించడం వల్ల ఆర్టికల్ 29, 32లను ఉల్లంఘించినట్లేనని పేర్కొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)



అశోక్

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో గురువారం చోటు చేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కోయావారిపాలానికి చెందిన జొన్నలగడ్డ అశోక్ (36) తనకున్న ఎకరం పొలంతోపాటు మరో 8 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగుచేస్తున్నారు. పంట సాగు నిమిత్తం అప్పులు చేశారు. అకాల వర్షాలు, చీడపీడల కారణంగా పంట చేతికి రాకపోవడంతో చేసిన అప్పులు పెరిగాయి. అప్పులు తీర్చడం కష్టమవ్వడంతో తీవ్ర మనస్తాపంతో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు అశోక్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ఆయన మృతి చెందారు. ఆయన తండ్రి జొన్నలగడ్డ చిన్నోడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బోయింగ్‌లో 17వేల మందిపై వేటు



సియాటెల్ : ప్రముఖ విమానాల తయారీ సంస్థ బోయింగ్ తన వేలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేసింది. ముందుగా ప్రకటించిన విధంగానే ప్రపంచ వ్యాప్తంగా ఆ సంస్థలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం మంది సిబ్బందిని ఇంటికి పంపించే ఏర్పాటు చేసింది. మొత్తంగా 17,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఇప్పటికే తొలగిస్తున్న ఉద్యోగులకు పింక్ స్లిప్పులు పంపిస్తోంది. ఆర్థిక ఒత్తిడులు, ఉత్పత్తి ఆలస్యం, కార్మికుల నుంచి నిరసనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. జనవరి వరకు నోటీసు పీరియడ్‌ను ఇచ్చింది. దీంతో రెండు నెలల వరకు వారు ఉద్యోగ బాధ్యతల్లో కొనసాగుతారని బోయింగ్ తెలిపింది. కష్ట కాలంలో తమ ఉద్యోగులకు అండగా ఉంటామని పేర్కొంది.

రిలయన్స్ - డిస్నీ విలీనం పూర్తి

ముంబయి : రిలయన్స్ ఇండస్ట్రీస్ మీడియా సంస్థ, వాల్ట్ డిస్నీ ఇండియాకు చెందిన మీడియా వ్యాపారాల విలీనం పూర్తి అయ్యింది. విలీన సంస్థకు నీతా అంబానీ చైర్‌పర్సన్‌గా, ఉదయ్ శంకర్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. విలీన సంస్థ వృద్ధికి గానూ రూ.11,500 కోట్ల వ్యయం చేయనున్నట్లు రిలయన్స్ ఓ ప్రకటనలో తెలిపింది. విలీన సంస్థలో రిలయన్స్‌కు 63.16 శాతం వాటా, వాల్ట్ డిస్నీకి 36.84 శాతం చొప్పున వాటాలు ఉంటాయి. ఈ ఒప్పందంలో భాగంగా జియో సినిమా, డిస్నీ హాట్‌స్టార్ పేరిట ఉన్న ఒటిటి వేదికలను జియోస్టార్‌గా మార్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇండియన్ ఆయిల్ చైర్మన్‌గా అరవిందర్ బాధ్యతలు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా అర్వింధర్ సింగ్ సాహ్నీ బాధ్యతలు స్వీకరించారు. ఈ రంగంలో ఆయనకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. కాన్పూర్‌లోని హెచ్‌బిటిఐ నుంచి కెమికల్ ఇంజనీర్ చేసిన ఆయన.. 1993లో ఇండియన్ ఆయిల్‌తో తన వృత్తిని ప్రారంభించారు.

మున్సిపల్ కార్మికుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మున్సిపల్ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కార్మికుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జువ్వలపాలేనికి మంగిన సాయి తాడేపల్లిగూడెం మున్సిపల్ పరిధిలో క్లాప్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారం కావడంతో తీవ్ర నిరాశతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే సాయిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. సాయికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఏసుబాబును వివరణ కోరగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో నిధుల కొరత ఉందని తెలిపారు. కొన్ని చోట్ల యూజర్ ఛార్జీలు వసూలు చేస్తున్న కారణంగా జీతాలు ఇవ్వగలిగారని, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అటువంటి పరిస్థితి లేదని చెప్పారు. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ భద్రం కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

- సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వరంగ సంస్థల ప్రాధాన్యతను కళాత్మకంగా ప్రజలకు చేరవేసి, వాటిని రక్షించుకోవడమే కళాజాతా లక్ష్యమని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య, జోనల్ ఉపాధ్యక్షులు సుజాత అన్నారు. "ప్రజాధనం-ప్రజా వినియోగం కోసం" అనే నినాదంతో హైదరాబాద్ నుంచి చేపట్టిన కళాజాతా గురువారం కడప చేరుకుంది. ఈ సందర్భంగా రాజీవ్ పార్క్ వద్ద కళాజాతా ప్రదర్శించారు. తిరుపతయ్య, సుజాత మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, వ్యవసాయం, పరిశ్రమలు, స్టీల్, రైల్వే, ఆయిల్ రంగ సంస్థలు తమ సొంత కాళ్లపై నిలబడడానికి ప్రభుత్వ రంగ సంస్థలే కారణమని, వాటిని బలహీనపరచడం దేశానికి మంచి కాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, జాతీయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులకు ప్రజల మద్దతు కొనసాగడానికి ఆ సంస్థల పనితీరే కారణమని తెలిపారు. విద్యుత్తు, ఆరోగ్యం, విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కళాజాతాలో కళాకారులు నాటికలు ప్రదర్శించారు. హైదరాబాద్ యూనియన్ నేతలు గిరిధర్, మద్దిలేటి, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆరో రోజూ నేల చూపులే..

సెన్సెక్స్‌కు 110 పాయింట్ల నష్టం



ముంబయి : భారత స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో సెషన్‌లోనూ నష్టాలు చవి చూశాయి. భారీగా ఎఫ్ఐఐలు తరలిపోవడానికి తోడు దేశీయంగా ఎలాంటి సానుకూల పరిణామాలు కానరాకపోవడంతో దలాల్‌స్ట్రీట్ విశ్వాసం కోల్పోతోంది. గురువారం ఉదయం మార్కెట్లు లాభాల్లోనే ప్రారంభమైనప్పటికీ... కాసేపట్లోనే అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 111 పాయింట్లు కోల్పోయి 77,580కి పరిమితమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 26.35 పాయింట్ల నష్టంతో 23,533 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో హెచ్‌యుఎల్, ఎన్‌టిపిసి, నెస్లే, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మరోవైపు రిలయన్స్, కోటక్ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఎంఅండ్ఎం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సూచీలు లాభాల్లో ముగిశాయి. గురునానక్ జయంతి సందర్భంగా శుక్రవారం మార్కెట్లకు సెలవు ప్రకటించారు.

సంపాదకీయం


బుల్డోజింగ్‌కి చెంపపెట్టు

నిందితుల ఇళ్లను కూల్చివేసే 'బుల్డోజరు న్యాయం' రాజ్యాంగ విరుద్ధమని భారత అత్యున్నత న్యాయస్థానం బుధవారం నాడు వెలువరించిన చారిత్రాత్మక తీర్పు బిజెపి పాలకులకు చెంపదెబ్బ. ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే ప్రతీకార ధోరణికి తక్షణం స్వస్తి చెప్పాలని, అధికారులే న్యాయమూర్తుల పాత్ర పోషించడానికి వీలు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాల పట్ల వ్యవహరించాల్సిన విధివిధానాలను కూడా ప్రకటించింది. దాదాపు ఏడేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వాన ఉన్న కాషాయ ప్రభుత్వం ఈ బుల్డోజింగ్ విధ్వంసానికి తెర లేపింది. ఆ తరువాత అది రాజకీయ భిన్నాభిప్రాయం కలిగి ఉన్నవారిపైనా, నిరసనలు వ్యక్తం చేసిన వారిపైనా ప్రయోగించే ఆయుధంగా మారింది. బిజెపి అధికారంలో ఉన్న చాలా రాష్ట్రాలు కూల్చివేతల దుర్మార్గాన్ని ఒక విధానంగా కొనసాగించాయి. "మీ ఇళ్లపైకి బుల్డోజర్లు పంపిస్తాం.. జాగ్రత్త!" అని పలువురు బిజెపి నాయకులు నిరసనకారులను హెచ్చరించటం రివాజుగా మారిపోయింది! ముఖ్యంగా ఒక మతాన్ని లక్ష్యంగా పెట్టుకొని సాగించిన కూల్చివేతల దుర్మార్గం ఈ ఏడేళ్లలో ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపుర, అస్సాం తదితర రాష్ట్రాలకు పాకింది. బిజెపికి వ్యతిరేకంగా గొంతు వినిపిస్తున్నారన్న కారణంతో ఒక్క ఉత్తర ప్రదేశ్‌లోనే 4.5 లక్షల ఇళ్లను కూల్చివేశారు. బుల్డోజింగ్ అనే వికృత విష సంస్కృతి భారత రాజకీయ చిత్రపటంలో ఒక మురికి మరకలా ముద్రితమైంది.

బిజెపి పాలకుల చట్టవ్యతిరేకమైన, రాజ్యాంగ విరుద్ధమైన బుల్డోజర్ న్యాయాన్ని విమర్శిస్తూ అనేక ప్రజాస్వామిక సంస్థలూ పార్టీలూ నిరసన గళం వినిపించాయి. పార్లమెంటులో సిపిఎం, వామపక్ష సభ్యులూ ఇతరులూ గట్టిగా మాట్లాడారు. అయినా, బిజెపి తన కక్షపూరిత విధానాన్ని వదులుకోలేదు. ఎన్‌ఆర్‌సి - సిఎఎ నిరసనల్లో పాల్గొన్న వారిని, వివిధ సందర్భాల్లో పాలక పక్షానికి వ్యతిరేకంగా ర్యాలీలు జరిపిన వారిని లక్ష్యంగా పెట్టుకొని వారి నివాసాలను కూల్చివేసింది. కొన్ని సందర్భాల్లో నేర సంబంధ కేసుల్లోని నిందితుల ఇళ్లపైనా బుల్డోజరు ప్రయోగించింది. అక్రమ నిర్మాణాలనో, మరొకటో కారణంగా చూపించి, జీవించే హక్కు మీద కర్కశంగా దాడి చేసింది. అదేదో దేశభక్తయుత కార్యక్రమంగా కాషాయవాదులు ఘనంగా కీర్తించుకొని, యోగి ఆదిత్యనాథ్‌ని ఆకాశానికి ఎత్తేశారు కూడా! అయితే, దేశంలోనూ, బయటా ఈ ఆటవిక న్యాయంపై పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు వ్యక్తం అయ్యాయి. నిరసన వ్యక్తీకరించిన ముస్లిం సమాజంపై అధికార బిజెపి కక్షపూరితంగా బుల్డోజర్లను ప్రయోగిస్తున్నదని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వ్యక్తం చేసింది కూడా.

బుల్డోజింగ్ అన్యాయంపై సుప్రీం కోర్టులో దాఖలైన వ్యాజ్యాలను జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ దశలోనే బుల్డోజర్ల కూల్చివేతలను తీవ్రంగా తప్పుపట్టింది. బుధవారం నాడు 95 పేజీల సవివరమైన తీర్పును వెలువరిస్తూ, అనేక కీలకమైన వ్యాఖ్యలు చేసింది. "నిందితులకు కూడా కొన్ని హక్కులు ఉంటాయి. ఒక అధికారి న్యాయమూర్తిలా వ్యవహరించి, నిందితుడి ఆస్తిని నేలమట్టం చేయడం అధికారాల విభజన సూత్రాన్ని ఉల్లంఘించటమే అవుతుంది." అని పేర్కొంది. "ఇంట్లో ఉన్న పిల్లలు, మహిళలు, వ్యాధిగ్రస్థ వృద్ధులు రోడ్డున పడతారన్న విచక్షణ, వివేచన లేకుండా ఆగమేఘాల మీద కూల్చివేతలకు పాల్పడ్డం ఆర్టికల్ 19 ఉల్లంఘనే అవుతుంది." అని స్పష్టం చేసింది. నేరారోపణ, నిరూపణ, శిక్ష నిర్ధారణ వంటివి ఒక క్రమపద్ధతిలో జరగాలని, నేరారోపణ చేసినవాళ్లే తీర్పును వెలువరించి, శిక్షలు అమలు చేయడం నేరం అవుతుందని హెచ్చరించింది. అక్రమ నిర్మాణాలు అయినప్పుడు నోటీసుల జారీ, సమాధానానికి 15 రోజుల వ్యవధి ఇవ్వడం వంటి చట్టబద్ధమైన ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని, కోర్టులు కూల్చివేత ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంలోనూ తొందరపాటు పనికి రాదని స్పష్టం చేసింది. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే అధికారులే బాధ్యత వహించి, కూల్చిన కట్టడాలను సొంత ఖర్చులతో నిర్మించాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. రాజకీయంగా లబ్ధి పొందటమే ప్రధాన లక్ష్యంగా బరి తెగిస్తున్న బుల్డోజింగ్ పాలకులకు ఈ తీర్పుతోనైనా బుద్ధి రావాలి.

మహనీయుల మాట



శ్రమ చేసేవారు, శ్రమ దోపిడీకి గురయ్యేవారు ఎప్పటికీ పేదలుగానే వుంటారు. స్వేచ్ఛా మార్కెట్‌లో కార్మికులు ఎప్పటికీ స్వేచ్ఛను పొందలేరు.

- ఫ్రెడరిక్ ఏంగెల్స్


F. Engels

విశ్లేషణ

పాపం పాలకులది...శిక్ష ప్రజలకా!



ఎన్నికలకు ముందు కూటమి నేతలు విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని మాట ఇచ్చారు. జనం నమ్మి గెలిపించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉండి ఈ నేతలు పిలుపునిచ్చారు. నేడు మాట తప్పారు. నమ్మక ద్రోహం చేశారు. రూ.17,898 కోట్ల అదనపు వ్యయం జరిగిందని, లోటు ఉందని తెలిసి కూడా కూటమి నేతలు ఆ భారం జనంపై వేయబోమని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ రూ.17 వేల కోట్లు మీరు కట్టండి. మళ్ళీ ఇక పెంచబోమని మరోసారి ప్రజలను వంచిస్తున్నారు. కూటమి పార్టీలు గాని ప్రభుత్వం గాని వైసిపి పాలనలో అవినీతి, అక్రమాలను రెగ్యులేటరీ కమిషన్ ముందు ఉంచలేదు. ఆ భారం ఆపాలని కోరలేదు. ప్రేక్షక పాత్ర వహించి ఆ సర్దుబాటు భారం జనం నెత్తిన వేయటానికి పరోక్షంగా ఆమోద ముద్ర వేశారు. ప్రజలు చెల్లించక తప్పదని ముఖ్యమంత్రి చెప్పటం అన్యాయం.



సిహెచ్. బాబూరావు

వైసిపి ప్రభుత్వ పన్నులు, ధరల బాదుడుతో విసిగి జనం దించేశారు. ఈ ఐదు నెలల కాలంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి బాదుడు ప్రారంభమైంది. ఐదేళ్లలో వైసిపి రూ. 32 వేల కోట్ల విద్యుత్ భారం మోపగా ఐదు నెలల్లోనే కూటమి సర్కార్ రూ.17,898 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం జనం నెత్తిన వేస్తున్నది.

2022-23, 23-24 సంవత్సరాల్లో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు ట్రూ అప్ (సర్దుబాటు) చార్జీల పేరుతో ఈ భారం వేస్తున్నారు. 2022-23లో వాడుకున్న కరెంటుకు ఈ డిసెంబర్ నుండి 15 నెలల పాటు యూనిట్‌కి సగటున రూ.1.27 పైసల చొప్పున రూ.6072 కోట్లు, 2023-24లో వాడిన విద్యుత్‌పై యూనిట్‌కు మరో రూ.1.38 వరకు మొత్తం రూ.11,862 కోట్లు తదుపరి అదనంగా గుంజటానికి నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రతి నెల సగటున యూనిట్‌కు రూ.2.65 అదనంగా చెల్లించాలన్నమాట.

ఇంతటితోనే ఆగకుండా అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ఉరి తాళ్లు బిగిస్తున్నారు. వ్యవసాయ పంపు సెట్లకు జగన్ ప్రభుత్వం ప్రారంభించిన మీటర్లను ఈ సర్కార్ జోరుగా కొనసాగిస్తున్నది. ఈ ఐదు నెలల పాలనలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టేశారు. ఇప్పుడు చిన్న, పెద్ద షాపులకు, సంస్థలకు దొంగ చాటున మీటర్లు బిగిస్తున్నారు. ఆ తరువాత ప్రతి ఇంటికి ఈ స్మార్ట్ మీటర్ వచ్చేస్తోంది. ఇక ఫోనులో ముందు బ్యాలెన్స్ వేయించుకున్నట్లు, కరెంటుకి ముందుగానే రీచార్జ్ చేయించుకోవాలి. బ్యాలెన్స్ అయిపోగానే కరెంటు ఆగిపోతుంది. స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు అయ్యే ఖర్చు 13 వేల నుండి 30 వేల రూపాయల వరకు 96 నెలల్లో వాయిదాల పద్ధతిలో బిల్లులో కలిపేస్తారు. అధిక కరెంటు వాడే రాత్రి సమయాల్లో అధిక రేటు కట్టాలి. ఈ స్మార్ట్ మీటర్లతో పలు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. బడా సంస్థల, నేతల జేబులు మాత్రం నిండుతాయి.

ఈ సర్దుబాటు చార్జీల పాపం జగన్ ప్రభుత్వానిదేనని తెలుగుదేశం కూటమి సర్కార్ చెప్పి తప్పించుకుంటున్నది. వైసిపి ఎదురుదాడి చేస్తున్నది. ఈ పాపం వీరందరిదీ. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో గతంలో పాలించిన వైసిపి, నేడున్న కూటమి సర్కార్ అందరికీ ఈ పాపంలో వాటా ఉంది.

పాపాల చిట్టా

ఈ పదేళ్ళ మోడీ పాలనలో విద్యుత్ చట్ట సవరణలు చేపట్టారు. ఈ రంగాన్ని బడా కంపెనీలకు కట్టబెట్టడం, ధనికులతో సమానంగా పేదలు విద్యుత్ ఒకటే స్లాబు, స్మార్ట్ మీటర్లు, 30 శాతం విదేశీ బొగ్గు వాడకం, వ్యవసాయం, బలహీన, ఇతర వర్గాలకు రాయితీల కుదింపు విధానాలను ముందుకు తెచ్చింది. ఇవన్నీ అంగీకరిస్తేనే అప్పులు తీసుకోవడానికి అనుమతిస్తామని రాష్ట్రాలకు ఎర వేశారు. జగన్ సర్కార్ అందరికంటే ముందే లొంగిపోయి వీటి అమలు ప్రారంభించింది. విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడిగా చెప్పుకునే చంద్రబాబు సర్కార్ అదే దారిలో నడుస్తోంది.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గత టిడిపి ప్రభుత్వం తరహాలోనే బడా కార్పొరేట్లతో అడ్డగోలు ఒప్పందాలు చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగి అదానీ కంపెనీతో 7 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తుని 25 సంవత్సరాల పాటు అధిక రేట్లకు కొనుగోలు చేసే ఒప్పందాన్ని జగన్ ప్రభుత్వం చేసింది (తొలుత రూ.2.49 పైసలు అని చెప్పినా, అన్ని పన్నులు, చార్జీలు కలిపి యూనిట్ 6 రూపాయలు దాటుతోంది). అదానీ, జగన్ బినామీ సంస్థగా చెప్పే షిరిడీ సాయి ఎలక్ట్రికల్ సంస్థలకు స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టులు కట్టబెట్టింది. ప్రభుత్వ థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తిని తగ్గించి బహిరంగ మార్కెట్‌లో అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేసి బడా కంపెనీలకు మేలు చేసింది. ప్రభుత్వ థర్మల్ ప్లాంట్ల సామర్థ్యంలో 48 శాతం మాత్రమే వినియోగించుకుంటున్నారు. ఒక్క సంవత్సరంలోనే ఉత్పత్తి తగ్గించడంతో 3135 కోట్ల రూపాయల నష్టం వచ్చింది. అంచనాలకు మించి బహిరంగ మార్కెట్లో అధిక రేట్లకు స్వల్పకాలిక కొనుగోళ్ళు చేసి ఐదేళ్లలో రూ.26 వేల కోట్లు చెల్లించారు. సగటున యూనిట్ రూ.7.59 పెట్టి కొన్నారు. ఇందులోనూ భారీ అవినీతి జరిగింది. హిందూజా కంపెనీకి విద్యుత్ ఉత్పత్తి చేయకుండానే 1,234 కోట్ల రూపాయలు అప్పు చేసి మరీ అక్రమంగా చెల్లించారు. విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ. 12,681 కోట్ల సబ్సిడీ బకాయిలను చెల్లించకుండా తొక్కిపట్టింది. వివిధ ప్రభుత్వ శాఖలు రూ. 15,157 కోట్ల కరెంటు బిల్లులు చెల్లించకుండా బకాయి పెట్టాయి. బడా కంపెనీల దోపిడీ, వైసిపి ప్రభుత్వ అవినీతి అక్రమాలతో విద్యుత్ వ్యయం భారీగా పెరిగింది. ఆ భారం మొత్తాన్ని ఇప్పుడు సర్దుబాటు చార్జీల రూపంలో జనం నెత్తిన వేస్తున్నారు.

బాబు - బ్యాంకు - విద్యుత్తు

విద్యుత్ రంగంలో ప్రపంచ బ్యాంకు షరతులతో 2000 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్తును మూడు ముక్కలు చేసింది. ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీలను తెచ్చి వాటితో అడ్డగోలు ఒప్పందాలు (పిపిఏ) చేసుకున్నారు. సర్దుబాటు, ట్రూ అప్...ఇలా పలు పేర్లతో అదనపు చార్జీలు వసూలు చేసే విధానాన్ని తెచ్చారు. విద్యుత్ చార్జీలు నిర్ణయించే బాధ్యతల నుండి ప్రభుత్వాలు తప్పుకొని నియంత్రణ మండలి చేతిలో పెట్టారు. స్వతంత్రంగా ఉండాల్సిన నియంత్రణ మండలి ప్రభుత్వాల చేతిలో పావుగా మారాయి. ఈ విధానాలనే తర్వాత కాలంలో వచ్చిన ప్రభుత్వాలు ఏదో ఒక రూపంలో కొనసాగించాయి.

కేంద్రంలోని బిజెపి దేశమంతా మరింత దూకుడుగా ఈ ప్రమాదకరమైన సంస్కరణలను అమలు చేస్తున్నది. ఈ పాపం వీరందరిదీ. ఎవరూ బాధ్యత నుండి తప్పించుకోలేరు. పాపం పాలకులది. శిక్ష మాత్రం ప్రజలకు వేస్తున్నారు.

చౌకైన, నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్ అంటూ సంస్కరణల ప్రారంభంలో ఊదరగొట్టారు. ప్రభుత్వాలు దొడ్డి దారిన, అడ్డదారిలో ప్రజల కళ్ళుగప్పి పలు రూపాలలో విద్యుత్ భారాలు వేస్తున్నారు. కస్టమర్ చార్జీలు, స్థిర (ఫిక్స్) చార్జీలు, విద్యుత్ సుంకం, మినిమం చార్జీ, పెనాల్టీలు, సర్ చార్జీలు, అదనపు డిపాజిట్లు ఇలా రకరకాల పేర్లతో దోచుకుంటున్నారు. అసలు కంటే కొసరు చార్జీలు ఎక్కువవుతున్నాయి.

2014 -19 సంవత్సరాలలో వాడిన కరెంటుపై గత 28 నెలల నుండి ప్రతి యూనిట్ పైన అదనంగా 63 పైసలు సర్దుబాటు చార్జీ వసూలు చేస్తున్నారు. మరో 8 నెలలు ఇవి కొనసాగుతాయి. కేంద్రం ఇచ్చిన సలహాతో ప్రతి నెల గత నెలలో వాడిన కరెంటుపై యూనిట్‌కి 40 పైసలు అదనంగా గుంజుతున్నారు. ఈ రెండు రకాల సర్దుబాటు చార్జీలతో పాటు, డిసెంబర్ నుండి మరో సర్దు'పోటు' ప్రారంభమవుతుంది. మరి కొద్దిరోజుల్లోనే 23-24 సంవత్సరానికి సర్దు'పోటు' రెడీ అవుతున్నది. అన్నీ కలిపి ప్రతి నెల అసలు చార్జీ కాకుండా అదనంగా యూనిట్‌కు రూ.3.68 పైసలు సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తారు. పాలకుల అవినీతి, అక్రమాలు, అసమర్ధ చర్యలు, బడా కంపెనీల దోపిడీతో ఖర్చులు పెరిగితే వాటిని జనం భరించాలా? అందుకే ఈ సర్దుబాటు చార్జీల విధానమే రద్దు కావాలి.

మాట తప్పిన కూటమి

ఎన్నికలకు ముందు కూటమి నేతలు విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని మాట ఇచ్చారు. జనం నమ్మి గెలిపించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉండి ఈ నేతలు పిలుపునిచ్చారు. నేడు మాట తప్పారు. నమ్మక ద్రోహం చేశారు.

రూ.17,898 కోట్ల అదనపు వ్యయం జరిగిందని, లోటు ఉందని తెలిసి కూడా కూటమి నేతలు ఆ భారం జనంపై వేయబోమని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ రూ.17 వేల కోట్లు మీరు కట్టండి. మళ్ళీ ఇక పెంచబోమని మరోసారి ప్రజలను వంచిస్తున్నారు.

కూటమి పార్టీలు గాని ప్రభుత్వం గాని వైసిపి పాలనలో అవినీతి, అక్రమాలను రెగ్యులేటరీ కమిషన్ ముందు ఉంచలేదు. ఆ భారం ఆపాలని కోరలేదు. ప్రేక్షక పాత్ర వహించి ఆ సర్దుబాటు భారం జనం నెత్తిన వేయటానికి పరోక్షంగా ఆమోద ముద్ర వేశారు. ప్రజలు చెల్లించక తప్పదని ముఖ్యమంత్రి చెప్పటం అన్యాయం.

బాబు, జగన్, మోడీ ... తోడు, నీడ

వైసిపి ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని చంద్రబాబు నాయుడు సర్కార్ చట్టబద్ధం చేసి ప్రజలపై వేస్తోంది. పైపెచ్చు హిందూజా సంస్థకు అక్రమంగా రూ.1234 కోట్లు చెల్లిస్తే, వాటికి ఈ సర్కార్ ఆమోద ముద్ర వేయటం గర్హనీయం. చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడైనా గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరపాలి. అవినీతి వెలికి తీయాలి. ఆ డబ్బు రాబట్టాలి. అవినీతి నేతలను, అధికారులను శిక్షించాలి. ఇంకా అదనపు వ్యయం ఉంటే ప్రజలకు హామీ ఇచ్చిన ప్రకారం ప్రభుత్వమే భరించాలి. ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించాలి. ఈ బడ్జెట్‌లో పొందుపరచాలి.

అదానీ కంపెనీతో చేసుకున్న ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందం వలన సంవత్సరానికి రూ.3,850 కోట్లు, 25 సంవత్సరాల కాలంలో రూ.96 వేల కోట్లు పైగా ప్రజలపై భారం పడుతుందని స్వయంగా చంద్రబాబు శ్వేతపత్రంలో చెప్పారు. అయినా ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తూ వైసిపి దారిలోనే కూటమి ప్రభుత్వం నడుస్తోంది.

వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు, నివాసం ఇతర కనెక్షన్లకు ప్రీపెయిడ్ మీటర్ల కాంట్రాక్టు అదానీ, షిరిడీ సాయి కంపెనీలకు కట్టబెట్టి వైసిపి భారీ కుంభకోణానికి పాల్పడిందని టిడిపి నేతలు కోర్టులో పిటిషన్ వేశారు. షిరిడీ సాయి ఎలక్ట్రికల్ జగన్ బినామీ సంస్థ అని టిడిపి ఆరోపించింది. నేడు ఆ ఒప్పందాలను కొనసాగిస్తూ మీటర్లు బిగిస్తున్నారు. జగన్ బినామీగా చెప్పిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్ సంస్థ నుండి 2024 జనవరిలో రూ.40 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో టిడిపి అధికారయుతంగా డబ్బు తీసుకున్నది. ఎవరు ఎవరితో కుమ్మక్కు అవుతున్నారో దీన్నిబట్టే అర్థమవుతున్నది. వీరందరూ జతకట్టి ప్రజలను బలి చేస్తున్నారు. చార్జీలు పెంచేస్తున్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ప్రతి నెల అంతకు ముందు నెలలో వినియోగించుకున్న విద్యుత్‌పై తదుపరి నెలలో 40 పైసలు సర్దుబాటు చార్జీ వసూళ్ల కొనసాగిస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో అవినీతి వల్ల ఖర్చులు పెరిగి భారం పడిందని చెప్పిన టిడిపి, తన పాలనలో నీతిగా పనిచేసి ఖర్చు తగ్గించి ట్రూ డౌన్ చేసి చార్జీలు తగ్గించవచ్చు.

చార్జీల భారం వేయకుండా నివారించడానికి అన్ని అవకాశాలు ఉన్నా, వాటిని కొనసాగిస్తూ జనంపై వేయటం అక్రమం. పైపెచ్చు స్మార్ట్ మీటర్ల బిగింపు శర వేగంగా సాగించడం దుర్మార్గం.

క్లీన్, గ్రీన్ ఎనర్జీ పేరుతో కూటమి సర్కార్ హడావిడి చేస్తోంది. రిలయన్స్, టాటా, అదానీ ఇతర బడా కంపెనీలు వేల కోట్ల రూపాయలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ మంచిదే. కానీ అవినీతి దోపిడీ కాలుష్యాన్ని ఆపాలి. భారాల మోత లేకుండా చూడాలి. అడ్డగోలుగా భూముల కేటాయింపులు ఆపాలి. గత అనుభవాల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి. క్లీన్ ఎనర్జీ పేరుతో మలిన చర్యలు సాగితే జనం వేయి కళ్లతో గమనించాలి, తిప్పి కొట్టాలి.

ప్రజలందరూ ఏకమై ట్రూఅప్ భారాన్ని స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి. సర్దుబాటు చార్జీల విధానమే రద్దు కావాలి. విద్యుత్ రంగంలో ప్రమాదకరమైన విధానాలు పోవాలి. ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న వామపక్షాలు, ప్రజా సంఘాలకు అండగా నిలవాలి. ఉమ్మడి పోరు సాగించాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

సందర్భం

'బిర్సా' స్ఫూర్తితో గిరిజనాభివృద్ధి



ఆదివాసీ స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా జయంతి నేడు. 1875 నవంబర్ 15న జన్మించిన ఆయన బతికింది 25 సంవత్సరాలే. కానీ నాటి ఆంగ్లేయుల పాలనలో ఆదివాసీలకు జరిగిన అన్యాయాలపై చైతన్యం రగిల్చి, పోరాటానికి నాయకత్వం వహించి ఆ క్రమంలో అసువులు బాశాడు. ఈనాటి జార్ఖండ్ ప్రాంతం వేదికగా పోరాటం చేసిన ఆయన స్ఫూర్తి, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకమన్నది గుర్తించి ఆ మహనీయుని చిత్రపటాన్ని పార్లమెంటు ప్రాంగణంలో నిలిపి గౌరవించింది దేశం. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ సమాజంలో అత్యంత వెనుకబడి ఉన్న గిరిజనుల అభివృద్ధికి, తద్వారా వారి స్వాభిమానం కాపాడడానికి, పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరంకితం కావాల్సి ఉంది. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక రక్షణలు, హక్కులు అన్వయిస్తూనే వారి జీవనం మెరుగుపర్చే చర్యలు తీసుకోవాల్సి ఉంది. గిరిజనులు జీవిక కోసం ఆధారపడేవి భూమి, అడవి, ప్రభుత్వ ఉద్యోగాలు. ఇందులో భూమి కలిగిన వాళ్ళ తక్కువ. కూలి పనులపై ఆధారపడిన వారే తొంభై శాతం మంది. ఇక ఉన్న అడవిపై అధికారం లేదు. ఫల సాయం సేకరణలో కూడా ఆంక్షలు ఎక్కువ. ఉద్యోగాలు తగ్గుతూ, నిరుద్యోగం పెరుగుతూ వస్తోంది. ఈ మూడు విషయాల్లో ప్రత్యేక దృష్టి అవసరం. అటవీ హక్కుల్ని అమలు చెయ్యడం, వాటిపై పంట ఉత్పత్తి పెంచేలా సహకరించడం, అటవీ ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానం చేసి, లాభదాయకంగా ఉండేలా ప్రభుత్వం చెయ్యగలదు.ఈ చర్యలు జీవనానికి లోటు లేకుండా చూస్తాయి. ఇక అభివృద్ధి కోసం ఆయా ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, ఆహార భద్రత కల్పించడం ముఖ్య భూమిక పోషిస్తాయి. అంతేగాక సంస్కృతి, భాషల్ని కాపాడే ప్రయత్నం జరగాలి. అప్పుడే ఆదివాసీ ఆత్మ గౌరవం, అభివృద్ధి తద్వారా దేశ ప్రగతి సాధ్యమౌతుంది. ఆ దిశగా ప్రభుత్వాలు ముందుండి కృషి చేస్తే, పౌర సమాజం తోడ్పాటు అందిస్తుంది.

- డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ, విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

వ్యాఖ్య

మితవాదులతో ట్రంప్ కొలువు

డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైతే అతగాడి ఫాసిస్టు ఎజెండాను అమలు చేస్తాడని భయపడిందంతా గద్దెనెక్కక ముందే వాస్తవ రూపం దాలుస్తోంది. అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ విజయం సంపూర్ణమైంది. ఇప్పటికే అధ్యక్ష స్థానం, సెనెట్‌ను వశం చేసుకున్న ఆ పార్టీ పార్లమెంటు ప్రజాప్రతినిధుల సభ కాంగ్రెస్‌లో కూడా మెజారిటీ సాధించింది. ఇది రాస్తున్న సమయానికి ఇంకా తొమ్మిది సీట్ల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉండగా 435కు గాను రిపబ్లికన్లకు సభలో కావాల్సిన మెజారిటీ 218 స్థానాల్లో విజయం లేదా ముందంజలో ఉన్నట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. పోస్టు ద్వారా వచ్చే ఓట్లకు ఎన్నికలు ముగిసిన తరువాత వారం రోజుల గడువు ఉండటంతో మెల్లగా వస్తున్న వాటి లెక్కింపు కొనసాగుతోంది. గురువారం నాటికి మొత్తం పోలైన వాటిలో 97 శాతం లెక్కింపు జరిగింది. ఇప్పటికే మెజారిటీలను బట్టి ఆ ఓట్లు ఎటు పడినా ఫలితాలు మారే అవకాశం లేదన్న అంచనాతో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వచ్చేది దాదాపుగా తేలినట్లే. మరో రెండు సంవత్సరాలకు జరిగే మధ్యంతర ఎన్నికల్లో వచ్చే సీట్లను బట్టి పార్లమెంటులో మెజారిటీలు మారవచ్చు, కొనసాగవచ్చు. అప్పటి వరకు డోనాల్డ్ ట్రంప్ తన బుల్డోజర్ ఎజెండాను అమలు జరిపేందుకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. అయితే ఉభయ సభల్లో మెజారిటీలు తక్కువగా ఉన్నందున కొన్ని సందర్భాలలో అధ్యక్షుడి నిర్ణయాలకు ఆమోదం కోసం ప్రతిపక్ష డెమోక్రాట్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. జో బైడెన్‌కు కాంగ్రెస్‌లో మెజారిటీ లేకున్నా 2022 నుంచి రిపబ్లికన్ల మద్దతుతో ముందుకు సాగిన తీరును చూస్తే ట్రంప్ కూడా అదే బాటలో నడుస్తాడని అర్థమౌతోంది.

"లాంఛన ప్రాయంగా ఇంకా అధికారాన్ని స్వీకరించక ముందే ట్రంప్ తన యంత్రాంగాన్ని ఎంచుకోవటం ప్రారంభించాడు. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ ఒక సలహాదారు. అతగాడి దగ్గర నుంచి పచ్చి మితవాదుల వరకు ఎన్నికలలో తన కోసం పని చేసిన వారిని లేదా తెర వెనుక ఉండి సహకరించిన వారి ప్రతినిధులను, తన ఎజెండాను గుడ్డిగా సమర్ధించే, ముందుకు తీసుకుపోయేవారిని, తన కనుసన్నలలో తీర్పులను ఇచ్చే న్యాయమూర్తులను ఎంచుకున్నాడు. డెమొక్రటిక్ పార్టీ నుంచి ఫిరాయించిన తులసీ గబ్బార్డ్‌ను నేషనల్ ఇంటిలిజెన్స్ డైరెక్టర్‌గా నియమించాడు."



లాంఛన ప్రాయంగా ఇంకా అధికారాన్ని స్వీకరించక ముందే ట్రంప్ తన యంత్రాంగాన్ని ఎంచుకోవటం ప్రారంభించాడు. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ ఒక సలహాదారు. అతగాడి దగ్గర నుంచి పచ్చి మితవాదుల వరకు ఎన్నికలలో తన కోసం పని చేసిన వారిని లేదా తెర వెనుక ఉండి సహకరించిన వారి ప్రతినిధులను, తన ఎజెండాను గుడ్డిగా సమర్ధించే, ముందుకు తీసుకుపోయేవారిని, తన కనుసన్నలలో తీర్పులను ఇచ్చే న్యాయమూర్తులను ఎంచుకున్నాడు. డెమొక్రటిక్ పార్టీ నుంచి ఫిరాయించిన తులసీ గబ్బార్డ్‌ను నేషనల్ ఇంటిలిజెన్స్ డైరెక్టర్‌గా నియమించాడు. కొందరు పార్లమెంటు సభ్యులను కూడా ఎంచుకున్నందున కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తరువాత ఆ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయి. అధికారానికి వచ్చిన వంద రోజుల్లో ఏం చేయనుందీ ముందుగానే సూచన ప్రాయంగా వెల్లడించాడు. ముస్లింల మీద నిషేధం, అక్రమంగా ప్రవేశించిన లక్షలాది మంది విదేశీయులను సామూహికంగా బయటకు పంపటం, తన ఆదేశాల మేరకు 2021 జనవరి ఆరున అమెరికా అధికార కేంద్రం కాపిటోల్‌పై దాడిచేసిన వారిమీద ఉన్న కేసుల ఎత్తివేతకు క్షమాభిక్ష ప్రకటన, బైడెన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పర్యావరణ విధానాల రద్దు వంటివి వాటిలో ఉన్నాయి. అధికార యంత్రాంగ నియామకాల తీరుతెన్నులను చూసిన తరువాత అతగాడి ఫాసిస్టు ఎజెండాను అమలు జరపటం ఖాయమనే భయాందోళనలు ప్రారంభమయ్యాయి. ఆయుధ పరిశ్రమల ప్రయోజనాల కోసం పనిచేసే ఫాక్స్ న్యూస్ జర్నలిస్టు పీట్ హెగ్‌సేత్‌ను రక్షణశాఖ మంత్రిగా నియమించిన తీరు ఆ శాఖ యంత్రాంగాన్నే నివ్వెరపరిచినట్లు వార్తలు. దాడులలో మహిళలను నియమించకూడదని, యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని క్షమించివేయటం వంటి పచ్చి మితవాద వైఖరులను పీట్ కలిగి ఉన్నాడు. తన టీవీ కార్యక్రమాలలో ట్రంప్‌ను అడ్డగోలుగా సమర్ధించాడు. పాలస్తీనానా, వెస్ట్ బ్యాంకా అదెక్కడుంది అంటూ గుడ్డిగా వ్యతిరేకించిన అర్కాన్సాస్ మాజీ గవర్నర్ మైక్ హక్‌బీని ఇజ్రాయిల్‌లో అమెరికా రాయబారిగా ఎంపిక చేయటాన్ని బట్టి రానున్న రోజుల్లో పశ్చిమాసియాలో చిచ్చు కొనసాగించేందుకే ట్రంప్ నిర్ణయించుకున్నట్లు తేటతెల్లమైంది. అందుకే ఇజ్రాయిల్ నాయకత్వం ట్రంప్ విజయోత్సవాలు జరుపుకుంటోంది. పాలస్తీనా నిర్వాసితులకు సాయం చేసే ఐరాస సహాయ సంస్థకు నిధులు ఇవ్వకూడదని వాదించే మహిళ ఎలీ స్టెఫానిక్‌ను ఐరాస రాయబారిగా ఎంచుకున్నాడు. ట్రంపే అనుకుంటే అతని కొలువులో చేరిన వారు ఎలాంటి చర్యలకు పాల్పడతారో తెలియదు. అమెరికా ఎన్నికలు అక్కడి కార్మిక వర్గాన్ని, యావత్ ప్రపంచాన్నే ముప్పు ముంగిటకు చేర్చాయంటే అతిశయోక్తి కాదు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ముంచుకొస్తోంది ముప్పు!

ముంచుకొస్తోంది ముప్పు
మనల్ని చుట్టూ ఆక్రమిస్తూ
స్వచ్ఛతను పాడు చేస్తూ
శ్వాసని ఇబ్బంది పెడుతూ
ముంచుకొస్తోంది ముప్పు!
వాహనాలు వదిలే పొగలతో
చుట్టుముడుతూ
పరిశ్రమలు వదిలే వాయువులకు
స్వాగతం పలుకుతూ
ముంచుకొస్తోంది ముప్పు!
జనారణ్యం పెరగడంతో
వనారణ్యం తగ్గడంతో
ప్రాణవాయువు తగ్గి
మరణ వాయువు పెరిగి
ముంచుకొస్తోంది ముప్పు!
అజ్ఞానంతో కొంత
అహంకారంతో కొంత
పరిసరాలను పాడుచేస్తూ
సహజ వనరులను
దుర్వినియోగం చేస్తూ
ఈ విపత్తుకు కారణమైన
మనిషి వల్లే
ముంచుకొస్తోంది ముప్పు!
మొక్కలను పెంచి
కర్బన ఉద్గారాలను తగ్గించి
ప్రత్యామ్నాయ ఇంధన
వనరులను ఉపయోగించి
వాయు కాలుష్యాన్ని నియంత్రించి
భవిష్యత్ తరాలకు కూడా
స్వచ్ఛ వాయువులను అందిద్దాం
అందించాలి కూడా
అది మన బాధ్యత!
అదే మనందరి బాధ్యత!!

- ఏడుకొండలు కళ్ళేపల్లి, మచిలీపట్నం
9490832338

పునరుత్పాదక విద్యుత్‌కు ప్రాధాన్యత

● క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించుకున్న డి కార్బొనైజేషన్ సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024పై మంత్రి రవికుమార్ గురువారం శాసనసభలో ప్రకటన చేశారు. గ్రిడ్ నిర్వహణకు రెన్యూవ బుల్ ఎనర్జీ, అత్యాధునిక సాంకేతికత స్వీకరణ, ట్రాన్స్‌మిషన్ నెట్ వర్కు, గ్రీన్ ఎనర్జీ కారిడార్ల ద్వారా ఇంధన వ్యయాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఉత్పాదక పర్యావరణ వ్యవస్థ అభివృద్ధితోపాటు ప్రాజెక్టుల కోసం పెట్టుబడులను ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు ఉపాధి అవకాశాలు సృష్టిస్తామన్నారు. ఈ పాలసీద్వారా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. దేశంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం, ప్రైవేటు, పట్టాభూమికి లీజు ధరను మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు, పట్టా భూమి ఎకరాకు రూ.31 వేలు ఇస్తారన్నారు. జీవ ఇంధనాల ప్రాజెక్టుల కోసం ఎకరాకు రూ.15 వేలు, ఓడరేవులో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లకు ప్రభుత్వ భూములకు రూ.లక్ష చొప్పున ఇస్తామన్నారు. నూతన విధానంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేశామన్నారు. 7.50 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. తద్వారా రాష్ట్రానికి రానున్న ఐదేళ్లలో రూ.67 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

కృష్ణా డెల్టాలో ఆరుతడి పంటలకే నీరు

● నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజినీరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా డెల్టా పరిధిలో రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజినీరు తెలిపారు. నెలరోజులుగా కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గిపోయిందన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. నదీ పరివాహక ప్రాంతంలోని శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ రిజర్వాయర్లలోని నీటిలో ప్రస్తుత ఖరీఫ్ పంటలకు 167 టిఎంసిలు, 2025 జూన్ నెలాఖరు వరకు తాగునీటి అవసరాలకు మరో 22 టిఎంసిలు అవసరం ఉందని తెలిపారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో ఇప్పటి వరకు వినియోగించుకోగా, రాష్ట్ర వాటాగా 114 టిఎంసిలు మాత్రమే మిగిలి ఉందని తెలిపారు. పులిచింతలలో మిగిలి ఉన్న నీటిలో 39 టిఎంసిలు తాగునీటి అవసరాలకు, రాబోయే ఖరీఫ్ పంటలకు ముందస్తుగా జూన్‌లో నీరు విడుదల చేయడానికి ఉపయోగించుకోవాల్సి ఉంటుందని వివరించారు.

దాళ్వా ఆశలపై నీళ్లు

దాళ్వా వరిసాగు ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. గత నాలుగేళ్లుగా కృష్ణా డెల్టా పరిధిలో రబీలో ఆరుతడి పంటలకు మాత్రమే ప్రభుత్వం నీరు విడుదల చేస్తోంది. దీంతో క్షారభూములున్న రెండు పంటసాగుకుఅవకాశం లేకుండాపోయింది. గతంలో సార్వా, దాళ్వా రెండు పంటలు సాగైన ఈ భూముల్లో నాలుగేళ్లుగా ఒక్కపంట మాత్రమే సాగవుతోంది. ఈ ఏడాది నదిలో వరద నీటి ప్రవా హం అత్యధిక రోజులు కొనసాగింది. ఎగువ ప్రాజెక్టుల్లోనూ సమృద్ధిగా నీరు ఉంది. ఈ ఏడాది రబీలో దాళ్వా వరిసాగుకు అవకాశం ఇవ్వాలని కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సమస్యపైనే మండల కేంద్రం బంటుమిల్లిలో రైతులు ర్యాలీ నిర్వహించి, ధర్నా కూడా చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సైతం దాళ్వాకు నీరు విడుదలపై ప్రభుత్వం ప్రకటన చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఏర్పాటుచేసిన సమావేశంలో కోరారు.

అది వివాదాస్పదమట !

● పాలస్తీనా ఘర్షణలపై గురుగ్రామ్ వర్సిటీ వింత భాష్యం ● ప్రసంగ కార్యక్రమం రద్దు

గురుగ్రామ్ : పాలస్తీనా ఘర్షణలపై గురుగ్రామ్ విశ్వవిద్యాలయంలో జరగాల్సిన ప్రసంగ కార్యక్రమాన్ని ఇటీవల అధికారులు రద్దు చేశారు. ఇది 'వివాదాస్పద' అంశమని, ఈ కార్యక్రమానికి తన అనుమతి కోరలేదని వైస్ ఛాన్సలర్ దినేష్ కుమార్ చెప్పుకొచ్చారు. పాలస్తీనా ఘర్షణలపై గురుగ్రామ్ వర్సిటీలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ జోయా హసన్ ప్రసంగించాల్సి ఉంది. యూనివర్సిటీకి చెందిన రాజకీయ శాస్త్ర విభాగం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ నెల 12న అది జరగాల్సి ఉంది. అయితే 10వ తేదీన హసన్‌కు నిర్వాహకులు ఫోన్ చేసి, కార్యక్రమం రద్దయిందని తెలియజేశారు. దీనిపై వైస్ ఛాన్సలర్ దినేష్ కుమార్ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రతినిధితో మాట్లాడుతూ 'ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీలో ఓ టీచర్ ఏర్పాటు చేశారు. నాకు ఆ విషయమే తెలియదు. నేను క్యాంపస్‌లో లేను. ప్రసంగించాల్సిన విషయం వివాదాస్పదమైనది అయినందున మేము ఆ కార్యక్రమాన్ని రద్దు చేశాము' అని తెలిపారు. పాలస్తీనా ఘర్షణలపై తాను రాసిన వ్యాసాన్ని ఓ వార్తాపత్రిక ప్రచురించిందని, ఆ తర్వాత పొలిటికల్ సైన్స్ విభాగం తనను కలిసి దానిపై ప్రసంగించాల్సిందిగా కోరిందని హసన్ చెప్పారు. 'పాలస్తీనా ఘర్షణలపై భారత్ స్పందిస్తున్న తీరు గురించి చర్చించాల్సిన అవసరం ఉన్నదని వారు నాకు చెప్పారు. అందుకు నేను అంగీకరించాను. ఈ నెల ఐదవ తేదీన నిర్వాహకులు నన్ను కలిశారు. ఉపన్యాస శీర్షికపై చర్చించారు. కార్యక్రమానికి రవాణా తదితర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమ నిర్వహణకు అనుమతి తీసుకున్నామని కూడా తెలిపారు. అయితే పదవ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో నిర్వాహకుడి ఆరోగ్యం సరిగా లేదని సమాచారం ఇచ్చారు. ఒకవేళ అది ఆరోగ్య సమస్యే అయితే ముందుగా అనుకున్న కార్యక్రమాన్ని ఎందుకు రద్దు చేయాలి?' అని ఆమె ప్రశ్నించారు. పాలస్తీనాపై చర్చ జరగకపోయినప్పటికీ దానిపై ఫ్యాకల్టీ ఆసక్తి చూపడం మంచి విషయమేనని హసన్ వ్యాఖ్యానించారు. కాగా పశ్చిమాసియా అధ్యయనాల జేఎన్‌యూ కేంద్రంలో గత నెలలో ఇరాన్, పాలస్తీనా, లెబనాన్ రాయబారులు మూడు సెమినార్లకు హాజరు కావాల్సి ఉండగా వాటన్నింటినీ రద్దు చేశారు.

బలవంతపు వలసలు కూడా యుద్ధనేరమే

జెరూసలెం : ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానీయ దాడులతో గాజాలోని వేలాది మంది ప్రజలు బతుకుజీవుడా అంటూ ఇతర ప్రాంతాలకు బలవంతంగా వలస వెళ్లాల్సివస్తోంది. ఇలా తీవ్ర దాడుల కారణంగా ప్రజలు సొంత గూడును విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లేలా చేయడం కూడా యుద్ధ నేరంగానే పరిగణించాలని మానవ హక్కుల సంస్థ హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది.

భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు

● సభ ముందుకు కొత్త చట్టం

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

భూ ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అవకాశం కల్పించే 'ఏపీ ల్యాండ్ (గ్రాబింగ్)(నిషేధ) బిల్లు-2024'ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఇప్పటివరకు అమలులో ఉన్న చట్టంలో పలు సవరణలు తీసుకు వచ్చారు.

కొత్త చట్టంలో ఇలా...

. భూ దురాక్రమణకు పాల్పడిన వారికి 10-14 సంవత్సరాల జైలు శిక్షతో పాటు, ఆక్రమించిన భూముల మార్కెట్ విలువ కంటే జరిమానా విధించే అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. భూ దురాక్రమణ చేసి, భూమిని విక్రయించినా లేదా కేటాయించినా, ప్రభుత్వం అటువంటి ఆస్తులను దురాక్రమణ భూములుగా గుర్తించనుంది.

ఇతరుల భూములను ఆక్రమించడం కాకుండా, దౌర్జన్యం, బెదిరింపు, బలప్రయోగం వంటి చర్యలకు పాల్పడిన వారిని భూ దురాక్రమణదారులుగా గుర్తించడం జరుగుతుంది. భూముల ఆక్రమణలో కంపెనీలు కూడా పాల్పన్నట్లయితే, అప్పటి ఇన్‌ఛార్జి లేదా అధికారులను బాధ్యులుగా గుర్తించి శిక్షలు విధించేలా చట్టంలో పేర్కొన్నారు.

ప్రత్యేక న్యాయస్థానాలు

భూ దురాక్రమణ కేసుల త్వరిత పరిష్కారానికి హైకోర్టు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయవచ్చు. ప్రతి ప్రత్యేక కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించనున్నారు, తద్వారా భూ దురాక్రమణ కేసుల్లో సమ ఉచిత న్యాయం అమలు చేస్తామని బిల్లులో పేర్కొన్నారు. ప్రత్యేక న్యాయస్థానం భూములను స్వాధీనం చేసుకునే అధికారం కలిగి ఉంది. ఆక్రమించిన భూములను ఖాళీ చేయించి, అసలు యజమానికి తిరిగి అప్పగించేందుకు ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చని బిల్లులో పేర్కొన్నారు.

జాత్యహంకారం, కుట్ర సిద్ధాంతాల కేరాఫ్

● 'ఎక్స్' తీరుపై 'గార్డియన్' ఆగ్రహం

లండన్ : జాత్యహంకారం, కుట్ర సిద్ధాంతాలకు ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' కేరాఫ్‌గా నిలిచిందని ప్రఖ్యాత అంతర్జాతీయ వార్తా సంస్థ 'గార్డియన్' ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక నుంచి ఇందులో తాము పోస్టులు చేయబోమని ప్రకటించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ కోసం బహిరంగంగానే ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జాత్యహంకారం, కుట్రపూరిత సిద్ధాంతాలకు 'ఎక్స్' చోటు కల్పించిందని గార్డియన్ విమర్శిస్తోంది. గార్డియన్‌కు ఎక్స్‌లో 1.07 కోట్ల మంది ఫాలోయర్స్ ఉన్నారు.

బంగారు గనిలో చిక్కుకున్న అక్రమ మైనర్ల పట్ల కఠినంగానే ఉంటాం : దక్షిణాఫ్రికా మంత్రి

జోహాన్నెస్‌బర్గ్: ప్రభుత్వం మైనింగ్ చేసి వదిలేసిన బంగారు గనిలో అక్రమంగా ప్రవేశించి అందులో చిక్కుకుపోయిన వేలాది మంది మైనర్ల పట్ల ఆఫ్రికన్ ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకుంది. 'గనిలో చిక్కుకున్న వారు నేరస్తులు, అక్రమ మైనర్లు, వారికి ఆహారం, నీరు, ఇతర నిత్యావసరాలను అందించే ప్రసక్తే లేదు' అని ఆఫ్రికా క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి గేటస్ మెకెంజీ చెప్పారు. మంత్రి తీసుకున్న కఠిన వైఖరికి కొందరు మద్దతు పలకగా, ఇంకొందరు విమర్శిస్తున్నారు. ఈ అంశం ఇప్పుడు ఆన్‌లైన్‌లో చర్చనీయాంశంగా మారింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ. ఏపీ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2) RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ ఆబ్లిగెంట్ (లు) : ఋణగ్రహీతలు : 1. మెస్సర్స్ శ్రీ దేవి ఇండస్ట్రీస్, ప్రోప్: తెల్ల లక్ష్మీ, భర్త: వీరరాఘవయ్య, డోర్ నెం. 37, రామచంద్రపురం, అగ్రహారం, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522003. **2. శ్రీమతి. తెల్ల లక్ష్మీ,** భర్త: వీరరాఘవయ్య, డోర్ నెం. 4-24-11/ఎ, 8వ లైను, ముత్యాలరెడ్డి నగర్, గుంటూరు-522007. **హామీదారు (లు) : హామీదారుల కంచేటి రమేష్ గారి చట్టపరమైన వారసులు : 1. కంచేటి సుకుమారి,** భర్త: రమేష్, ఫ్లాట్ నెం. 504, అంజని విల్లా, 2వ లైను, ఆంజనేయ నగర్, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006. **2. కంచేటి సూర్యతేజ,** తండ్రి : రమేష్, ఫ్లాట్ నెం. 504, అంజని విల్లా, 2వ లైను, ఆంజనేయ నగర్, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006. **3. కంచేటి రఘుదేవ్,** తండ్రి : రమేష్, ఫ్లాట్ నెం. 504, అంజని విల్లా, 2వ లైను, ఆంజనేయ నగర్, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006.

విషయం : మెస్సర్స్ శ్రీ దేవి ఇండస్ట్రీస్‌కు చెందిన ఆస్తి, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 01.08.2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 18.10.2023**న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఆర్‌బి బ్రాంచికి చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేది నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది.

కాబట్టి, ఆస్తుల లావాదేవీలు చేస్తున్న లేదా ఇతరాత్ర ఇట్టి ఆస్తులు కొనుగోలు పట్ల ఆసక్తి గల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా బ్యాంక్ ఆమోదయోగ్యమైన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ద్వారా ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 01.08.2023** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేది వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. (చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన స్థిరాస్తులు వివరాలు క్రింద వివరించబడ్డాయి:
ఆస్తి-1: కంచేటి రమేష్, తండ్రి : వీరరాఘవయ్య గారి పేరిట పల్నాడు జిల్లా, బెల్లంకొండ మండలం, గంగిరెడ్డిపాలెం గ్రామ పంచాయితీ, గుంటూరు నుండి పిడుగురాళ్ళ రోడ్డు, విజయ లక్ష్మీ డైరీ వెనుక, ఎదురు హీరో షోరూం రోడ్డు, ఫ్లాట్ నెం. 6, డి.నెం. 215/2 వద్ద మొత్తం 193.60 చ॥గ॥లు విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** వై. రామస్వామి గారి ఆస్తి; **పడమర :** 30' రోడ్డు; **దక్షిణం :** జి. శ్రీనివాసరావు గారి ఆస్తి; **ఉత్తరం :** ఎ. రమాదేవి గారి ఆస్తి.

తేది : 08-11-2024 — **అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

बैंक ऑफ महाराष्ट्र / Bank of Maharashtra ONE FAMILY ONE BANK
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీసు, విజయవాడ, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డోర్ నం.: 59ఎ-21-7/3, హై స్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007. టెలి : 0866-2431225

డిమాండ్ నోటీసు

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (సార్ఫసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద)

దిగువ రుణగ్రహీత యొక్క ఖాతాలు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర,** రాజమండ్రి శాఖతో ఎన్‌పిఏగా వర్గీకరించబడినవి, దిగువ పేర్కొన్న తేదీలలో సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును బ్యాంకు జారీచేసింది.
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖతోగల దిగువ రుణగ్రహీత ఖాతాలు, ఎన్‌పిఏగా వర్గీకరించబడినది. దిగువ పేర్కొన్న తేదీలలో సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద బ్యాంకు నోటీసు జారీచేసింది. సంబంధితులందరికీ ఈ బహిరంగ ప్రకటన ఒక సమాచార ప్రచురణగా భావించగలరు. దిగువ పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారులును సంబంధిత వ్యక్తుల ద్వారా నిర్వహించిన పత్రాలు/ రుణం/ ఇతర ఒప్పందాలు క్రింద చెల్లించు తేదీ వరకు, కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు సదరు తేదీన దిగువ పేర్కొన్న బకాయి మొత్తాలను డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజుల్లోగా **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ**కు చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీతల బాధ్యులు కొరకు హామీగా దిగువ చెప్పిన ఒప్పందాలు మరియు పత్రాలు, వారి పేర్లకు ఎదురుగా చూపిన సదరు ఆస్తులు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ** కు చార్జ్‌చేయబడినవి.

క్ర. సం.	బ్రాంచి పేరు / రుణగ్రహీత / హామీదారు పేరు & చిరునామా	01.10.2024 నాటికి బకాయి మొత్తాలు	
1.	**బ్రాంచి : గుంటూరు శాఖ., రుణగ్రహీత& హామీదారు పేరు & చిరునామా : 1. మెసర్స్ పూరె ఒంగోలు క్యాటెల్,** దీని యజమాని శ్రీ యార్లగడ్డ వెంకట బ్రహేంద్ర వర ప్రసాద్, చిరునామా : ఫ్లాట్ నం.201, సితార టవర్స్, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ-520008. (రుణగ్రహీత) **2. శ్రీమతి యార్లగడ్డ దివ్య** చిరునామా : ఫ్లాట్ నం.201, సితార టవర్స్, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ-520008. (హామీదారు / తాకట్టుదారు)	**రూ. 1,37,48,592/-** (రూపాయలు ఒక కోటి ముప్పై ఏడు లక్షల నలభై ఎనిమిది వేల ఐదు వందల తొంభై రెండు మాత్రమే) ప్లస్ 01.11.2024 నుండి వర్తించబడు రేటున వర్తించు లెక్కించని వడ్డీ/తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు & ఇతర చార్జీలు మొ॥నవి.	
	రుణం విధానం : క్యాష్ క్రెడిట్ రూ. 1,35,00,000/- (రూపాయలు ఒక కోటి ముప్పై ఐదు లక్షల మాత్రమే) ఖాతా నం. 60478194299	**డిమాండ్ నోటీసు : 01.11.2024**	**ఎన్‌పిఏ తేది : 31.10.2024**

ప్రైమరీ సెక్యూరిటీ : స్టాక్ & బుక్ డెట్స్ యొక్క హైపోతికేషన్. సెర్సాయి అసెట్ ఐడి : 200078730893.
కొల్లెటరల్ సెక్యూరిటీ : నివాస ఖాళీ ల్యాండ్ యొక్క ఈక్విటేబుల్ తాకట్టు. (సెర్సాయి ఐడి : 200078735441)
ఆస్తి యొక్క షెడ్యూలు : రిజిస్ట్రేషన్ జిల్లా, ఏలూరు, సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు నూజివీడ్, సబ్-కలెక్టర్, నూజివీడు, నూజివీడ్ గ్రామం వద్దగల ప్రొసీడింగ్స్ డి.డిస్టెంట్ నం.ఎ.245/2022, తేది : 24.12.2022, ల్యాండ్ కన్వెర్టెడ్ విస్తీర్ణం 1269.33 చ.గ.లు ఖాళీ సైటు మరియు సర్వే నం.లు897/3, డోర్ నం.5-27 సమీపానగల ల్యాండ్ యొక్క మొత్తం భాగం. సరిహద్దులు : ఉత్తరం వైపు : బైపాస్ రోడ్, దక్షిణం : ప్రస్తుత యజమానురాలు యార్లగడ్డ దివ్య ఆస్తి, తూర్పు వైపు : ప్రస్తుత యజమానురాలు యార్లగడ్డ దివ్య ఆస్తి, పడమర : పి. ప్రమీళ ఆస్తి.

సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు పై చెప్పినట్లుగా **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ**కు చెల్లింపులుచేయుటలో విఫలం చెందినట్లైతే, **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ** వారు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు వర్తించదు రూల్స్ పై సెక్యూర్డ్ అసెట్స్ పై చర్యలుతీసుకొనుట ప్రారంభించింది, సంబంధిత రు ఇణగ్రహీతలు / హామీదారులు పూర్తి బాధ్యత పైననే సార్ఫసీ యాక్ట్ యొక్క నియమాలలో, సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ** వారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలలో బదిలీచేయలేరు. ఏవేని ఉలంఘనలు జరిగిన షార్ఫసీ యాక్ట్‌తో అనుసరించి, సంబంధిత వ్యక్తులకు శిక్ష లేదా జరిమానా మరియు రెండూను విధించబడు ఆస్కారం ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించు కొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలకు రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. బట్వాడా కాకుండా వెనుదిరిగిన నోటీసులను క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును. ఈ నోటీసు ప్రచురించబడుచున్నది.

తేది : 14.11.2024
ప్రదేశం : గుంటూరు
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోన్.

Piramal Capital & Housing Finance
పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సిఐఎన్ : L65910MH1984PLC032639
రిజిస్టర్డ్ ఆఫీసు : యూనిట్ నెం.601, 6వ అంతస్తు, పిరామల్ అమితి బిల్డింగ్, పిరామల్ అగస్త్యా కార్పొరేట్ పార్క్, కమాని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురుగా, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400 070. టెలి : +91 22 3802 4000.
బ్రాంచ్ ఆఫీసు : డోర్ నెం.7-1-615, 616 & 617/ఎ, ఇంపెరియల్ టవర్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500 016, తెలంగాణ.
సంప్రదించు వ్యక్తి : 1) దుర్గ విజయ ప్రసాద్ వానచర్ల-9493330003, 2) రమణ రావు-9849271633, 3) రోహన్ సావంత్ -9833143013

ఇ- వేలం అమ్మకపు ప్రకటన- తాజా అమ్మకం

రుణగ్రహీత/ల నుండి బకాయి మొత్తాల రికవరీ కొరకు **సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002** క్రింద పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే దిగువ పేర్కొన్న సెక్యూర్డు అసెట్ యొక్క స్వాధీనం చేసుకునేందుకు అనుగుణంగా భౌతిక స్వాధీనంలోని దిగువ వివరించినట్లుగా స్థిరాస్తి యొక్క కొనుగోలు కొరకు **"ఎక్కడ ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ప్రతిపాదికన"** క్రింది సంతకందారుడు ఆఫర్లను ఆహ్వానిస్తున్నారు, వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

లోన్ కోడ్ / బ్రాంచ్ / రుణగ్రహీత(ల) సహ-రుణగ్రహీత(ల) / హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి వివరణ- ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు (ఈఎండి) (అర్‌పిలో 10%)	బాకీపడిన మొత్తం (12-11-2024)
లోన్ కోడ్ నెం: **02400 006984,** విజయవాడ (బ్రాంచ్), మోహన్ చింతాడ (రుణగ్రహీత), అంజనా చింతాడ (సహ-రుణగ్రహీత 1)	**తేది. 04-11-2024, రూ. 8,51,452/-** (రూపాయలు ఎనిమిది లక్షల యాభైఒక వేల నాలుగు వందల యాభై రెండు మాత్రమే)	ఫ్లాట్ నెం.14, ఎల్.పి.నెం.1168/5364/ఎల్‌పి/పూర్లుపాడు/ నర్సింహపురం/2018 క్యాపిటల్ సిటీ, నరసింహ రావుపాలెం, ఎంబిసి కాలేజీ దగ్గర, కంచికచెర్ల, నరసింహర్ కృష్ణ (పాత) ఆంధ్రప్రదేశ్- 521181 లోని ఆస్తికలిగియున్న మొత్తం భాగం. **సరిహద్దులు: ఉత్తరం:** 40 వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం.13, **తూర్పు:** 40' వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం.5.	రూ. **12,62,000/-** (రూపాయలు పన్నెండు లక్షల అరవైరెండు వేలు మాత్రమే)	రూ. **1,26,200/-** (రూపాయలు ఒకలక్షా ఇరవైవేల రెండు వందలు మాత్రమే)	రూ. **10,91,646/-** (రూపాయలు పది లక్షల తొంభైఒకవేల ఆరువందల నలభై ఆరు మాత్రమే)

ఇ-వేలం తేది : 24-12-2024, ఉ॥ 11.00 గం.ల నుండి మ. 1.00 గం.ల వరకు (ప్రతి 5 నిమిషాల చొప్పన అపరిమిత పొడిగింపుతో), బిడ్ దాఖలు చేయుటకు చివరి తేది : 23-12-2024, సా. 4.00 గం.లకు ముందు.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, www.piramalfinance.com/e-Auction.html లో కల్పించిన లింక్‌ను చూడండి లేదా piramal.auction@piramal.com ద్వారా మాకు ఇమెయిల్ చేయండి.

రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారులకు SARFAESI చట్టం క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటన

వేలం తేదీకి ముందు తేదీ వరకు వర్తించు వడ్డీతోసహా పూర్తిగా సెక్షన్13(2) నోటీసులో పేర్కొన్నట్లుగా పూర్తి బకాయిని చెల్లించవలసిందిగా పై పేర్కొన్న రుణగ్రహీత/హామీదారును కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, ఆస్తి వేలంచేయబడుతుంది మరియు మిగతా బకాయిల కొరకు రుణగ్రహీత / హామీదారు నుండి వడ్డీ & ఖర్చులు ఏవేని ఉన్నట్లైతే వారి నుండే వసూలు చేయబడుతుంది.

సం/- (అధీకృత అధికారి), పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
తేది : 15-11-2024, ప్రదేశం : క్రిష్ణా, ఆం.ప్ర.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank
శాఖా కార్యాలయం : **ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560 068.**

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి **ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్** చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం.	రుణగ్రహీత పేరు / లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ / లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	నెమలికంటి రమేష్ / నెమలికంటి శ్రీలక్ష్మి / LBVJW00004982908 / LBVJW00004985701	కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ ఇలాక, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ పాయకాపురం లో ఉన్న నిర్మించబడని ఆర్.సి.సి. భవనం కలిగి ఉన్న గ్రౌండ్+ఒకటవ అంతస్తు స్థలం కొలిచే పరిధి 100 చ.గ.లు. లేదా ఆర్ఎస్.నం.74/2బి, ఫ్లాట్ నం.45 సైట్. ఉన్న **హద్దులు : తూర్పు :** రోడ్డు-25.0 అ.లు., **దక్షిణం:** ప్లాట్ నం.46- 36.0 అ.లు., **పడమర :** చెరుకూరి వెంకట నాగేశ్వరరావు ఆస్తి-25.0 అ.లు., **ఉత్తరం :** పనెం అరుణ్ ప్లాట్ నం.44- 36.0 అ.లు. ఈ నాలుగు సరిహద్దుల ప్రదేశం పరిధి 100-0 చ.గ.లు. లేదా 83.613 చ.మీ.లు. మరియు ఈ ప్రదేశం ఆర్‌సిసి 810-0 చ.అ.లు. నిర్మాణంలో ఉన్న ప్లింత్ ఏరియా గ్రౌండ్ మరియు 810-0 చ.అ.లు. ఆర్‌సిసి నిర్మాణం ప్లింత్ ఏరియా/ **లాంఛనప్రాయ స్వాధీనత 12.11.2024**	27/06/2024 Rs. 31,14,140.00/-	విజయ వాడ
2.	కాట్రగడ్డ నారాయణ స్వామి / పతివాడ రాజేశ్వరి / LBVJW00005545690	**షెడ్యూల్-ఎ :** కృష్ణాజిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రార్, విజయవాడ మండలం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, పాయకాపురం వద్ద ఉన్న పాయకాపురం యొక్క బేరింగ్ ప్లాట్ నం.19, ఆర్.ఎస్.నం.18/1, 19/2బి, 19/2సి లో ఉన్న రెసిడెన్షియల్ సైట్ అవిభక్త మరియు పేర్కొనబడిన వాటా ఉమ్మడి హక్కు పరిధి 36.66 చ.గ.లు. లేదా 30.65 చ.మీ.లు. మొత్తం విస్తీర్ణం 234.66 చ.గ.లు. లేదా 196.21 చ.మీ.లు. తో కలిపి ఆర్‌సిసి రూఫ్డ్ స్టిల్ట్, గ్రౌండ్, 1వ, 2వ మరియు 3వ అంతస్తుల రెసిడెన్షియల్ భవనం తో అన్నీ సౌలభ్య హక్కులు. ఉన్న **హద్దులు : తూర్పు :** బేరింగ్ ప్లాట్ నం.24 ఆస్తి 33.0 అ.లు., **దక్షిణం :** బేరింగ్ ప్లాట్ నం.20 ఆస్తి 64.0 అ.లు., **పడమర :** 33 అ.లు. వెడల్పు రోడ్డు 33.0 అ.లు., **ఉత్తరం :** బేరింగ్ ప్లాట్ నం.18 ఆస్తి 64.0 అ.లు. 'ఎ షెడ్యూల్ ఆస్తిలో నిర్మించబడిన "శ్రీ సాయి కపర్ది ఆర్కెడ్" పేరు క్రింద ఉన్న గ్రూప్ ఇంటి భవనంలోని 3వ అంతస్తులో "బి" షెడ్యూల్ ఫ్లాట్ నం.'టిఎఫ్-1 తో ప్లింత్ ఏరియా 824 చ.అ.లు. ప్లింత్ ఏరియా, 206 చ.అ.లు. బాల్కానీ ఏరియా తో పాటు కామన్ ఏరియా మరియు 100 చ.అ.లు. కార్ పార్కింగ్ ఏరియా తో అన్నీ సౌలభ్య హక్కులు మరియు అనుబంధ ఫిక్చర్లు. ఉన్న **హద్దులు : తూర్పు :** మెట్లకేస్ మరియు ఓపెన్ ఏరియా, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై/ **లాంఛనప్రాయ స్వాధీనత 12.11.2024**	30/04/2024 Rs. 25,58,160.00/-	విజయ వాడ

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 మరియు 9 క్రింద నిబంధనల ప్రకారం ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరిన తర్వాత తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 15 నవంబరు, 2024
ప్రదేశం : విజయవాడ
అధీకృత సెక్రెటరీ, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, తరపున

OFFICE OF THE RECOVERY OFFICER -I
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES,MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21,Sai Baba Street,Narayana Bhavanam, Dabagardens,Visakhapatnam-530020

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/821/2017 **21.10.2024**

Union Bank of India (e-Andhra Bank), Gudivada Branch, Krishna District.
Versus
Sri. Sakhamuri Naveen Chandra & another

To,
(CD-I) Sri. Sakhamuri Naveen Chandra, S/o Sri. Madhava Rao, Flat No. 302, Sri Ramgopal Residency, Prakasam Road, Vijayawada, Krishna District.
(CD-2) Sri. Nimmagadda venu Gopal, S/o Sri. Dakshina Murthy, Flat No. 302, sri Ramgopal Residency, Prakasam Road, Vijayawada, Krishna District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in OA/727/2016 an amount of **Rs. 78,89,719l- (Rupees seventy eight lakhs eighty nine thousand seven hundred and nineteen only)** along with pendentellite and future interest @11.50% p.a compounded with quarterly rests from the date ofapplication i.e. 28.06.2016 till realization / date ofpayment and the costs become due against you (Jointly and severally/ Fully/Limited)'
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **26.12.2024** at 10.30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay:
   (a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
   (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:
   16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
   16(2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 21st October 2024)

(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK)
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
బ్రాంచి చిరునామా: 7-2-41/బి, గ్రౌండ్ ఫ్లోర్, భవనం వారి వీధి, గంగానమ్మపేట, తెనాలి-522201. ఫోన్: 08644-225838, 9731451228.
Email: tenali@canfinhomes.com. CIN: L85110KA1987PLC008699

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (SARFAESI యాక్ట్) సెక్షన్ 13(2) కింద సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (అమలు) రూల్స్, 2002(రూల్స్)లోని రూల్ 3(1)

ఇందుమూలంగా కింద సంతకం చేసిన వ్యక్తి కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, **SARFAESI** చట్టం ప్రకారం మరియు సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేస్తూ, రూల్ 3తో చదవబడినందున, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసును జారీ చేసింది. ఇక్కడ జాబితా చేయబడిన రుణగ్రహీతలు / హామీదారులు (ఇకపై "చెప్పబడిన రుణగ్రహీతలు"గా సూచిస్తారు), కు క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం, నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించండి
పైన పేర్కొన్న నోటీసులు తపాలా అధికారులచే బట్వాడా చేయబడలేదు / రుణగ్రహీతలచే సక్రమంగా గుర్తించబడలేదు. అందువల్ల కంపెనీ చాలా జాగ్రత్తగా డిమాండ్ నోటీసు యొక్క ఈ ప్రచురణను ప్రభావితం చేస్తోంది (రూల్ 3 (1)లోని నిబంధనల ప్రకారం). కింద సంతకం చేసినవారు, పేర్కొన్న చట్టం ప్రకారం, పేర్కొన్న రుణగ్రహీతల చివరిగా తెలిసిన చిరునామాల ప్రాంగణంలో ఈ నోటీసులను అతికించారు. రుణం యొక్క బకాయి తిరిగి చెల్లింపు కోసం సెక్యూరిటీగా, దిగువ వివరించిన విధంగా సంబంధిత పార్టీల ద్వారా కింది ఆస్తులు కంపెనీకి తనఖా పెట్టబడ్డాయి.

క్ర.స	ఋణగ్రహీత & గ్యారంటర్‌ల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరములు	NPA తేదీ	నోటీసు తేదీ ప్రకారం చెల్లించాల్సిన మొత్తం
1)	1) శ్రీ చిలువూరి జగదీశ్ బాబు (ఋణగ్రహీత), 2) శ్రీమతి చిలువూరి శాంత కుమారి (గ్యారంటర్), డోర్ నెం.10-1-21/5, పుడా కాలని, అమరావతి ప్లాట్స్, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522202.	గుంటూరు జిల్లా, తెనాలి, తెనాలి మున్సిపాలిటి,డోర్ నెం.14-58-39, 1వ వార్డు, 17వ బ్లాకు, టి.యస్. నెం. 598/1లో 145 చ॥గ॥ల ఖాళీ స్థలం. దీని సరిహద్దులు :**తూర్పు**: తోక నాగేశ్వరరావు గారి సైట్, **దక్షిణం**: పినపాటి రాజు గారి సైట్ పడమర: చందోలి రత్తయ్య గారి సైట్ **ఉత్తరం**: 18 అడుగుల జాయింట్ బజార్.	29-10-2024	**Rs.10,88,459/-** (అక్షరాల పది లక్షల యనభై ఎనిమిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే) **06-11-2024** నాటికి
2)	1) శ్రీ యడల గాంధీ(ఋణగ్రహీత), 2)శ్రీమతి యడల అన్నపూర్ణ (సహ-ఋణగ్రహీత), టి.యస్.619, డోర్ నెం.14-59-11/ఎ, మున్సిపల్ వార్డు, 17వ బ్లాక్, మెురిన్‌పేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201. 3)శ్రీ యడల కిరణ్ కుమార్ (సహ-ఋణగ్రహీత) డోర్ నెం.8-196, గౌడుపాలెం, వడ్లముడి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522213.	గుంటూరు జిల్లా, తెనాలి, తెనాలి మున్సిపాలిటి,డోర్ నెం.14-59-11/ఎ, 1వ వార్డు, 17వ బ్లాకు, టి.యస్. నెం. 604/1 & 617లో 139 చ॥గ॥ల ఆర్.సి.సి రెసిడెన్షియల్ భవనం మరియు స్థలం. దీని సరిహద్దులు :**తూర్పు**: 9 అడుగుల వెడల్పు జాయింట్ బజార్, **దక్షిణం**:గుర్రం లక్ష్మీ కుమారి గారి ఆస్తి పడమర: రవి స్వర్ణ కుమారి గారి ఆస్తి **ఉత్తరం**: 21-0 వెడల్పు జాయింట్ బజార్.	29-10-2024	**Rs.10,05,715/-** (అక్షరాల పది లక్షల ఐదు వేల ఏడు వందల పదిహేను రూపాయలు మాత్రమే) **06-11-2024** నాటికి

పైన పేర్కొన్న తేదీ నుండి చెల్లింపు తేదీ వరకు అంగీకరించిన విధంగా ఒప్పంద రేట్లలో తదుపరి వడ్డీతో చెల్లించబడుతుంది.
ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు కాంట్రాక్ట్ వడ్డీ రేటుతో పైన పేర్కొన్న మొత్తాన్ని చెల్లించమని మీరు ఇక్కడకు పిలుపునిచ్చారు, లేని పక్షంలో పైన పేర్కొన్న భద్రతను అమలు చేయడానికి SARFAESIచట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి కింద సంతకం చేయబడిన వారు నిర్బంధించబడతారు. ఇంకా, అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 (8)లోని నిబంధనలపై రుణగ్రహీతలు / హామీదారుల దృష్టిని ఆహ్వానించారు.
వారు సురక్షితమైన ఆస్తులను రీడీమ్ చేయడానికి

తేది : 14-11-2024
స్థలము : తెనాలి
సం/- అధీకృత అధికారి, కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్.

KARVY FINANCE

ప్రైవేట్ ట్రీటీ క్రింద టెండర్-కమ్-వేలం అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన

కార్పొరేట్ ఆఫీసు: మెసర్స్ కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, 301, 3వ అంతస్తు, గుజ్రాల్స్ హౌస్, 167 సిఎస్‌టి రోడ్డు, కొలివెరీ ఏరియా గ్రామం, కలినా, శాంతాక్రూజ్ (తూ), ముంబయి-400098. ఇమెయిల్: reddy.laxma@karvy.com, **సంప్రదించాల్సిన నెం:** 9010191999

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద రూల్స్ 8(6) మరియు 9(1) నిబంధనలతో చదువుతూ (సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 క్రింద ప్రైవేట్ ట్రీటీ ద్వారా స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ నోటీసు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ పేర్కొన్న రుణగ్రహీత(లు)/ తనాఖదారులు యొక్క సెక్యూర్డ్ అస్సెట్స్ యొక్క స్వాధీనత కోరుతూ, పబ్లిక్ మరియు సంబంధిత మొత్తం రుణగ్రహీతలు/తనాఖదారులు, వారి చట్టబద్ధ వారసులు/అధీకృత ప్రతినిధులు, దిగువ ఆస్తుల జాబితా కొనుగోలు కొరకు కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ఆఫర్‌లను ఆహ్వానించమైనది.
ఏదైతే కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి బహిరంగ వేలం ద్వారా సదరు చట్టం యొక్క రూల్స్ 8& 9 క్రింద "ఏది ఎక్కడ ఉందో ఆ పద్ధతి ప్రకారం" మరియు "ఏది ఏమైనా ఆ పద్ధతి ప్రకారం" మీద దిగువ వివరించిన ఆస్తిని విక్రయించుటకు నిర్ణయించినారు.

రుణగ్రహీత పేరు	వేలం తేది	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్థిరాస్తి వివరణ	రిజర్వు ధర (ఆర్‌పి)	బయానా మొత్తం (ఈఎండి) (10%ఆర్‌పి)	బాకీపడిన మొత్తం రుణం
రుణ ఖాతా నెంబరు: 543033 & 544378 1. దేసు నవీన్, 2. మీనా కుమారి దేసు, 3. డి.జయ కుమార్	**30 నవంబర్ 2024**	**2 మార్చి 2021 మరియు రూ. 23,09,310/-**	ఆర్.సర్వే నెం.570/బి, డోర్ నెం.7-192, ఫ్లాట్ నెం.జి.ఎఫ్.-2, గ్రౌండ్ ఫ్లోర్, శివా రెసిడెన్సీ, గొల్లపుడి, విజయవాడ టౌన్, కృష్ణాజిల్లా. **ఐటం 1** : మొత్తం విస్తీర్ణం 286 చ.గ.లలో యుడిఎస్ 29 చ.గ.లు మరియు దిగువ సరిహద్దులు: **ఉత్తరం :** వడ్లముడి వెంకట కృష్ణారావు మరియు కుమారుల ఆస్తి, **దక్షిణం:** వి.టి.వి.ఎస్. కెనాల్, **తూర్పు:** పంచాయతీ రోడ్డు, **పడమర** : పోగుల రామారావు ఆస్తి. **ఐటం 2**: ఫ్లాట్ ఏరియా 840చ.అ.లు, ప్లింత్-760 చ.అ.లు.+ 60 చ.అ.లు. ఉమ్మడి + 20 చ.అ.ల పార్కింగ్ మరియు దిగువ సరిహద్దులు: **ఉత్తరం:** ఓపెన్ టు స్కై, **దక్షిణం**: ఓపెన్ టు స్కై, **తూర్పు:** ఫ్లాట్ నెం.జి.ఎఫ్.1 ఆస్తి మరియు ఉమ్మడి కారిడార్, **పడమర** : ఓపెన్ టు స్కై.	రూ. 12,75,750/- (రూపాయలు పన్నెండు లక్షల డెబ్బైఐదువేల ఏడువందల యాభై మాత్రమే)	రూ. 1,27,575/- (రూపాయలు ఒకలక్షా ఇరవైఏడువేల ఐదువందల డెబ్బై ఐదు మాత్రమే)	రూ. 68,37,887/- (రూపాయలు అరవై ఎనిమిది లక్షల ముప్పై ఏడు వేల ఎనిమిది వందల ఎనభై ఏడు మాత్రమే)

ముఖ్యమైన నియమ & నిబంధనలు

1) ఉద్దేశించిన బిడ్డర్ వేలం కొరకు వ్యక్తిగతంగా హాజరు కావాలి మరియు అతను/ఆమె తనకోసం/ఆమె కోసం వేలం వేస్తున్నట్లు వ్రాతపూర్వకంగా ఒక ప్రకటన ఇవ్వాలి.
2) ఉద్దేశించిన బిడ్డర్లు **డి.నెం.26-19/1-3, కునుకు గంగయ్య వీధి, వివిఎంసి స్విమ్మింగ్ పూల్ గేట్ ఎదురు, గాంధీనగర్, విజయవాడ-520003** వద్ద టెండర్ ఫారాలను పొందవచ్చు.
3) ఉద్దేశించిన బిడ్డర్లు తమ బిడ్లను టెండర్ రూపంలో మాత్రమే సీల్డ్ ఎన్‌వలప్‌లో అధీకృత అధికారి, మెస్సర్స్ కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, **29 నవంబర్, 2024న సా.6.00గం.లు లేదా అంతకు ముందు** "కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్" పేరిట రిజర్వ్ ధరలో 10% బయనా కోసం పే ఆర్డర్/డిమాండ్ డ్రాఫ్ట్‌తో కలిసి, "కార్వీ ఫైనాన్సియల్ సర్వీస్ లిమిటెడ్" వారిపేరున తీయాలి. టెండర్-కమ్-వేలం నోటీసు ఇక్కడ సూచిస్తుంది. డిమాండ్ డ్రాఫ్ట్ విజయవంతం కాని బిడ్డర్లకు తిరిగి ఇవ్వబడుతుంది.
4) పత్ర ధృవీకరణల కొరకు ఆసక్తిగల కొనుగోలుదారు డి.నెం.26-19/1-3, కునుకు గంగయ్య వీధి, వివిఎంసి స్విమ్మింగ్ పూల్ గేట్ ఎదురు, గాంధీనగర్, విజయవాడ-520003 లో సందర్శించవచ్చు.
5) ఆస్తి/లు "ఏది ఎక్కడ ఉందో ఆవిధంగా" 'మరియు" "ఏది ఏమైనా ఆ ప్రాతిపదికన" అమ్మబడుతుంది.
6) టెండర్-కమ్-వేలం అమ్మకం మ.3 గం.లోపు ఉద్దేశించిన బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. సాధారణంగా మూసివేసిన టెండర్ల ద్వారా ఇది ఉంటుంది, అయితే, అధీకృత అధికారి తన స్వంత అభీష్టానుసారం, దగ్గరి ప్రక్రియలో అందుకున్న దానికంటే ఎక్కువ బిడ్‌ను కోట్ చేయాలనుకునే ఆసక్తిగల బిడ్డర్లలో బహిరంగ వేలం నిర్వహించవచ్చు. ఈవెంట్, అత్యధిక బిడ్ చేసిన వ్యక్తికి అమ్మకం ఇవ్వబడుతుంది. అయితే, అమ్మకం మెస్సర్స్ కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది.
7) విజయవంతమైన బిడ్డర్ అమ్మకపు మొత్తంలో ఇరవై ఐదు శాతం (25%) (చెల్లించిన ఈఎండితోసహా) అదే రోజున వెంటనే చెల్లించాలి/జమ చేయాలి లేదా అమ్మకం పూర్తయిన తర్వాత వచ్చే పనిదినం మరియు డెబ్బై ఐదు మొత్తం అమ్మకం ధృవీకరించబడిన తేదీ నుండి 15 రోజుల్లోపు (75%), విఫలమైతే 25% ప్రారంభ డిపాజిట్ జప్తు చేయబడుతుంది. ఎట్టి పరిస్థితుల్లో అది తిరిగి చెల్లించబడదు. తాజా అమ్మకం ప్రకటన జారీ చేసిన తరువాత, ఆ ఆస్తిని వెంటనే తిరిగి అమ్మాలి.
8) ఇక్కడ నిర్దేశించిన కాలపరిమితిలో మొత్తం అమ్మకపు పరిశీలన అందిన తరువాత మాత్రమే అమ్మకపు ధృవీకరణ పత్రం విజయవంతమైన కొనుగోలుదారుకు అనుకూలంగా అధీకృత అధికారి ద్వారా జారీ చేయబడుతుంది.
9) విజయవంతమైన కొనుగోలుదారుడు చట్టం ప్రకారం వర్తించే విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మొదలైన రవాణాకు చెల్లించాల్సిన ఛార్జీల రుసుమును భరించాలి.
10) విజయవంతమైన బిడ్డర్ ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థ మరియు స్థానిక సంస్థల కారణంగా చట్టబద్ధమైన బకాయిలు (చట్టబద్ధమైన ఇంటి పన్ను, విద్యుత్ ఛార్జీలు మరియు ఇతర బకాయిలు), టిడిఎస్, జిఎస్టి ఏదైనా చెల్లించాలి.
11) టెండర్ లేదా బిడ్ ఏదైనా లేదా అన్ని ఆఫర్లను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి అధికారం గల అధికారికి ఎటువంటి హక్కును కేటాయించకుండా వేలం మార్పు/ వాయిదా వేయడం/ రద్దు చేయడం మరియు అమ్మకం యొక్క ఏదైనా నిబంధనలు మరియు షరతులను సవరించడానికి దాని యొక్క ఎటువంటి కారణాన్ని తెలపకుండా కేటాయించడానికి మరియు సవరించడానికి, ముందస్తు నోటీసు లేకుండా అమ్మకం యొక్క ఏదైనా నిబంధనలు మరియు షరతులను సవరించడానికి కూడా హక్కు ఉంది.

సం/-
ప్రదేశం: విజయవాడ — **అధీకృత అధికారి**
తేది: 14-11-2024 — **కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్**

ఢిల్లీ మేయర్ పీఠంపై దళిత నేత మహేష్ ఖిచి


- బిజెపిపై 3 ఓట్ల తేడాతో విజయం



న్యూఢిల్లీ : ఢిల్లీ మేయర్‌గా ఆప్‌కు చెందిన కౌన్సిలర్, దళిత నేత మహేష్ ఖిచి గురువారం ఎన్నికయ్యారు. వచ్చే ఏడాదిలో ఢిల్లీ అసెంబ్లీలు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార పార్టీ ఆప్‌కు ఇది భారీ ఉత్తేజమిచ్చే విజయంగా భావిస్తున్నారు. గురువారం జరిగిన మేయర్ ఎన్నికల్లో బిజెపికి చెందిన కిషన్ లాల్‌పై మహేష్ ఖిచి మూడు ఓట్లతో విజయం సాధించారు. లాల్‌కు 130 ఓట్లు రాగా, ఖుచికి 133 ఓట్లు లభించాయి. రెండు ఓట్లను చెల్లనవిగా ప్రకటించారు. అలాగే కాంగ్రెస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు ఈ మేయర్ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. కాగా, ఈ మేయర్ ఎన్నిక ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగాల్సి ఉంది. అయితే ఆప్, బిజెపి నాయకుల మధ్య మాటల యుద్ధం, ఎన్నికలను కాంగ్రెస్ బాయ్‌కాట్ చేయడం వంటి కారణాలతో ఆలస్యమయింది.

అమరావతిలో తాగునీటికోసం
రూ.14.17 కోట్లతో టెండర్లు

- 45 కిలోమీటర్ల మెయిన్ లైను
- 24 ట్యాప్ పాయింట్లు



ప్రతిపాదించిన నీటి సరఫరా, అగ్నిమాపక విధానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో తాగునీటి సరఫరా కోసం రూ.14.17 కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం మూడు టెండర్లు పిలిచింది. శనివారం నుండి టెండర్లు దాఖలుచేసుకునే అవకాశం కల్పించారు. 30వ తేదీతో ఈప్రక్రియ ముగించనున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలోని తుళ్లూరు మండల గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అనంతవరం, నెక్కల్లు, శాఖమూరు, ఐనవోలు వంటి గ్రామాల్లో నీటి సమస్య మరీ తీవ్రంగా ఉంది. తాజా టెండర్ల ప్రతిపాదన ప్రకారం హరిశ్చంద్రాపురం వద్ద కృష్ణానదిలో చిన్నబావి నిర్మించి అక్కడ నుండి ఇన్‌టేక్ వెల్ ద్వారా ప్లాంటులోకి తీసుకుని శుభ్రం చేసి, గ్రామాలకు సరఫరా చేసే విధంగా ప్లాను రూపొందించారు. దీనిలో బోరుపాలెం, దొండపాడు, పిచ్చుకలపాలెం, అనంతవరం, ఐనవోలు, రాయపూడి, కొండమరాజుపాలెం గ్రామాల్లో నీటిసరఫరాకు రూ.5.02 కోట్లను కేటాయించారు. మందడం, వెలగపూడి, మల్కాపురం, నేలపాడు, నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు గ్రామాలకు నీటి సరఫరా అవసరమైన పైపులైన్ల ఏర్పాటు సదుపాయాలకు రూ.5.73 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి, దానికి అనుగుణంగా టెండరు పిలిచారు. పెనుమాక, కృష్ణాయపాలెం, బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నవులూరు, ఎర్రబాలెం, నీరుకొండ గ్రామాల నీటి సరఫరాకు రూ.3.41 కోట్లు అంచనాతో పైపులైన్లు వేయాలని నిర్ణయించారు. ఈ పనులు సజావుగా పూర్తయితే రాజధాని పరిధిలో అత్యంత కీలకమైన తాగునీటి సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. దీనికోసం 45 కిలోమీటర్ల మెయిన్‌లైను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే, 24 చోట్ల ట్యాపింగ్ పాయింట్లు పెట్లేలా నీటి సరఫరా ప్రణాళిక రూపొందించారు. దీనికోసం 56 కిలోమీటర్లమేర డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కు(పైపులైన్లు) వేయాల్సి ఉంటుందని నిర్ణయించారు.

గతంలో ఇలా...

గతంలో రూపొందించిన ప్లానులో వైకుంఠపురం రిజర్వాయర్‌లో ఒక ఇన్‌టేక్‌వెల్, పెనుమాక రెవెన్యూ పరిధిలో కరకట్ట దిగువన మరొక ఇన్‌టేక్ వెల్ నిర్మించాలని ప్రతిపాదించారు. వాటి నుండి ట్యాపింగ్ పాయింట్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రతిపాదించారు. 2030 నాటికి ప్రకాశం బ్యారేజీ నుండి 303 ఎంఎల్‌డి (4.94 టిఎంసి), వైకుంఠపురం రిజర్వాయర్ నుండి 503 ఎంఎల్‌డి (6.48 టిఎంసి)ల నీరు అందుబాటులో ఉంటుందని అంచనా వేసి దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించారు. అమరావతికి 2040 నాటికి 8.69 టిఎంసిలు, 2045 నాటికి 10.53 టిఎంసిలు, 2050 నాటికి 11.42 టిఎంసిల నీరు అవసరం ఉంటుందని గతంలో లెక్కగట్టారు.

న్యాయవాదులకు ప్రమాద బీమా పాలసీలు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర బార్ కౌన్సిల్ 2024-25 ఏడాదికి న్యాయవాదులకు గ్రూప్ మెడి క్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలను ప్రవేశపెట్టింది. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ద్వారా వాటిని తీసుకొచ్చింది. న్యాయవాది అతని భార్య, ఇద్దరు పిల్లలకు రూ.2 లక్షల వైద్య బీమా, వ్యక్తిగత ప్రమాద పాలసీ (కేవలం న్యాయవాదికే) రూ.10 లక్షల మేర బీమా చెల్లింపులకు వీలుగా పాలసీలను ప్రవేశపెట్టింది. ప్రీమియంను ఈ నెల 15 నుంచి డిసెంబర్ 13 వరకు బార్ కౌన్సిల్‌కు న్యాయవాదులు చెల్లించాలంది. వచ్చే డిసెంబర్ 16 నుంచి, 2025 డిసెంబర్ 15 వరకు పాలసీ అమల్లో ఉంటుందని స్టేట్ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకనాథరెడ్డి గురువారం తెలియజేశారు.


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మండలి బుద్ధప్రసాద్

విజయవాడలో పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ (విజయవాడ)

జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను గురువారం అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. విజయవాడ సివిల్ కోర్టులు ఎదురుగా ఉన్న సొసైటీ భవనంలోని వేమూరి అనిల్ కుమార్ స్వాతి వేదికపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్ర తనను సాహిత్యంపై ఆసక్తి కలిగించిందని తెలిపారు. నెహ్రూ స్ఫూర్తితో తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. భారతదేశంలో ఇప్పుడున్న సంక్షోభం నుంచి బయటపడటానికి నెహ్రూ ఆలోచనలు, అభిప్రాయాలు దోహదపడతాయన్నారు. తమిళనాడు ప్రాంతాన్ని తెలుగు వారు పరిపాలించారని, ఎప్పుడూ బానిసలుగా జీవించలేదని పేర్కొన్నారు. తెలుగువారి గొప్పదనాన్ని తెలియజెప్పే విషయాలలో రచయితలు ఈ అంశాన్ని విస్మరించటం శోచనీయమన్నారు. ఈ సభకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు ఎస్.వెంకటనారాయణ అధ్యక్షత వహించారు. అతిథులకు సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య స్వాగతం పలికారు. కోశాధికారి లక్ష్మి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త వాడ్రేవు వీరలక్ష్మిదేవి, సొసైటీ గౌరవాధ్యక్షుడు బెల్లం బాబ్జి, ఉపాధ్యక్షుడు జెపి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు గోళ్ల నారాయణరావు, ఎన్.శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు

- టిడిపి నేతలు పనబాక లక్ష్మి, రామరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు కోరారు. టిడిపి కార్యాలయంలో ఇరువురు కలిసి గురువారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల వినతులను స్వీకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. అన్నదాతలకు, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో దాదాపు రూ.43 వేలకోట్లకు పైగా బడ్జెట్ కేటాయించారని తెలిపారు.

చట్టం ఊరుకోదు : వర్ల

మహిళలను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చట్టం ఎందుకు ఊరుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. సోషల్ మీడియా పోస్టులకు అరెస్టు చేస్తారా? అంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్రా రవీంద్రరెడ్డి పెట్టిన పోస్టులు పెడితే 24 గంటల్లో జగన్‌ను కూడా అరెస్టు చేస్తారని అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, సజ్జల భార్గవ్‌తో జగన్ సోషల్ మీడియాలో అబద్ధపు కోటను నిర్మించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాగులో ఉన్న ప్రతి పైరు నమోదు

- వ్యవసాయశాఖ కమిషనరు ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాగులో ఉన్న ప్రతి పైరునూ ఇ-పంటలో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ కమిషనరు ఢిల్లీరావు తెలిపారు. మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయం నుంచి గురువారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంట నమోదులో రబీ సీజన్‌లో సవరించిన మార్గదర్శకాలను అనుసరించాలని అధికారులకు సూచించారు. 2025 మార్చి 15వ తేదీ నాటికి ఈ పంటలో సాగు రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఒక సీజన్ కాలం నుంచి సాగులో లేని బంజరు భూములు ప్రత్యేకంగా నమోదు చేయాలని, వ్యవసాయ భూముల నుంచి వ్యవసాయేతర భూములుగా మారిన వాటి వివరాలను కూడా నమోదు చేయాలని తెలిపారు. పంటల సాగు వివరాలను పూర్తి వాస్తవికతతో నమోదు చేయాలని, ఈ సమాచారాన్ని భారత ప్రభుత్వ పోర్టల్‌లో అనుసంధానించనున్నట్లు తెలిపారు. రైతు, పంట వివరాలతో తీస్తున్న ఫొటో స్పష్టంగా ఉండాలన్నారు. జియో ఫెన్సింగ్ విధానంలో గరిష్ట పరిధి 50 మీటర్ల లోపు పంట వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిజిటల్ సెల్ ఎస్ఇ బాలసుబ్రమణ్యం, డిడి జగ్గారావు, ఎడి బాల భాస్కర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

- బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు రాచమర్యాదల ఫలితం!

ప్రజాశక్తి- గుంటూరు

రిమాండ్ ఖైదీ, రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు స్టేషన్లో రాచమర్యాదలు చేసిన వ్యవహారంలో నలుగురి పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. హెడ్ కానిస్టేబుళ్లు సర్దార్, గౌస్, శ్రీనివాసరావు, కానిస్టేబుల్ పరమేశ్వరరావులను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న అనిల్‌కుమార్‌ను విచారణ నిమిత్తం గత నెల 26 నుంచి 29 వరకూ అరండల్‌పేట పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారించారు. అనంతరం లాకప్‌లో ఉంచకుండా స్టేషన్లో బల్ల మీద దిండుతో పడక ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన సిసి పుటేజీ గత శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లను, ఒక కానిస్టేబుల్‌ను ఎస్‌పి సస్పెండ్ చేశారు.

తల్లీకొడుకుల దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత కక్షల కారణంగా తల్లీకొడుకును నడిరోడ్డుపై దారుణంగా హత్య చేసిన ఘటన తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరోజా దేవి (50), ఆమె కుమారుడు అనిల్ (30) సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వీరభద్రనగర్ కాలనీలో నివాసముంటున్నారు. రెండేళ్ల కిందట అదే కాలనీకి చెందిన నాగరాజు ఏడాదిన్నర కొడుకు నీటి సంపులో పడి మృతిచెందాడు. అయితే, తన కొడుకును సరోజాదేవి, అనిల్ కలిసి చంపారని నాగరాజు కక్ష పెంచుకున్నాడు. గురువారం ఉదయం రోడ్డు మీద నడుచుకొని వెళుతున్న సరోజాదేవి, అనిల్‌ను నాగరాజు కారులో వచ్చి అడ్డగించాడు. ఇద్దరినీ చాకుతో పొడిచి హత్య చేశాడు. మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. పోలీసులు సిఐ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

ఆ రికార్డులు అందజేయండి

- కానిస్టేబుల్ పోస్టుల రాతపరీక్ష 'కీ'పై హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్ష 'కీ'కి చెందిన రికార్డులు అందజేయాలని పోలీస్ నియామక బోర్డుకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ తూటూ చంద్ర ధనశేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. కానిస్టేబుల్ ప్రాథమిక రాతపరీక్షలో ఏడు ప్రశ్నలకు కీలో ఇచ్చిన సమాధానాలు కావని, ఫలితంగా తాము దేహదారుఢ్య పరీక్షకు అనర్హులయ్యామంటూ పలువురు అభ్యర్థులు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్ దాఖలు చేశారు. జోక్యానికి సింగిల్ జడ్జి నిరాకరించారు. దీంతో అప్పీల్ దాఖలు చేశారు. న్యాయవాది ఉమేష్ చంద్ర వాదిస్తూ.. అకాడమీ పుస్తకాల్లో ఉన్న సమాచారానికి విరుద్ధంగా కీ లోని జవాబులు ఉన్నాయని చెప్పారు. బోర్డు తరపున న్యాయవాది రాజు ప్రతివాదన చేస్తూ, నిపుణుల కమిటీ నిర్ణయించిన మేరకు కీ విడుదలైందన్నారు.

కాలుష్య కోరల్లో విలవిల్లాడుతున్న ఢిల్లీ

- పలుచోట్ల ఎఐక్యూఏ 426గా నమోదు

ఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతోంది. గాలి నాణ్యత గురువారం ఉదయం 'తీవ్రమైన' కేటగిరీలో కొనసాగుతుందని కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ (సిపిసిబి) పేర్కొంది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఎఐక్యూ) గురువారం ఉదయం 9 గంటలకు 426గా నమోదైనట్లు తెలిపింది. దీనిని 'తీవ్రమైన' కేటగిరీగా పరిగణిస్తారని, శుక్రవారం పరిస్థితి కాస్త మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ గాలి నాణ్యత పరిశీలన సంస్థ 'ఐక్యూఎయిర్' వద్ద నమోదైన 120 నగరాల గణాంకాల ప్రకారం..గురువారం ఉదయం ప్రపంచంలోనే రెండవ "అత్యంత కాలుష్య" ప్రధాన నగరంగా ఢిల్లీ నిలిచింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఢిల్లీకి వెళ్లే విమానాలపై ప్రభావం చూపవచ్చు అని ఇండిగో తన వినియోగదారులకు సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసింది.

ప్రపంచవ్యాప్తంగా షుగర్ కేసుల్లో నాలుగో వంతు భారత్‌లోనే

- లాన్సెట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా 2022 నాటికి 82.8 కోట్లమందికి పైగా డయాబెటిస్ బారినపడినట్లు అంచనా. భారతదేశంలో నాలుగోవంతు జనాభా ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. 'నవంబర్ 14న ప్రపంచ డయాబెటిస్ డే' సందర్భంగా ప్రఖ్యాత వైద్య పరిశోధన అంశాల పత్రిక 'లాన్సెట్' ప్రచురితమైన ఒక అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 82.8 కోట్ల సంఖ్య 1990లో డయాబెటిస్ బాధితుల సంఖ్యకు నాలుగు రెట్లు ఉందని, ముఖ్యంగా చిన్న, మధ్యస్థ ఆదాయ దేశాల (ఎల్‌ఎంఐసి)లో అత్యంత పెరుగుదల ఉన్నట్లు నివేదిక తెలిపింది. 1990–2022 మధ్య, ఎల్‌ఎంఐసిలలో చాలా తక్కువస్థాయిలో షుగర్ చికిత్స రేట్లు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా (సుమారు 60 శాతం) జీవనక్రియ పరిస్థితితో 30 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న 44.5 కోట్ల మంది పెద్దలు 2022లో చికిత్స తీసుకోకపోవడంతో షుగర్ కేసులు పెరిగినట్లు నివేదిక తెలిపింది. చికిత్స తీసుకోని 44.5 కోట్లలో మూడింట ఒక వంతు (13.3 కోట్లు) భారత్‌లోనే ఉన్నట్లు పేర్కొంది. చైనాలో 14.8 కోట్ల మంంది ఉండగా, అమెరికాలో 4.2 కోట్లు, పాకిస్థాన్‌లో 3.6 కోట్లు, బ్రెజిల్‌లో 2.2 కోట్ల మంది ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ రిస్క్ ఫ్యాక్టర్ కొలాబరేషన్ (ఎన్‌సిడి–రిస్క్) సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ)తో సమన్వయమై ఈ అధ్యయనం చేపట్టింది. ఎన్‌సిడి రిస్క్ సంస్థలో 1500 మందికి పైగా పరిశోధకులు, అభ్యాసకులు ఉన్నారు. వీరు పలు దేశాలలో వ్యాప్తి కాని వ్యాధికి గల ప్రమాద కారకాలపై సమాచారాన్ని అందిస్తుంటారు.

శ్రీలంకలో ప్రశాంతంగా పోలింగ్

కొలంబో : శ్రీలంక పార్లమెంట్‌కు గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4గంటలకు పూర్తయింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయానికల్లా తొలి ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. కాగా, 225 సీట్లు గల పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించగలమని అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే పార్టీ ఆశిస్తోంది. ఆర్థిక సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్ళాలంటే మంచి మెజారిటీ కావాలని అధ్యక్షుడు భావిస్తున్నారు. ఈ ఎన్నికలు పాలక పార్టీ నేషనల్ పీపుల్స్ పవర్ పార్టీ (ఎన్‌పిపి)కి లిట్మస్ పరీక్ష వంటివి.

దేశవ్యాప్తంగా 13,314 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కోటీ 70లక్షల మందికి పైగా అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సెప్టెంబరులో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన దిసనాయకే.. అవినీతిపై పోరాడతామని, ఇందుకు ప్రజల మద్దతు కావాలని పేర్కొన్న సంగతి తెలిసిందే.





దహానులో నిర్వహించిన సభకు హాజరైన మహిళలు, సిపిఎం అభ్యర్థి వినోద్ నికోల్‌తో కలిసి అభివాదం చేస్తున్న బృందాకరత్

ఆదివాసీల హక్కులు కాలరాస్తున్న బిజెపి

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారసభలో బృందాకరత్
- సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని వినతి

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ఆదివాసీల హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా దహాను స్థానం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వినోద్ నికోల్ గెలిపించాలని కోరుతూ నిర్వహించిన ప్రచార సభలో ఆమె పాల్గొన్నారు. గత రెండు రోజులుగా మహారాష్ట్రలో పర్యటిస్తున్న బృందాకరత్ తలసరిలోని వాసా, కొచాయ్‌లోనూ, దహానులోని వాకీ, సాయివాన్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లోనూ, ఆషాగడ్, మోద్‌గావ్‌లోని ఆదివాసీ మహిళల సమావేశంలోనూ, దహాను పట్టణంలో ముస్లిం మహిళా సాధికారిక సభలోనూ ఆమె ప్రసంగించారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బిజెపి ప్రభుత్వం ప్రజలపై ఎనలేని భారాలు వేస్తోందని విమర్శించారు. ఆదివాసుల పట్ల నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తోందని, వారి హక్కులను కాలరాస్తోందని తెలిపారు. అటవీ సంరక్షణ పేరుతో ఆదివాసులను భక్షించే విధానాలను అమల్జేస్తోందని, కార్పొరేట్ సంస్థలకు అటవీ భూములను దారాదత్తం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం మైనార్టీలపైన బిజెపి ప్రభుత్వాలు లక్షిత దాడులకు ఒడిగడుతున్నాయని విమర్శించారు. మతం పేరుతో ప్రజలను విడొట్టి, ఆంగ్లేయుల తరహా 'విభజించు–పాలించు' వినాశకర విధానాలు అవలంభిస్తోందన్నారు. సిపిఎం అభ్యర్థులను, మహా వికాస్ అఘాది (ఎంవిఎ) అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సభల్లో ఎమ్మెల్యే వినోద్ నికోల్‌లో పాటు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ దావలే, కేంద్ర కమిటీ సభ్యురాలు మరియం ధావలే, ఎన్‌సిపి నేత ప్రవీణ్ దాల్వీ, శివసేన నేత సంజయ్ పాటిల్, కష్టకారీ సంఘటనకు చెందిన బ్రియాన్ లోబో తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులకు పరామర్శ

మహారాష్ట్రలో ప్రజా ఉద్యమాల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సిపిఎం సీనియర్ నాయకులను బృందాకరత్ కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సిపిఎం, ఎఐకెఎస్‌లకు చెందిన మాజీ ఎంపి 88 ఏళ్ల లహను కోమ్‌తో పాటు 1951 నుండి 74 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్న 97 ఏళ్ల ఎల్‌బి ధంగర్‌ను ఆమె కలుసుకున్నారు.

ముసాయిదాపై మల్లగుల్లాలు

- కాప్ 29లో వాతావరణ నిధిపై కొనసాగుతున్న కసరత్తు

బాకూ : వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన వాతావరణ నిధిపై ముసాయిదా సత్వర కార్యాచరణకు ఏ మాత్రమూ అనువుగా లేదని పలు దేశాలు అభిప్రాయపడ్డాయి. మరింత సమర్ధవంతమైన చర్యలు తీసుకోవడానికి వెసులుబాటు కల్పించేలా కొత్త ఆర్థిక లక్ష్యాలతో ముసాయిదా వుండాలని వర్ధమాన, నిరుపేద దేశాలు భావిస్తున్నాయి. బుధవారం 34 పేజీలతో వెలువడిన ముసాయిదా తీరుతెన్నులపై లైక్ మైండెడ్ దెవలపింగ్ కంట్రీస్ (ఎల్‌ఎండిసి) గ్రూపు, అరబ్ గ్రూపు, ఆఫ్రికన్ గ్రూపు పెదవి విరిచాయి. అత్యంత తీవ్రంగా వున్న వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనడానికి పేద దేశాలకు సాయపడేందుకు ఇప్పుడే నిధులు అందచేయాలని లేదా తర్వాత కాలంలో మరింత ఎక్కువ మొత్తాలు ఇవ్వాల్సివస్తుందని చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు గురువారం హెచ్చరించారు. ఏడాదికి లక్ష కోట్ల డాలర్లు వుండాలని ఎల్‌ఎండిసి గ్రూపు సూచించింది. 1.1 ట్రిలియన్ల డాలర్లుగా వుండాలని అరబ్ గ్రూపు కోరుతుండగా, 1.3 ట్రిలియన్ డాలర్లుగా వుండాలని ఆఫ్రికన్ గ్రూపు కోరుతోంది. కాగా ముసాయిదా ప్రక్రియ అంతా అందరినీ అసహనానికి గురి చేసింది. ముసాయిదాను క్లిష్టతరంగా మార్చయడంపై పేద దేశాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. లాటిన్ అమెరికా, కరేబియా దేశాల క్లైమేట్ ఫైనాన్స్ గ్రూపు వ్యవస్థాపకుడు శాంద్రా గుజ్‌మన్ లూపా మాట్లాడుతూ, ఈ ముసాయిదాను సరళీకరించడానికి ఇంకా జరగాల్సిన కసరత్తు చాలా వుందన్నారు. ప్రతి ఒక్కరినీ ఇందులో భాగస్వాములు చేస్తున్నట్లుగా హామీ కల్పించాల్సి వుందని, అప్పుడే అర్ధవంతమైన చర్చలు జరుగుతాయని అన్నారు. మరో మూడు రోజుల్లో సదస్సు ముగియనున్న నేపథ్యంలో అందరిలోనూ ఫలితాలపై ఒకరకమైన ఆందోళన నెలకొంది.



ఈరోడ్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు

తమిళనాడులో వైద్యుల ఆందోళన

చెన్నయ్ : తమిళనాడులోని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యులు గురువారం ఆందోళన చేపట్టారు. దీంతో పలు చోట్ల ఔట్ పేషేంట్ సేవలకు, ఇతర వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల 13న చెన్నయ్‌లోని గిండీలోని కలైంజర్ సెంటినరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సీనియర్ వైద్యునిపై రోగి బంధువులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిని ఖండిస్తూ వైద్యులకు భద్రత కల్పించాలని కోరుతూ ఈ ఆందోళనలు చేపట్టారు. ఆస్పత్రులను సేఫ్ జోన్‌లుగా ప్రకటించేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలని, క్యాజువాలిటీ వార్డులు, ఐసియుల్లో పోలీసులను మోహరించాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఉపక్రమించింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మా సుబ్రమణియన్‌తో గురువారం వైద్య సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. ఆస్పత్రుల వద్ద భద్రతను పటిష్టం చేయాలని వైద్యులు కోరినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం సానుకూల చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు.

ఉద్ధవ్ ప్రభుత్వ కూల్చివేతలో అదానీ కీలకం!

(మొదటి పేజీ తరువాయి)

పాలుపంచుకున్న విషయం నిజమేనని బిజెపి పరోక్షంగా అంగీకరించినట్లు కన్పిస్తోంది. దేశంలో ఏ రంగంలో చూసినా అదానీ ముద్ర కన్పిస్తుండడంపై ప్రతిపక్షాలు ఇప్పటికే ఆరోపణలు సంధిస్తున్నాయి.

మూణ్ణాళ్ల ముచ్చట

తాజా పరిణామాన్ని పరిశీలిస్తే అధికార కూటమి మహాయుతిలో వ్యవహారాలు సజావుగా సాగడం లేదని అర్థమవుతోంది. 2019లో తీసుకున్న నిర్ణయం వెనుక తన ప్రమేయం ఉన్నదని చెప్పుకునే క్రమంలో అజిత్ పవార్ తొందరపాటు ప్రదర్శించారు. ఆ సంవత్సరం ఎన్నికలు జరిగిన తర్వాత ప్రభుత్వానికి నాయకత్వం వహించేందుకు దేవేంద్ర ఫడ్నవీస్ ప్రయత్నించారు. మహా వికాస్ అఘాడీ విజయం సాధించడానికి ముందే ఆయన ఈ ప్రయత్నాలు సాగించారు. మరోవైపు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీపై అజిత్ తిరుగుబాటు చేశారు. ఆయన ఇంటర్వ్యూను పరిశీలిస్తే అదానీ వ్యవహారాలలోకి బిజెపి చొచ్చుకుపోతోందని స్పష్టమవుతోంది. ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా చెప్పుకునే బిజెపికి ఆ పారిశ్రామికవేత్త వ్యక్తిగతంగా సాయపడుతున్నారన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మహారాష్ట్రలో ఫడ్నవీస్–అజిత్ పవార్ ప్రభుత్వ మనుగడ మూడునాళ్ల ముచ్చటగానే మిగిలింది. రాష్ట్రంలో రాజకీయ ప్రతిష్టంభన కొనసాగుతుంటే వారిద్దరూ అధికార దాహంతో వ్యవహరించారు.

వెల్లువెత్తుతున్న విమర్శలు...ఆరోపణలు

తాజాగా అజిత్ చేసిన ప్రకటన అదానీకి ఇబ్బందికరంగా పరిణమించింది. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన నుండి ఆయన ఇప్పటికే తీవ్రమైన దాడిని ఎదుర్కొంటున్నారు. ఆసియాలోనే అతి పెద్ద మురికివాడ అయిన ధారవిని ఆధునిక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన వివాదాస్పద ప్రణాళిక విషయంలో అదానీపై థాక్రే సేన విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్‌ను మహాయుతి ప్రభుత్వం నుండి చేజిక్కించుకోవడం ద్వారా ముంబయిలో నివసిస్తున్న వారిని దోచుకునేందుకు అదానీ ఎత్తుగడలు పన్నారని ఉద్ధవ్, ఆదిత్య థాక్రే ఎప్పటి నుండో మండిపడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ ప్రణాళికను రద్దు చేస్తామని వారు ప్రజలకు హామీ ఇస్తున్నారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా చాలా కాలంగా అదానీ పేరు చెబితేనే మండిపడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మద్దతుతో అదానీ గ్రూప్ ఇంతింతై వటుడింతై అనే రీతిలో ఎదిగిపోతోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శాసనసభలో ఓ ప్రకటన చేస్తూ అదానీ కోసం మోడీ పనిచేస్తున్నారని విమర్శించారు. అదానీ వ్యవహారంపై సభలో చర్చించాలంటూ గత లోక్‌సభ సమావేశాలలో ప్రతిపక్షం ముక్తకంఠంతో డిమాండ్ చేసినా పాలక పక్షం నోరు మెదపలేదు. అదానీ, శరద్ పవార్ మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలు అందరికీ తెలిసినవే. 2019 ఎన్నికల తర్వాత బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు శరద్ ప్రయత్నించారని అజిత్ అప్పట్లో ఆరోపించారు. దీనిపై శరద్ కూడా దీటుగానే స్పందించారు.

అమిత్ ఆఫర్

గత ఐదు సంవత్సరాలుగా శరద్ పవార్ బిజెపి వ్యతిరేక వైఖరినే అనుసరిస్తూ వస్తున్నారు. 2019లో ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలో మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం ఏర్పడడానికి ప్రధాన కారకుడు ఆయనే. మారిన పరిస్థితుల కారణంగా ఆయన శివసేనతో అధికారాన్ని పంచుకునేందుకు కాంగ్రెస్‌ను ఒప్పించారు. 2019 ఎన్నికలకు ముందు బిజెపితో జరిగిన రహస్య సమావేశంలో శివసేనకు అమిత్ షా ఓ ఆఫర్ ఇచ్చారు. తొలి రెండున్నర సంవత్సరాలు శివసేనకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఆయన ప్రతిపాదించారని ఉద్ధవ్, ఆయన పార్టీ చెబుతూనే ఉన్నాయి.

బిజెపిలో రుసరుసలు

ఏదేమైనా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అజిత్ పవార్ చేసిన ప్రకటన బిజెపిని తీవ్ర ఇరకాటంలో పడేసిందనే చెప్పాలి. ప్రభుత్వ ఏర్పాటులో పారిశ్రామికవేత్తల ప్రమేయాన్ని మహారాష్ట్ర ప్రజలు అంగీకరించరు. కరడుకట్టిన హిందూత్వ పార్టీగా బిజెపికి ఉన్న ఇమేజ్‌ను అజిత్ ప్రకటన తుడిచేసింది. అలాగే ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా గొప్పలు చెప్పుకునే బిజెపిపై పారిశ్రామికవేత్తల ప్రభావం గురించి అది ఓ సందేశాన్ని కూడా పంపుతోంది. అజిత్ పవార్‌తో సంబంధాలు పెట్టుకోవడాన్ని ఇప్పటికే బిజెపిలోని ఒక గ్రూపు, ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అవినీతిపరుడైన అజిత్‌ను జైలుకు పంపడం ఖాయమని కిరిత్ సోమయ్య వంటి కొందరు బిజెపి నాయకుల ప్రచారం జోరుగా సాగుతున్న వేళ, తన మామ అయిన శరద్ పవార్‌ను ఇరకాటంలో పెట్టేందుకు అజిత్ చేసిన ప్రయత్నం ఎదురు తన్నింది. శరద్‌ను లక్ష్యంగా చేసుకొని నరేంద్ర మోడీ, అమిత్ షా చేసిన ప్రచారం లోక్‌సభ ఎన్నికలలో కమలదళానికి ప్రతికూల ఫలితాలు ఇచ్చిన విషయం తెలిసిందే. అజిత్ ఇప్పుడు 'డేంజర్ జోన్'లో ఉన్నారని, ఉనికిని కాపాడుకునేందుకు అన్ని ఎత్తుగడలు వేస్తున్నారని రాజకీయ రంగంలో ప్రచారం జరుగుతోంది.

'ప్రజాపోరు'తో హోరెత్తిన రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ నిరుద్యోగులకు మాత్రం నామినేటెడ్ పదవులు ఇచ్చి భర్తీ చేసుకున్నారని విమర్శించారు. వెంటనే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించి స్పెషల్, మెగా డిఎస్‌సి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేదీ నుండి సిపిఎం చేపట్టిన ప్రజాపోరు విజయవంతంగా ముగిసిందని తెలిపారు. విజయవాడలో జరిగిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, కె శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ జిల్లా కడప కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుల ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ జిల్లా పట్ల పాలకులు వివక్ష విడనాడాలన్నారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న గాలేరు–నగరి, హంద్రీ–నీవా, తెలుగంగ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయిస్తే ఎప్పటికి పూర్తవుతాయని ప్రశ్నించారు. ప్రజాపోరులో భాగంగా కర్నూలు కలెక్టరేట్‌కు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కలెక్టరేట్ వద్ద రెండు గంటలపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యల



కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రజలు, సిపిఎం నాయకులు

పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రజలపై భారాలో మోపడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ధరల అదుపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ వద్ద ధర్నాకు ముదివేడు ప్రాజెక్టు నిర్వాసితులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీనికి ముందు కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నంద్యాల, నెల్లూరు, పార్వతీపురం, తిరుపతి కలెక్టరేట్ల వద్ద ధర్నా, ఎన్‌టిఆర్, కృష్ణా, అనంతపురం, చిత్తూరు, తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ, అనకాపల్లి, పశ్చిమగోదావరి, ఏలూరు,, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆర్‌డిఒ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. అల్లూరి జిల్లా విఆర్.పురం మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డుంబ్రిగుడ, అరకులోయలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. శ్రీకాకుళంలో అంబేద్కర్ కూడలి వద్ద ధరా నిర్వహించారు.

పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. 175 నియోజకవర్గాల్లో ప్రతి చోటా పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామన్నారు. పోర్టు ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామని ఆయన వెల్లడించారు. తీర ప్రాంతానికి దగ్గరలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రెండేళ్ల వ్యవధిలోనే ఎక్కువ ప్రాజెక్టులు వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వంలో పెట్టుబడులు రాలేదు...

గత ప్రభుత్వ హయాంలో 227 ఎంవోయులు జరిగినా రాష్ట్రానికి ఎటువంటి పెట్టుబడులు రాలేదని చంద్రబాబు చెప్పారు. గత ఐదేళ్లలో పన్నులు, కరెంటు ఛార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలు మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఐదేళ్లపాటు ఇబ్బంది పెట్టారన్నారు.

సబ్సిడీలు ఇలా...

పరిశ్రమలకు ప్రభుత్వం 12 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన వారికి మరో 10 శాతం అదనంగా సబ్సిడీ ఇస్తామన్నారు. గరిష్టంగా 44 శాతం ప్రోత్సాహకాలు వస్తాయన్నారు. 18 నెలల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మరింత ప్రోత్సాహకం ఉంటుందన్నారు. పరిశ్రమలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తరగతులకు మరో 10 శాతం రాయితీలు ఇస్తామన్నారు. వీరికి శిక్షణ కూడా ఇస్తామన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులను ఎక్కువగా తయారు చేస్తే మరిన్ని ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. సూక్ష్మచిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి రూ.50 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యంగా ఆశిస్తున్నామని తెలిపారు.

ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు

విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో ఇన్నోవేషన్ హబ్‌కు 35 నియోజకవర్గాల పరిశ్రమలను అనుసంధానం చేస్తామన్నారు. పరిశ్రమలకు ఓఎన్‌జిసి వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా భాగస్వామ్యం చేస్తామన్నారు. రూ.250 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకుంటామని, రూ.100 కోట్లపైబడి పెట్టుబడి పెట్టేవారికి మరిన్ని ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు. మంత్రులు టి.జి.భరత్, కొండపల్లి శ్రీనివాస్, గొట్టిపాటి రవి తదితరులు కూడా ప్రసంగించారు.

బ్రిటన్ రచయిత సమంత హార్వేకు బుకర్ ప్రైజ్



లండన్ : ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారమైన బుకర్ ప్రైజ్ 2024 సంవత్సరానికి గాను బ్రిటన్‌కు చెందిన సమంత హార్వేని వరించింది. ఆమె రాసిన సైన్స్ ఫిక్షన్ నవల 'ఆర్బిటల్'కు ఈ బహుమతి దక్కింది. 2019 తర్వాత బుకర్ బహుమతి అందుకోనున్న తొలి మహిళగా సమంత నిలిచారు. లండన్‌లో ఈ నెల 12న నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆమెకు ట్రోఫీని, రూ.53.78 లక్షలు (50000 పౌండ్లు) పారితోషికాన్ని పురస్కారం కింద అందజేశారు. 'ఆర్బిటల్' అనేది కేవలం 136 పేజీలున్న చిన్న నవల. అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రంలోని ఆరుగురు వ్యోమగాముల జీవనయానమే కథా వస్తువు. అమెరికా, ఇటలీ, రష్యా, బ్రిటన్, జపాన్ నుండి వచ్చిన వ్యోమగాములు ఒకే రోజులో 16 సూర్యోదయాలను వీక్షించి, భూగోళంలోని అత్యద్భుతమైన అందంలో మునిగిపోయారంటూ వర్ణిస్తూ అత్యంత సజనాత్మక సాక్ష్యంగా 'ఆర్బిటల్' పాఠకులను కట్టిపడేస్తుందని పురస్కార కమిటీ ఛైర్మన్ ఎడ్మండ్ డి వాల్ అభినందించారు. ఆధునిక రచనా శైలి, సమకాలీన కథాంశం పరంగా 'ఆర్బిటల్' ఇతర రచనల కంటే అత్యుత్తమంగా నిలిచిందని వాల్ పేర్కొన్నారు. ఈ అవార్డును భూమి మనుగడకు, శాంతి పునరుద్ధరణకు అంకితం ఇస్తున్నట్లు సమంత హార్వే ప్రకటించారు. కోవిడ్ కాలంలో రాసిన ఈ నవల నవంబర్ 2023లో తొలిసారి ప్రచురితమైంది. కాగా ఈ దఫా బుకర్‌కు ఎంపికైన ఆరుగురిలో ఐదుగురు మహిళలే ఉండటం విశేషం.

గాజాలో చర్యలన్నీ యుద్ధ నేరాలే

- కరువు కాటకాలూ యుద్ధ సాధనమే
- ఇజ్రాయిల్ దారుణాలపై మానవ హక్కుల సంస్థ

గాజా, బీరుట్ : గాజాపై ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడిందని మానవ హక్కుల పర్యవేక్షణా సంస్థ (హ్యూమన్ రైట్స్ వాచ్) గురువారం ఒక నివేదికలో పేర్కొంది. గాజా నుండి పాలస్తీనియన్లను బలవంతంగా ఖాళీ చేయించి వారిపై దాడులకు, ఊచకోతకు దిగడమంటే అవి యుద్ధ నేరాలేనని స్పష్టం చేసింది. ఇజ్రాయిల్ ఆర్మీ దిగ్బంధనంలో వున్న గాజాలో అత్యంత దయనీయంగా వున్న మానవతా పరిస్థితులపై హెచ్చరిస్తూ సహాయక బృందాలు, అంతర్జాతీయ సంస్థలు వరుసగా జారీ చేస్తున్న నివేదికల్లో ఇది తాజాది. "ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించి, వారికి ఇల్లూ వాకిలి లేకుండా చేయడమనేది సర్వత్రా కనిపిస్తోంది. ఇదంతా కూడా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందనడానికి తగిన సాక్ష్యాధారాలు వున్నాయి. పైగా ప్రభుత్వ విధానంలో భాగంగా కొనసాగుతోంది. ఇటువంటి చర్యలన్నీ మానవాళికి వ్యతిరేకంగా సాగే నేరాలే." అని ఆ నివేదిక స్పష్టం చేసింది. కరువును కూడా ఒక యుద్ధ సాధనంగా వాడుతున్నారని విమర్శించింది. గతేడాది అక్టోబరు నుండి ఈ ఏడాది జులై వరకు జరిగిన దారుణ సంఘటనలన్నింటినీ ఈ నివేదిక పొందుపరిచింది. ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాల్లో హింస, విధ్వంసంపైదృష్టి సారించింది. గాజాను దిగ్బంధించడం, మానవతా సాయానికి అడ్డంకులు సృష్టించడం, లక్ష్యిత ప్రాంతాలపై దాడులు, పౌరులు, సహాయక కార్యకర్తల హత్యలు వంటి చర్యలు చేపట్టడం ద్వారా ఇజ్రాయిల్ ఉద్దేశ్యపూర్వకంగానే కరువు కాటకాలు సృష్టించడం, హత్యలకు పాల్పడ్డం చేస్తోందని నివేదిక విమర్శించింది. కృత్రిమ మేధస్సు సాయంతో లక్ష్యాలపై దాడులు జరుపుతోందని పేర్కొంది. దీనివల్ల పౌర ఆవాసాలా కాదా అనేది తేడా కూడా చూడడం లేదని పేర్కొంది. కాగా దీనిపై ఇజ్రాయిల్ మిలటరీ నుండి లేదా విదేశాంగ శాఖ నుండి ఎలాంటి వ్యాఖ్యలు వెలువడలేదు. అయితే గతంలో ఇదే రీతిలో వచ్చిన ఆరోపణలను ఇజ్రాయిల్ అధికారులు ఖండించారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే తమ బలగాలు వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. తప్పనిసరి సైనిక కారణాలు లేదా పౌరుల భద్రతా రీత్యా అవసరమనుకుంటే తప్ప ఆక్రమిత ప్రాంతం నుండి పౌరులెవరినీ బలవంతంగా ఖాళీ చేయించరాదని సాయుధ ఘర్షణల చట్టం స్పష్టంగా పేర్కొంటోంది. గత 13 మాసాలుగా సాగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 43,736మంది మరణించారు. 1,03,370మంది గాయపడ్డారు. గత నెల రోజులకు పైగా ఉత్తర గాజా దిగ్బంధనం కొసాగుతోంది. బఫర్‌జోన్‌ల్లో, సెక్యూరిటీ కారిడార్లలో ఇలా పాలస్తీనియన్లను అటూఇటూ తరలించే ప్రక్రియ బహుశా శాశ్వతంగా కొనసాగించే అవకాశాలు వున్నాయని ఆ నివేదికలో మానవ హక్కుల సంస్థ పేర్కొంది. ఇటువంటి చర్యలు జాతి నిర్మూలన కిందకే వస్తాయని హెచ్చరించింది.

కొనసాగుతున్న దాడులు

గత నెల రోజుల్లో గాజాలో సహాయక కార్యకర్తలు 20మంది వరకు మరణించారని మానవతా సంస్థలు తెలిపాయి. సిరియా–లెబనాన్ సరిహద్దుల్లోని ప్రాంతాలపై దాడుల అనంతరం బీరుట్ దక్షిణ శివార్లలో ఆర్మీ దాడులు కొనసాగిస్తోంది. రాజధాని బీరుట్‌లోని హరెత్ హ్రీక్, బుర్జ్ అల్ బరజ్‌నెహ్ ప్రాంత ప్రజలు అక్కడ నుండి ఖాళీ చేయాలని ఆర్మీ ఆదేశాలు జారీ చేసింది. అంతకు గంట క్రితమే బీరుట్‌లోనే మరో రెండు ప్రాంతాల్లో ప్రజలకు కూడా ఇదే రీతిలో ఆదేశాలు జారీ చేసింది. నెగెవ్ ప్రాంతంలోని ఉమ్ అల్ హిరాన్ గ్రామంలో చిట్టచివరి భవంతిని, మసీదును అధికారులు ధ్వంసం చేశారు. గ్రామంలోకి పెద్ద సంఖ్యలో బలగాలు చొచ్చుకు వచ్చి విధ్వంసానికి దిగాయి.

రైతు ఆత్మహత్యలు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

ముగ్గురితో, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ముగ్గురితో కమిటీ వేసింది. 24 గంటల్లో పై కమిటీకి మండల కమిటీ రిపోర్టు పంపాలని, డివిజన్ నుంచి 7 రోజుల్లో కలెక్టర్‌కు రిపోర్టు పంపాలని, కలెక్టర్లు ఇచ్చే నివేదికలను పరిశీలించి వ్యవసాయ కమిషనర్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలంది. వ్యవసాయాన్ని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్న టిడిపి కూటమి, అన్నదాతల ఆత్మహత్యలపై మొక్కుబడిగా వ్యవహరిస్తోంది. ప్రతి ఏడాదీ వందల సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు సంభవిస్తున్నాయి. కౌలు రైతుల బలవన్మరణాలే అత్యధికం. కౌలు రైతుల ఆత్మహత్యలు నమోదు కావట్లేదు. ఎక్స్‌గ్రేషియాకు అర్హత సాధించినవి, ఎన్‌సిఆర్‌బి నివేదికలు, వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ విభాగాల అంకెలు భిన్నంగా ఉంటున్నాయి. ఇదిలా ఉండగా ఆత్మహత్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎక్స్‌గ్రేషియా కోసం బడ్జెట్‌లో చేసే కేటాయింపులే తెలుపుతున్నాయి. 2019–20 బడ్జెట్‌లో వైసిపి సర్కారు రూ.వంద కోట్లు ప్రతిపాదించింది. ఆ తర్వాతి సంవత్సరాల్లో రూ.20 కోట్లకు పరిమితం చేసింది. అవి 285 కేసులకు సరిపోతాయి. ఆ మేరకు కూడా ఖర్చు చేయలేదు. 2022–23లో రూ.18.97 కోట్లు వ్యయం చేసింది. 2023–24లో రూ.28.40 కోట్లకు బడ్జెట్‌ను సవరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024–25లో రూ.22 కోట్లు చూపించింది.

వైజాగ్ స్టీల్‌కు గనులివ్వరు... ఏర్పాటేకాని మిట్టల్‌కు హామీలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్లాంటు ఏర్పాటు ఎవరి ప్రయోజనాల కోసమంటూ ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎటువంటి ఒప్పందమూ జరగకుండానే...

మిట్టల్ గ్రూప్ సంస్థ ప్రతినిధులతో ఇంతవరకూ ఎలాంటి ఒప్పందమూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోలేదు. ఉమ్మడి విశాఖ జిల్లా ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన నక్కపల్లి సమీపంలోని బల్క్ డ్రగ్ పార్క్ కోసం కేటాయించిన 2,600 ఎకరాలను స్టీల్‌ప్లాంట్ (మిట్టల్ సంస్థ)కు కేటాయించేందుకు సిఎం రమేష్ మంతనాలు జరిపారా? ఒకవేళ జరిపితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకారం తెలిపాయా? వెల్లడి కాలేదు. ఇంటిగ్రేటెడ్ బల్క్ డ్రగ్ పార్క్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించింది. ఇదే ప్రాంతంలో మిట్టల్‌కు ఎలా అనుమతులిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగాల ప్రకటనలపై గత అనుభవాలేమిటి?

ఈ ప్రాజెక్టు 20 వేల ఉద్యోగాలు వస్తాయని అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ ఊదరగొట్టిన సంగతి తెలిసిందే. విశాఖలో గత పరిశ్రమల అనుభవాలను చూస్తే... 2018లో అదాని కంపెనీతో ఎంఒయు జరిగితే ఇంతవరకూ పునాది కూడా పడలేదు. టిసిఎస్ విశాఖకు వస్తుందంటూ, పది వేల ఉద్యోగాలు వస్తాయంటూ మంత్రి లోకేష్ ప్రకటించారు. టిసిఎస్‌తో కనీసం ఇంతవరకూ అగ్రిమెంట్ జరగలేదు. ఇన్ఫోసిస్ ఐటి సంస్థను విశాఖలో పెట్టినా ముంబయి, ఢిల్లీకి చెందిన 200 మంది పనిచేస్తున్నారు తప్ప, ఉత్తరాంధ్రకు చెందిన ఒక్కరికీ ఉద్యోగం కల్పించలేదు. ప్రస్తుతం విశాఖ నగరంలో సత్యం జంక్షన్‌గా పిలవబడుతున్న ప్రాంతం ఆర్‌టిసిది. అప్పట్లో ప్రభుత్వ ఆస్పత్రులు ఉండేవి. వీటిని తీసేసి ఈ స్థలాలను విప్రో, టెక్ మహీంద్ర సంస్థలు 19 ఏళ్ల క్రితం కట్టబెట్టింది. ఎకరా రూపాయికే కారు చౌకగా ఆ సంస్థలు కొట్టేసి ఈ స్థలాల్లో భవనాలు నిర్మించి ప్రైవేట్ బిపిఒలకు అద్దెలకిచ్చేశాయి. ఏడు వేల మందికి ఉద్యోగాలన్నారు. మొత్తం కలిపితే 300 మంది ఇప్పటికీ లేరు.



నత్త నడక



నారాయణరావు మాష్టారు మంగళవారం పేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. 'దినపత్రికలు విజ్ఞాన ప్రగతికి సోపానాలు' అని చెప్పి ప్రతిరోజూ సాయంత్రం పిల్లలందరినీ ఆరుబయట కూర్చోబెట్టి ప్రతి ఒక్కరి చేత దినపత్రికలు చదివిస్తారు. అలా కొన్నాళ్ళకి దినపత్రికలు చదవడం మీద విద్యార్థులకు ఆసక్తి పెరిగింది. చదవడం బాగా అలవడింది. జాతీయ, రాష్ట్రీయ, ప్రాంతీయ వార్తలే కాక ఆటలు వినోదానికి సంబంధించిన విషయాలు కూడా చదివి అందులో వచ్చే సందేహాలను మాష్టారుని అడిగి నివృత్తి చేసుకునేవారు.

చుక్కలు కలపడం, రంగులు వేయడం, మెదడుకు మేత లాంటి అంశాలను దగ్గరుండి పిల్లలచేత చేయించేవారు. పిల్లలచేత కథలు చెప్పించేవారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక వైఖరిని బయటకు తీయడానికి ఎంతగానో శ్రమించేవారు మాష్టారు. దానివల్ల విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెరిగింది. ఒకరోజు వివేక్ అనే విద్యార్థి చదువుతున్న దినపత్రికలో 'నత్త నడకన సాగుతున్న పోలవరం ప్రాజెక్టు పనులు' అని ఉంది. అది చూసి నత్త నడకన సాగడమంటే ఏంటి సర్' అని అడిగాడు.


'భూమిపై వేగంగా పరిగెత్తే జీవుల్లో చిరుత మొదటి స్థానంలో ఉంటే మెల్లగా వెళ్లే వాటిలో నత్తలు మొదటి స్థానంలో ఉంటాయి. అందుకే ఎవరైనా పనులు మెల్లగా చేస్తే వారిని 'నత్త నడక' లేదా 'నత్తకు నడక నేర్పడం' అని అంటారు. ప్రపంచంలోనే ఇంత నిదానంగా కదిలే జీవి మరొకటి లేదు. నత్తలు ఒక సెకనులో ఒక్క మిల్లీ మీటర్ మాత్రమే నడుస్తాయి. కొన్ని పనులు మన అశ్రద్ధ వల్ల, కొన్ని ప్రాజెక్టులు నిధుల లేమి, సాంకేతిక కారణాల వల్ల, నీటి ముంపు వల్ల ఆలస్యమౌతాయి. అలాంటి సందర్భాల్లో వాడే మాట 'నత్త నడక'. ఇది ఒక జాతీయం' అని వివరించారు నారాయణరావు మాష్టారు.

'అర్థమైంది మాష్టారు' అన్నాడు వివేక్.


– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.



నేను గీసిన బొమ్మ



సిరిపురపు మౌక్తిక,
6వ తరగతి,
హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఒంగోలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడి: chinnaarips@gmail.com



చెయ్యని తప్పునకు బలవుతున్నారు..!

మనిషి సృష్టించే యుద్ధాలు, అశాంతి; ప్రకృతి కారణంగా తలెత్తే వైపరీత్యాలూ .... అందరి కన్నా ఎక్కువగా పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తాయి. వారి ఆశలను, ఆరోగ్యాన్ని, కలలను, భవితవ్యాన్ని ఎక్కువగా దెబ్బతీస్తాయి. యుద్ధాల్లో వారి ప్రమేయం ఉండదు. పర్యావరణం దెబ్బతినటంలో వారి పాత్ర లేదు. కానీ, పర్యవసానాలకు వారు బలవుతున్నారు.



పిల్లలు.. జనాభాలో లెక్కపెట్టే సంఖ్య కాదు. వారు ఈ సమాజపు వారసులు. ముందు తరం వారధులు. వారి ఆశలకు, అవసరాలకు అనుగుణంగా సమాజం ఉండాలి. వాతావరణం సవ్యంగా, సకాలంగా సాగాలి. కానీ, ఇప్పుడు అలా జరుగుతుందా? లేదు. పెద్దలు చేసిన తప్పులు వారికి శాపంగా మారుతున్నాయి. విచక్షణారహితంగా పర్యావవరణాన్ని ధ్వంసం చేసిన పెద్దల తప్పిదాలు... వైపరీత్యాలుగా మారి బాలల ఎదుగుదలను, చదువును, ఆటపాట లను, ఆరోగ్యాన్ని... ఇలా ధ్వంసం చేస్తున్నాయి.

బాల్యంలో వచ్చే అనేక అనారోగ్య సమస్య లకు మూల కారణం వాతావరణ మార్పులు. గాలి కాలుష్యం పెద్దల కంటే పిల్లలపైనే ఎక్కువ ప్రభావం చూపుతుంది. శరీర ఉష్ణోగ్రతలను నియంత్రణ చేసుకోలేని పిల్లలు, తీవ్ర వేడిగాలు లకు ఎక్కువగా ప్రభావితమౌతారు. వాతావరణ మార్పులకు లోనైన పంట దిగుబడిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఎంతోమంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల వల్ల 4 కోట్ల మంది పిల్లలు చదువుకు దూరమవు తున్నారు. వాతావరణ మార్పుల వల్ల ప్రపంచంలో 73 కోట్ల 90 లక్షల మంది పిల్లలు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. 43 కోట్ల 60 లక్షల మంది నీటి ఎద్దడి ప్రాంతాల్లో నివసిస్తున్నారు.



పరిస్థితి ఇక్కడితో ఆగడం లేదు..

వాతావరణ మార్పుల వల్ల తీవ్ర కరువు పరిస్థితులు ఎదుర్కొన్న ప్రాంతాల్లోని ప్రజలు బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళతారు. దానివల్ల వారి పిల్లలు కూడా చదువుకు దూరమై ఇంటికి పరిమితమవ్వడమో, పనుల్లో కుదరడమో జరుగుతుంటుంది. కొన్నిచోట్ల చిన్న వయసులోనే పెళ్లిళ్ల కూడా చేసేస్తారు. ఈ మొత్తం వ్యవహారంలో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితే అందరికీ కనిపిస్తుంది. కానీ ఇందుకు కారణమైన వాతావరణ మార్పు ఎవరికీ పట్టదు. వరదలు, కరవుతో వలసపోయిన కుటుంబాల పిల్లల మనోగతాలు వింటే వాళ్ల పడుతున్న క్షోభ అర్థమవుతుంది.

13 ఏళ్ల రామ్ కుటుంబమంతా చెన్నై నగరానికి వలసవెళ్లింది. పిల్లలను మాత్రం నానమ్మ ఇంట్లో వదిలేశారు. 'నేను, చెల్లి.. తాత, నానమ్మతో ఇంటిదగ్గరే ఉండిపోయాం. నేను అప్పుడప్పుడు స్కూలుకు వెళ్తున్నాను. ఎక్కువసార్లు చేపల వేటకు వెళుతున్నాను. సముద్రంలో వేట చాలా ప్రమాదకరం. అయినా తప్పడం లేదు. ఇప్పుడు నా చదువు కంటే సంపాదనే మా కుటుంబానికి అవసరం' అని చెబుతున్నాడు రామ్.

వాతావరణంలో వచ్చే తీవ్ర మార్పుల వల్ల అసంఖ్యాక జనం పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటారు. ఇక్కడే పిల్లలు ఎన్నో ఇబ్బందులు పడతారు. తినడానికి, తాగడానికి కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి. అటువంటి పిల్లలు ఎంత మానసిక క్షోభ అనుభవిస్తారో..! 12 ఏళ్ల కుమారి తన అనుభవాన్ని ఇలా చెబుతోంది : 'తుపాను హెచ్చరిక విన్నప్పుడల్లా భయంతో ఒళ్లంతా చెమటలు పట్టేసేవి. స్కూలు మూసేస్తారని, చదువు ఆగిపోతుందని భయమేసేది. స్నేహితులు ఎవ్వరూ కనపడని దూరప్రాంతాలకు వెళ్లిపోవడం నాకు ఇష్టం లేదు. కానీ, తుపాను వచ్చిన ప్రతిసారీ తప్పడం లేదు.'

13 ఏళ్ల మధుమిత మరో చేదు అనుభవాన్ని చెబుతోంది : 'నేను స్కూలుకి వెళ్లాలంటేనే భయపడిపోతున్నాను. తుపాను రోజుల్లో అక్కడే మేం చాలా రోజుల పాటు దుర్భరంగా బతికాం. ఆ తుపానుకి మా ఇళ్లన్నీ కొట్టుకుపోయాయి. కట్టుబట్టలతో మిగిలాం. మమ్మల్ని పునరావాస కేంద్రాలకు తరలించారు. అది ఒక స్కూలు. అక్కడ ఎందరో కొత్తవాళ్ల మధ్య మేమున్నాం. అది నాకు నచ్చలేదు. ప్రతిసారీ అలాగే జరుగుతోంది. నాకు ఎదురైన చేదు అనుభవాల వల్ల ఆ స్కూలు నాకు నచ్చటంలేదు.' అంటోంది. ఇవన్నీ పెద్దలెవరూ పట్టించుకోని, పరిగణనలోకి తీసుకోని చిన్నవి అనుకునే పెద్ద విషయాలు.

మన దేశంలో ఏటా 2 కోట్ల 40 లక్షల మంది చిన్నారులు వాతావరణ మార్పులకు గురవుతున్నారు. క్రూరమైన అనుభవాలను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుండి సెప్టెంబరు 30 వరకు గల 274 రోజుల్లో 255 రోజులు వాతావరణంలో తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. ఈ పరిస్థితులకు ఎక్కువగా ప్రభావితమౌతున్న చిన్నారుల సంరక్షణ పట్ల మనం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాం? అని ప్రశ్నించుకుంటే ప్రత్యేకమైన జవాబు ఏమీ ఉండదు. ఎందుకంటే పిల్లల కోణంలోంచి మన సమాజం ఏ విపత్కర పరిస్థితినీ చూడదు కాబట్టి!

వాతావరణ మార్పులు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఈ పరిస్థితిపై సమగ్ర పరిశీలన చేయాలి. పిల్లల భద్రత, ఆరోగ్యం, విద్య, శ్రేయస్సును ఏవిధంగా ప్రభావం చూపుతుందో విశ్లేషణ చేయాలి. అప్పుడు పరిష్కారం దిశగా ఆలోచించగలం.

'నేటి పిల్లలు రేపటి భారతదేశాన్ని తయారు చేస్తారు. వారిని మనం పెంచే విధానమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది' అన్నారు జవహర్‌లాల్ నెహ్రూ. పిల్లల దృక్కోణంలోంచి ఆలోచించినప్పుడు, ప్రణాళికలు రూపొందించినప్పుడు మాత్రమే మనం మంచి భవిష్యత్తును నిర్మించగలం.

భారత్ హ్యాట్రిక్

థాయ్‌లాండ్‌పై 13-0గోల్స్‌తో భారీ విజయం

ఆసియాకప్ మహిళల హాకీ



పాట్నా: ఆసియాకప్ మహిళల హాకీలో ఇండియా హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకుంది. రాజ్‌గిరి హాకీ స్టేడియంలో గురువారం జరిగిన గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో భారత్ 13-0 గోల్స్‌తో థాయ్‌లాండ్‌ను చిత్తుచేసింది. మ్యాచ్ ప్రారంభమైన మూడో నిమిషంలో భారత్ ఒక గోల్ కొట్టింది. ఈ గోల్‌ను దీపిక చేసింది. థాయ్‌లాండ్ నలుగురు డిఫెండర్లను దాటి దీపిక గోల్ చేసింది. ఆ తర్వాత మనీషా చౌహాన్ తొలి అంతర్జాతీయ గోల్‌ను నమోదు చేసుకుంది. ఈ గోల్ పెనాల్టీ కార్నర్‌ద్వారా భారత్‌కు దక్కింది. ప్రీతి దూబే, లాల్‌రెమ్‌సియామి ఒక్కో గోల్ కొట్టారు. దీంతో భారత్ తొలి అర్ధభాగం ముగిసేసరికి 4-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. మ్యాచ్ మొత్తమ్మీద భారత్‌కు 11 పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. ఇక మూడో క్వార్టర్ చివరి మూడు నిమిషాల్లో భారత్ మరో నాలుగు గోల్స్ చేసింది. దీపిక ఐదు, ప్రీతీ దూబే, లాల్‌రిమిసిమి, బ్యూటీ డెంగ్, మనీషా రెండేసి గోల్స్ కొట్టారు. చైనాను దాటి భారత్ అగ్రస్థానంలో నిలవాలంటే 17గోల్స్ చేయాల్సి ఉండగా.. భారత్ 13గోల్స్‌కే పరిమితమైంది. దీంతో చైనా 4గోల్స్ ఆధిక్యతతో టాప్‌లో ఉండగా.. భారత్ రెండోస్థానంలో కొనసాగుతోంది. భారత్, చైనా జట్లు వరుసగా మూడు విజయాలతో సహా 9 పాయింట్లతో అగ్రస్థానంలోనే ఉన్నాయి. ఈ గెలుపుతో భారత్ సెమీస్‌కు మరింత చేరువైంది. తొలి మ్యాచ్‌లో కొరియాపై 3-2గోల్స్‌తో, ఆ తర్వాత మలేషియాపై 4-0తో గెలిచిన భారత్.. మూడో మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌పై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది.

అంతకుముందు మలేషియా జట్టు 2-1గోల్స్ తేడాతో కొరియాను చిత్తుచేసింది. దీంతో మలేషియా ఈ టోర్నమెంట్‌లో అత్యధిక ర్యాంక్ గల జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో చైనా 2-1గోల్స్ తేడాతో జపాన్‌ను ఓడించి

పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో	ఇ.గో.	గో.అ.	పా
చైనా	3	3	0	0	22	1	21	9
భారత్	3	3	0	0	20	5	15	9
మలేషియా	3	1	0	2	2	10	-8	3
జపాన్	3	0	2	1	4	5	-1	2
కొరియా	3	0	1	2	5	7	-2	1
థాయ్‌లాండ్	2	0	1	1	1	29	-28	1

ఆంధ్ర 168/2

హైదరాబాద్‌తో రంజీట్రోఫీ

హైదరాబాద్: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో భాగంగా హైదరాబాద్‌తో జరుగుతున్న లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర బ్యాటర్లు రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్‌ను 301పరుగులకే పరిమితం చేసిన ఆంధ్ర.. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించి రెండోరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 168పరుగులు చేసింది. ఆంధ్ర జట్టులో రషీద్(79నాటౌట్), కరణ్ షిండే(41నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 234పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్‌ను ఆంధ్ర బౌలర్లు విజయ్(5/118) ఐదు వికెట్లకు తోడు రఫీ రెండు, శశికాంత్, మోహన్ సందీప్ ఒక్కో వికెట్ పడగొట్టారు. దీంతో హైదరాబాద్ జట్టు 301పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర ఓపెనర్లు ఎం.రెడ్డి(9) నిరాశపరిచాడు. ఆ తర్వాత అభిషేక్ రెడ్డి(38), రషీద్ కలిసి 2వ వికెట్‌కు 67పరుగులు జతచేశారు. ఈ సీజన్‌లో ఆంధ్ర జట్టు ఆడిన మూడు మ్యాచుల్లో ఓటమిపాలైంది.

రెండోరౌండ్ సింధు ఓటమి

- **కుమమోటో మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ**

పారిస్: కుమమోటో మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. రెండోరౌండ్‌కు చేరిన ఏకైక షట్లర్ పివి సింధు.. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఓటమిపాలైంది. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో సింధు 21-17, 16-21, 17-21తో కెనడాకు చెందిన మిచ్చెలీ లి చేతిలో ఓడింది. తొలి గేమ్‌ను చేజిక్కించుకున్న సింధు.. రెండు, మూడు గేమ్‌లలో పోరాడి పరాజయాన్ని చవిచూసింది. తొలి గేమ్‌లో ఆరంభంలోనే సింధు 11-8పాయింట్ల ఆధిక్యత సాధించింది. ఈ మ్యాచ్ సుమారు గంటా 15నిమిషాలసేపు సాగింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సింధు 20వ ర్యాంక్ క్రీడాకారిణి కాగా.. మిచ్చెలీ 23వ ర్యాంక్ షట్లర్. మిచ్చెలీపై సింధు గతంలో కేవలం రెండుసార్లు మాత్రమే పరాజయాన్ని చవిచూడగా.. 10సార్లు విజయం సాధించింది.


టైటాన్స్ వరుస విజయాలకు బ్రేక్

ప్రొ కబడ్డీ సీజన్-11

లక్నో: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్ వరుస విజయాలకు బ్రేక్ పడింది. ఈ సీజన్‌లో తొలి మూడు మ్యాచుల్లో ఓడిన టైటాన్స్... ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచుల్లో గెలిచి సత్తా చాటింది. ఈ క్రమంలో గురువారం యుపితో తలపడిన టైటాన్స్ 34-40పాయింట్ల తేడాతో ఓటమిపాలైంది. సహీద్ విజయ్‌సింగ్ పాఠక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యుపి యోధాతో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో టైటాన్స్ తొలి అర్ధభాగం ముగిసేసరికి 20-18పాయింట్లతో ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత రెండో అర్ధభాగంలో తేలిపోయింది. రెండో అర్ధభాగంలో చివర్లో పుంజుకొనేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత టైటాన్స్ కేవలం 14పాయింట్లు మాత్రమే సాధించగా.. యుపి 22పాయింట్లు సాధించి విజయం దిశగా దూసుకెళ్లింది. దీంతో తెలుగు టైటాన్స్ 26పాయింట్లతో 6వ స్థానంలో కొనసాగుతోంది.

సిరీస్ కొట్టాలంటే.. గెలవాల్సిందే..!

- **దక్షిణాఫ్రికా చివరి టి20 నేడు**
- **రాత్రి 8.30గం॥ల నుంచి**



జొహన్నెస్‌బర్గ్: నాలుగు టి20ల సిరీస్‌లో 2-1 ఆధిక్యతలో నిలిచిన టీమిండియా.. ఇక సిరీస్‌పై దృష్టి సారిచింది. తొలి, మూడో టి20ల్లో భారీస్కోర్ నమోదు చేసి సఫారీలకు చుక్కలు చూపించిన భారత బ్యాటర్లు చివరి టి20ల్లోనూ కదం తొక్కాలని వేచి చూస్తున్నారు. డర్బన్‌లో సంజు శాంసన్, సెంచూరియన్‌లో తిలక్ వర్మ సెంచరీలతో కదం తొక్కారు. దీంతో ఈ రెండు టి20ల్లోనూ టీమిండియా 200కు పైగా పరుగులు చేసింది. సంజు, తిలక్‌లకు టి20ల్లో ఇదే తొలి సెంచరీ కాగా.. బుధవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 11 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఇండియా నిర్దేశించిన 220 పరుగుల లక్ష్యాన్ని చేరుకొనే క్రమంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జాన్సెన్ 17బంతుల్లోనే 54పరుగులు కొట్టి విజయంపై ఆశలు రేపాడు. కానీ చివర్లో అర్ష్‌దీప్ బౌలింగ్‌లో ఔట్ కావడంతో గెలుపు భారత్‌వైపు మొగ్గింది. ఇక రెండో టి20లో భారత బ్యాటర్లు నిరాశపరచడంతో 124పరుగులకే పరిమితమైనా.. ఆ మ్యాచ్‌లోనూ భారత బౌలర్లు సమిష్టిగా రాణించారు. 86పరుగులకే 7వికెట్లు పడగొట్టి గెలుపుపై ఆశలు రేపినా.. స్టబ్స్, కోర్జె బ్యాటింగ్‌లో మెరిసిన టీమిండియా విజయాన్ని అడ్డుకున్నారు. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు తమ గడ్డపై సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే ఆ జట్టుకూ గెలుపు అనివార్యం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68